
జ్ఞాన యోగం


విచారణ

వేదాంతపు కథలు


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

ఆర్కైవ్ వారి వెబ్ సైట్:

https://archive.org/



అతి విశిష్టం ఈ దానం!



"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం

శ్రీ గురుభ్యోనమః

పరిపూర్ణ రాజయోగ సిద్ధాంతము
వేదాంతపు కథలు

రచయిత

"పరిపూర్ణ దర్శనాచార్య సదానంద"

శ్రీ ఇలపకుర్తి వీర వెంకట రామచంద్రరావు

నర్సాపురం, ప॥గో॥జిల్లా

ముందుమాట

పరిపూర్ణ దర్శనాచార్య, సదానంద శ్రీ యిలపకుర్తి వీర వెంకట రామచంద్రరావు గారు, శ్రీ అచల ఋషి దయానంద పొన్నాల రాజ యోగీంద్రుల వారి అనుగ్రహముచే వారి దివ్యాశీస్సులతో శ్రీ శివరామ దీక్షితీయ సాంప్రదాయమును తమ గ్రంథ రచనల ద్వారా బహుళ ప్రాచుర్యము చేసి పాఠక లోకమును ఉత్తేజితులుగా జాగృతమొనరించినారు. వారి శిష్య ప్రశిష్యులు వలయు ఆర్థిక సంపత్తిని సమకూర్చి, వారి గురుభక్తిని వ్యక్తపరచుకొనుచునే ఉన్నారు.

అంతేకాక గురు ధర్మ నిర్వహణలో శ్రీరామచంద్రరావు గారు దంపతులు జరిపిన కృషిని, గడిపిన ఆదర్శవంతమగు జీవితమును లోకములో ప్రచారం చేయుటకై గురుదేవుల ఆశయ సంసిద్ధి కొరకు "శ్రీశ్రీశ్రీ సీతారామచంద్ర పరిపూర్ణ బోధోపదేశ మందిర సంస్థ" ను గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, యర్రబాలెం గ్రామంలో ఏర్పాటుచేసి శ్రీ గురుదేవుల ఆదర్శమును లోక కళ్యాణార్థము వివరించడంలో వారికి గల సహాయ సంపత్తిని అందించు చున్నారు. ఇది సహృదయులు సంతసించి ప్రోత్సహించవలసిన అంశము.

శ్రీ రామచంద్రరావు గారి రచనలన్నియు వారి గురుదేవులు శ్రీ శివరామ దీక్షితీయ పీఠాధిపతులైన దయానంద పొన్నాల రాజయోగీంద్రుల వారి దివ్యశ్రీ చరణములకు పూజాపుష్పములుగా సమర్పింపబడియున్నవి. అట్లే యీ భాగం కూడా యొక పూజాపుష్పంగా వారి చరణ సన్నిధి చేరాలని భక్తమండలి వారి తరఫున శ్రీ గురుపరమాత్మను ప్రార్థించు చున్నాము.

ఇట్లు

భక్తమండలి తరఫున

మంచిరాజు శ్రీనివాసమూర్తి

పీఠిక

రాజయోగి వేదాంత మాసపత్రిక యందు నాచేత, నాభార్య చేత రచింపబడి, ప్రకటింపబడిన పెక్కు అంశములు అన్నియు గ్రంథరూపములో ప్రకటించిన అవి శ్వాశత రూపములో నిలచి పరిపూర్ణ బోధ యందు కృషి చేయువారికి, పరిపూర్ణ బోధ ఎట్టిదో ఎరిగేటి వారికి సహాయకారిగా, ప్రామాణికముగా వుండునని భావించి, భక్తాదుల ఆర్థిక సహాయముతో ప్రత్యేక గ్రంథములుగా ప్రకటింపబడినవి. ఇంకనూ రాజయోగి మాసపత్రిక ద్వారా ప్రకటింపబడిన **"వేదాంతపు కథలు"** అన్నియూ క్రోడీకరించి ఒక ప్రత్యేక గ్రంథముగా ప్రకటింపబడుచున్నది. వేదాంతమందలి కఠినాంశములు, సులభ గ్రాహ్యమగుటకు కథలు రూపముగా ఇందు వివరించుట జరిగినది. పాఠకులు అందలి నిగూఢఘూంశములను గ్రహించి, ఉత్తేజితులైనచో ఈ గ్రంథ ప్రయోజనము నెరవేరినట్లే. ఈ గ్రంథము కూడా భక్తాదుల ద్రవ్య సహాయముతోనే ముద్రింపబడి, ప్రకటింపబడు చున్నది. ఈ ధర్మమునందు కృషి చేయుచున్న నిజామాబాద్ పట్టణ నివాసి శ్రీ లాబిశెట్టి క్రిష్ణయ్యగారు, శ్రీమతి రాధాభాయి దంపతులు ఈ గ్రంథమునకు ద్రవ్య దాతలు. వారి సంగ్రహ జీవిత చరిత్ర అన్యత్రా ప్రకటింపబడును. ఈ చిరంజీవులు శ్రీ గురుపరమాత్మ కృపచే వారి ఆశయ సిద్ధియందు ధన్యత చెందుదురు గాక! మా దంపతులకు గురుదేవులైన శ్రీ మదచల ఋషి దయానంద పొన్నాల రాజయోగీంద్రుల వారి దివ్యశ్రీ చరణ సరోజములకు మరొక పూజాపుష్పముగా సమర్పించుకుంటున్నాను.

ఇట్లు
బుధజన విధేయుడు
యిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు
నర్సాపురం

విషయ సూచిక

1. అశ్వనీ దేవతలు

స్వర్గలోకానికి ఇంద్రుడధిపతి ఆలోకంలో దేవతలే ప్రజలు ఆ దేవతలకు వైద్యులు అశ్వనులు లేక అశ్వని కుమారులు వారిర్వురు సోదరులు. పెద్దవాని పేరు నాసత్యుడు, రెండోవాడు దస్రుడు. వీరు వైద్యంలో మహాప్రతిభావంతులగుటచే వైద్యులుగా యశశ్శిఖరాల నందుకొని కించిద్గర్విష్ఠులై దేవరాజైన యింద్రుని కూడా నొకప్పుడు అవమానించిరి. ఇంద్రుడందుకు కోపించి వీరిర్వురికి యజ్ఞహావిర్భాగంలేకుండా చేసివైచెను.

అధర్వఋషి శిష్యుడైన దధ్యుడు అనే ఋషివర్యుడు అశ్వనికుమారులకు గురువుగా వుండి సకల విద్యలయందు వారినుత్తీర్ణులనొనర్చెను కాని వారు భోగలాలసులై యుండుటచే బ్రహ్మవిద్యోపదేశము మాత్రము చేయలేదు. తాము హావిర్భాగములు పోగొట్టుకొని యెట్లవమానంపాలైనదియు వివరించి అందుకు కారణభూతుడైన దేవేంద్రునిపై తమ ప్రతీకారవాంఛను వెల్లడించి అందుకు తగిన యుపాయము లేక మహావిద్య యుపదేశించి ఆశయసిద్ధిగావింపుడని గురువుగారిని అశ్వనులాశ్రయించిరి, "అట్టి కోరిక తగదు ప్రతీకారముచేస్తే యింద్రుడూరకోక తమయెడల తిరిగి ప్రతీకారమొనర్చును. యజ్ఞహావిర్భాగములు పొందుట అన్నది సామాన్యముగాదు. మీరు బ్రహ్మవిద్యాపారంగతులైనచో అది లభ్యముకాగలదు, కాని మీకు ప్రస్తుతం అందుకర్హత లేదు. కనుక 12 సంవత్సరములు గురుసేవచేసి అంత:కరణ పారిశుద్ధ్యము సాధించి గురుకృపకు పాత్రులై బ్రహ్మవిద్య నార్జించి హవిర్భాగములు పొంది అధికారులుకండు అని దధ్యుడు వారికి హితవు చెప్పెను.కాని అశ్వనులు అది అప్పట్లో తమకు సాధ్యము కాదని హవిర్భాగములు లభించు వుపాయాంతరము చెప్పుమని, ఆపిమ్మట తమకు బ్రహ్మ విధ్యోపదేశము గావించుడని అనేక విధముల ప్రార్థించిరి.అందుకు దధ్యుడంగీకరించి ఆలోచించి వారికి వుపాయాంతరము సూచించెను.

"చ్యవనమహర్షి" మహాతపశ్శాలి.కాని మహావృద్ధుడు.అతనికి రెండుకండ్లు లేవు.శరీరము శల్యావశిష్ఠమై పోయెను.అతని భార్య సుకన్య యవ్వనవతి.మీరాయనను ఆశ్రయుంచి కాయకల్ప చికిత్స ద్వారా యౌవన మిచ్చి నేత్రదృష్టి యొసంగుడు. అపుడాతడు సంప్రీతుడై హవిర్భాగములలో పాల్గొను అర్హత మీకీయగలడు" అని హితోపదేశము చేసెను.అశ్వనులానంద భరితులై చ్యవనమహర్షి ఆశ్రమమునకు పోయిరి.

దేవేంద్రుడు అశ్వనీదేవతల సంకల్పము నెరింగి విఘ్నము తలపెట్టి అశ్వనీ దేవతల

గురువైన దధ్యునికడకేగి ఆయన వల్ల అతిథి సత్కారము పొందెను.అతిథి కోరికను తెలిసికొని దానిని నెరవేర్చుట గృహస్తు ధర్మమైయున్నదని యెరిగిన దధ్యుడు దేవేంద్రుని ఆగమన కారణమేమో తెలుపవలసిందని ఆ కార్యము తప్పక నెరవేర్చెదనని యింద్రునికి వాగ్దానము చేసెను. ఐతే నాకు బ్రహ్మ విద్యోపదేశ మొసంగి కృతార్ధుని చేయుడని దేవేంద్రుడు వేడుకొనెను.దద్యుడు ధర్మసంకటమున పడెను. భోగాలాసుడై దేవ రాజ్యాధిపత్యముతో అధికారమదాందుడై దేవేంద్రునికి బ్రహ్మ విద్యోపదేశము చేయుటయా? అతడందులకు అధికారికాడే? పోని నీ కంధులకధికారము లేదు. పొమ్మనుటయా? అట్లా చేస్తే వాగ్దానభంగమగునేమో! దద్యుడు కొంతతడవాలోచించి చివరకు దేవేంద్రునికి ఉపదేశము చేయుటకే నిశ్చయించి దేవేంద్రునితో యిట్లనెను. రేపు ఉదయం నీకుపదేశ మిచ్చెదను. రాజలాంఛనము లన్నియు వదలి కౌపిన మాత్రధారివై సమిత్పాణివై రావలయునని ఆదేశించెను.దేవేంద్రుడటులనే వేషము మార్చి మరునాడుదయము దధ్యుని వలన బ్రహ్మ విద్యోపదేశము పొందెను.

అనంతరము దధ్యుడు బోధ చెప్పుటలో, భోగలాలసత్యముండరాదని రాజ్యమదము అధికారము రాగద్వేషములు వదలి గురుభక్తి కలిగి సంచరించవలెనని హెచ్చరించెను.దధ్యుడు చేసిన ధర్మప్రబోధ బధిర శంఖారావ మయ్యెన్ను. ఉపదేశానంతరము గూడా అతనికి గురువునందు భక్తిప్రపత్తులు కలుగ లేదు సరిగదా! ఆయన బోధలో తన్నవమాన పరిచినట్లు భావించెను.గురువు చెప్పిన ఆచరణ తాను చేయలేనని నిష్కర్షగా చెప్పివైచుటయేగాక, యింక మరెవరికైనా బ్రహ్మవిద్యోపదేశము గావించినచో తన వజ్రాయుధముతో దధ్యుని శిరశ్ఛేదము గావింతునని క్రోధోన్మత్తుడై పలికెను.కాని దధ్యుని ప్రసన్న వదనమునందు యెట్టి వికారములు లేక ప్రశాంతచిత్తుడై "ఓయీ నేనిక ఎవరికైన వుపదేశం చేసినచో అట్లే చేయుము" అని మిన్నకుండెను.దేవేంద్రుడు సంతుష్టుడై వెడలిపోయెను.అట చ్యవనమహర్షి కడకేతెంచి అశ్వని కుమారులు వచ్చిన కార్యము దెల్పి, తమ వైద్యచికిత్సచే, ఆయనకు నేత్ర దృష్టి కల్గించుటయే కాక, కాయకల్ప చికిత్సచే వినూత్న యౌవ్వనమును సుందర శరీరమును ప్రసాదించిరి. చ్యవనమహర్షి సంప్రీతుడై తాను స్వయముగా నొక మహాయజ్ఞమును సంకల్పించి, అందు యింద్రాది ప్రధాన దేవతలతో పాటు అశ్వనీ దేవతలకు గూడా హవిర్భాగము లు అందునట్లు చేసెను.అంతటి నుంచి వార్కి ప్రతియజ్ఞములోను హవిర్భాగములు పంచి యివ్వబడు

చుండెను.అశ్వనీ కుమారులు అంతటితో ప్రశాంత చిత్తులై పూర్వ కామక్రోధములను విడచిన శుద్ధాంత: కరణములతో ప్రవర్తిల్లిరి.

బ్రహ్మవిద్యకు అధికారులమైతమని సంతసించుచూ తమ గురువర్యుడగు దధ్యుని కడకు వినయ వినమ్రత గాత్రులై సమిత్పాణులై అరుదెంచి బ్రహ్మ విద్యోపదేశ మర్థించిరి.దధ్యుడు మరల ధర్మసంకట స్థితిలో పడిపోయెను.బ్రహ్మవిద్యాదీక్షనిత్తునని అశ్వనీ కుమారులకు వాగ్దానమెనర్చి యిపుడు కాదనుట యెట్లు వాక్కు నిలబెట్టు కొనుటకే ఆయన నిశ్చయించుకొనెను. తన ప్రాణములయందాతనికి వ్యామోహము లేదు జరిగిన వృత్తాంతమంతయు గురువుగారి వలన తెలుసుకొని అశ్వనులు యించుక తడవు దు:ఖనిమగ్నులైరి.కాని అంతలో వారిలో చిన్న వాడైన ద్రుస్యునికి గురువర్యుని ప్రాణములు రక్షించునుపాయమొకటి వాటిల్లత వలె వారి హృదయమున తళుక్కు మనెను.ఆనందముతో నాతడొక గంతువైచి తనకు తట్టిన యుపాయమును యిట్లు వివరించెను.ముక్కముక్కలుగా చేదింపబడిన శరీరావయవములను సహితం జయ ప్రదంగా అతికించగల వైద్యనిపుణత్వము మనకు గలదు గదా.ముందుగా నొక గుర్రపు తల నరికితెచ్చి వుంచుకొని గురువుగారి శిరస్సు నరికి దానిస్థానే గుర్రపు తల అతిక వేయుదము.గుర్రపుతలతోనే గురువుగారు మనకు బ్రహ్మవిద్యోపదేశము చేతురు. అప్పుడింద్రుడు గురువుగారి శరీరమున కలిగియున్న గుర్రపుతలను తనవజ్రాయుధము చే ఖండించివేయును.ఆపిదప గురువుగారి తలను గుర్రపుశరీరము నుండి తెచ్చి యధాప్రకారముగా గురువుగారి శరీరమునతను గుర్రపుతలను గుర్రమునకును అతికించి వేయుదుము. అపుడు గురువు గారున్ను,గుర్రమున్ను యదారీతి బ్రతికియే యుందురు.ఇంద్రునకు కూడా యిందువలన బ్రహ్మహత్య పాతకము చుట్టుకొనదు. దధ్యుడు పై వుపాయమునకు అంగీకరించి గుర్రపుతలతో అశ్వనీ కుమారులకు బ్రహ్మవిద్యనుపదేశించెను.ఇంద్రుడు వచ్చి దధ్యుని గుర్రపుతలను తన వజ్రాయుధముతో ఖండించెను.వెంటనే అశ్వగ్రివమున నున్న దధ్యుని శిరస్సును తెచ్చి దధ్యును శరీరమునకు అతికించి, దధ్యుని ప్రబోధ నాలకించి అశ్వనీ దేవతలు కృతార్థులైరి.

2. అశ్వినుల అనుగ్రహము

పూర్వము కేరళదేశములో నంబి అనే బ్రహ్మణుడు ఆలత్తూరు అనే గ్రామమున నివసించువాడు.అతనియింటి సమీపములో నొక దేవాలయము వుండెడిది.ప్రతి దినము దేవాలయమున కేగి నంబియా దేవుని నర్చించి వచ్చెడివాడు.నంబి వైద్యవిద్యయందు బాగా నిపుణుడు,దేవాలయమున కేగు దారిలో నొక వృక్షముపై కూర్చుండి రెండుపక్షులు ప్రతిదినము నంబాదేవాలయము నుండి వచ్చునపుడు "ఎవ్వడరోగి"? అను అర్థము వచ్చునట్లు కూయుచుండెను.ఆప్రశ్న తన్నే వేయుచున్నట్లు నంబికి స్పష్ట మాయెను. చివరకు ఒకరోజున అతడు యిట్లు జవాబు చెప్పెను."సకాలమున కెవడు మితాహారము భుజించిన పిదప కొద్దిగా నడుచునో, ఆ పిదప ఎడమప్రక్కకు తిరిగి పడుకొని విశ్రాంతి గైకొనునో,సక్రమముగా విసర్జన క్రియ ఎవనికి నడచునో,ఎవడు స్త్రీ లాలసుడు గాడో వాడారోగ్యవంతుడు లేక అరోగి అని సమాధానము చెప్పెను.నాటినుండి ఆ పక్షులట్ల రుచుట మానివేసెను.

కొంత కాలమునకు ఇద్దరు బ్రాహ్మణబాలురు నంబి వద్దకు వచ్చి తమ్ము శిష్యులుగా చేసుకొని వైద్యవిద్య నేర్పుడని ఆశ్రయించిరి.వారలముఖముల జూచి వారిని మహాప్రజ్ఞావంతులని గుర్తుంచి, నంబి వెంటనే శిష్యులుగా అంగీకరించెను.

ఆ బాలురిద్దరు బహు శ్రద్ధగా వైద్యవిద్యనభ్యసించుచుండిరి.మహాప్రజ్ఞ చూపుచూ క్లిష్ట ప్రశ్నలు వేయుచు గ్రంధశ్లోకములకు అన్యబావార్థములు సూచించుచూ వాదించుచుండిరి. వారిప్రజ్ఞా విశేషమునకు గురువుగారు అచ్చెరువొందుచు ఏ మాత్రము విసుగు చెందక వారికి సంతోషముగ విద్య గరపుచుండిరి మరియు ఆ విద్యార్థులు అల్లరి చేయుచుండిరి. కొంటిపనులు చేయుటలో వారికి వారేసాటి. ఐనను గురువుగారు వారియందలి ప్రేమచే వారిపనులకు చికాకుపడక సహించుచుండిరి.

ఒకసారి గురువుగారింట లేనపుడు యింటి ముందున్న పాక వుద్దేశ పూర్వకముగా నిప్పంటించి వారు భస్మీపటలము గావించిరి.కాని గురువుగారు మందలింపుగానైన ఒక్క మాట పలుకరైరి.

మరొకమారు గురువుగారు ఇంట తద్దినము వచ్చెను వంట పూర్తి అయ్యెను. గురువుగారు స్నానము చేసి పితృ కార్యము నిర్వర్తించవలెను. ఆ సమయమున

నీచకులస్తులెవరో వచ్చి బిచ్చమడిగిరి. శిష్యులు వంటింటిలోనికి పోయి వండిన పదార్థములు వారికి పెట్టి వేసిరి. గురువు గారు వచ్చి జరిగినది తెలుసుకొని ఏమియు వారిని మందలించక మరల వంట చేయించి తద్దినము పూర్తిగావించుకొనెను.

యింకొకసారి గురుశిష్యులు నది దాటుటకు వంతెనమీదుగా అద్దరి కేగుచు నదిమధ్య భాగమునకు వచ్చిన తోడనే శిష్యులిద్దరు గురువుగారిని ఎత్తి నదిలోనికి విసిరి వేసిరి. గురువుగారికి అదృష్టవశాత్తు ఈత వచ్చినందున ప్రాణాపాయమును తప్పించుకొనెను. ఈతడవు కూడా గురువు శిష్యులను ఏమీ మందలించ లేదు.

ఒకనాడు గురువు గారింటలేన్నపుడు, విపరీతమగు తలనొప్పిచే బాధపడుచు నొక రోగివచ్చెను. శిష్యులు రెండురకముల ఆకులు తీసుకు వచ్చి ఆరోగిని ఒక గదిలోనికి తీసుకోనిపోయి గదితలుపులు కిటీకీలు అన్ని మూసివేసి లోన బంధించిరి. యింటిలోని పిల్లలు లోపల ఏమి చేస్తున్నారో కీటికీ సందుల నుండి చూచుచుండిరి. రోగి కనురెప్పల పై ఒక రకపు ఆకుల పసరును పిండినంతనే రోగి సృహ తప్పెను. మరొక రకపు పసరును నెత్తిపై గట్టిగా రుద్దిన తోడనే శిరో భాగము యొక్క పై డిప్ప వూడివచ్చెను. ఆ పెంకును వారు జాగ్రత్తగా పరిశీలంచగా అందులోపలి భాగమున కొన్ని రోగక్రిములంటి యుండెను.వానిని జాగ్రత్తగా గోకివేసి ఆడిప్పను తలకతికించి మరల నొక పసరు పిండుటతోడనే యధాప్రకారం అది అతుక్కు పొయెను. కొన్ని క్షణములలో మెలకువ చెంది భాదావిముక్తుడై రోగి నవ్వుచు వెడలిపోయేను.

గురువుగారీ సంఘటనను పిల్లల వలన తెలుసుకొని తమ శిష్యులు సాధారణ మానవులు గారనీ దేవతాంశ సంభూతుల నిన్ని తన పూర్వము అభిప్రాయము స్థిర పరుచుకొనెను.

ఆ మరునాడే శిష్యులు భయులు గురువుగారిని సమీపించి తామిక వుండుటకు వీలులేదని వెళ్ళిపోవుచ్చున్నామని శెలవడిగిరి. అపుడు గురుశిష్యులు యీవిధముగా సంభాషించిరి.

గురువు : మీరెవరు? మానవులేనా?

శిష్యులు : సరే మానవులము కానిచో పక్షులమో దేవతలమో

గురువు : మాయింటి ముందరిపాక నేలభస్మము చేసినారు?

శిష్యులు : ఆ కాలమున మీ స్థలములో అగ్నిప్రమాదము జరగవలసి యున్నది.

అందువల్ల జరిగే నష్టము తగ్గించుటకై అచిన్న పాకను తగలబెట్టితిమి.
గురువు : తద్దినము కొరకు వండిన వంటనే ఆనీచకులస్తుల కేలపెట్టితిరి?
శిష్యులు : వారు నీచకులస్తులుగారు. సాక్షత్తు మీ పితృ దేవతలే. శ్రాద్ధకార్యము ఆలస్యమై ఆకలిగొని వచ్చినారు. అపుడు వారికి పెట్టి పంపనిచో మిమ్ము మీ వంశమును శాపమిచ్చి నశింపజేసెడి వారే
గురువు : ఐతే నన్ను నదీజల మధ్యమున నేలపడు వేసినారు ?
శిష్యులు : ఆ సమయములో, గంగా, యయునా, సరస్వతులు ఆ నదియందు చేరుటచే ఆ నదీజలములు పుణ్యవంతములై యుండెను. అపుడా నదీ స్థానముచే మీరు మంచి లబ్ధి పొందగలరని అట్లు చేసితిమి అని సమాధానములు చెప్పిరి.

పిదప, మీకు గురుదక్షిణగా ఈ చిన్న తాటియాకుల గ్రంధమిచ్చుచున్నాము. ఇది మీకు క్లిష్టమైన వైద్య విషయమేదయిన తటస్థ పడిన యెడల ఇది మీకు చాలా సహాయపడగలదని ఆ గ్రంధమిచ్చి తమ కుటుంబములో వారు తప్ప అన్యులకా గ్రంధ మీయవద్దని హెచ్చరించి వెడలిపోయిరి.

3. గురుని ఆవశ్యకత (1)

ఒక గొఱ్ఱెల కాపరికి అరణ్యంలో అపుడే పుట్టిన సింహపు పిల్ల ఒకటి దొరికెను. దానినాతడు గొఱ్ఱె పిల్లలతో పాటు పాలు పచ్చిక వగైరాలతో పెంచి పెద్ద దానిని చేసెను. సింహపు పిల్ల మంసాహారమే ఎరుగదు. కానీ దాని ఉపాధి ధర్మములను అనుసరించి రాత్రి కాలములయందు మేల్కొని యుంటూ యజమాని మందలో తిరుగుచుండెను. ఈ సింహపు పిల్లను చూచి భయపడి తోడేళ్ళు, చిరుతపులులు, పులులు మొదలగునవి ఆ మందజోలికి వెళ్ళుట మానివేసెను. మంద సురక్షితముగా వృద్ధి అగుచుండెను. ఒక పౌర్ణమి రాత్రి సింహమొకటి ఆహరాన్వేషణలో యీ మందకడకేతెంచి కాపాలా కాయుచున్న యీ పడుచు సింహమును జూచి యుక్తిచే దాన్ని తనకనుకూలం చేసుకొనవలెనని దలచి దానివద్ద కేతెంచి, "సింహమై యుండి యిక్కడెందు కున్నావు?" అయ్యో! సరియైన ఆహరము లేక యెంతచిక్కిపోతివి?"అని జాలి చూపించెను. "నేను సింహమును కాను నేను గొఱ్ఱెనని నేను తినే ఆహారము నాకు చాలు" అని పడుచు సింహము సమాధానము చెప్పెను. "కాదు నీవు నావంటి సింహానివి" అనిఎంత చెప్పినా

విననందున ముసలి సింహమాపడుచు సింహమును ఒక నదీతీరమనకు గొంపోయి ముందు తనముఖమును బాగా చూడుమని చూపించి పిదప తమ ముఖములొకచో నుంచి వాని ప్రతిబింబముల రెంటినీ చూపించి తనది సింహపు రూప మగునో కాదో చూచుకొమ్మనెను. పడుచు సింహం బాగా అవలోకించి తాను గొఱ్ఱియే కాదని, సింహమని పూర్తిగా సంతృప్తిపడి ఐతే "నేనేమి చేయవలె"నని వృద్ధ సింహమును ప్రశ్నించగా "నీవు సింహమువలె జంతువులను చంపి వాని వేడి వేడి నెత్తురు మాంసములను భక్షించవలెను. బలాఢ్యుడవై మృగరాజువై ఈ అడవినందలి మృగము లన్నిటిని పాలించవలెను. ఆ విధానమంతయూ నెర్పెదను, రా" అని యా గొర్రె మందలో పడి జంతువును ఇట్లు కొట్టవలె. వేడి వేడి నెత్తురు మాంసములను యిట్లు ఆరగించవలె." అని సింహము యొక్క ఆహార వివరములను రాజటీవియును నేర్పి పూర్తిగా తన స్వరూప స్వభావములు కలదానిగా చేసెను. అట్లే సద్గురుడు నీవు జీవుడవు కావు పరమాత్మ స్వరూపుడవు, అనగా అట్టి స్వరూప స్వభావములు కలవాడవు. నీవు నా వలె వర్తించుచూ అశరీరుడవై రాజయోగపు రీవితో ఇహమందు సర్వభోగములు యాద్రుచ్ఛ లాభ సంతుష్టితో అనుభవించి జన్మ రాహిత్యమును గాంచవలెనని చెప్పి, చూపించి, తానాచరించి, శిష్యునిచే ఆచరింప చేయుటకు గురువు అత్యంత అవసరమై యున్నాడు.

4. గురుని ఆవశ్యకత (2)

ఒక లక్షాధికారియగు షావుకారు తన ఆస్తియంతయూ తన కూమారులకు పంచి యిచ్చి చనిపోయెను. వారాస్తి కొద్ది సంవత్సరములలోనే దుర్వినియోగం చేసి పాగొటుకొనిరి. తండ్రి ఆ గ్రామంలో మిక్కిలి భాగ్యవంతుడని ప్రతీతికదా ! ఏమైన ఆయనకు రావలసిన బాపతు సొమ్ము లెవరెవరి వద్దనైననూ మిగిలియున్న వేమో చూతమని లెఖ్ఖల పుస్తకములన్నియు శోధించగా నోకచోటనొక ఖర్చు పద్దు వారికగు పించెను. "మార్గశిర శుద్ధ ఏకాదశి రోజున వుదయం 9 గంటలకు గోపురము క్రింద పూడ్చి పెట్టబడినవి. పది లక్షల రూపాయిలు" ఆ గోపురమున్నూ వారి తండ్రి కట్టించినవే. గోపురం పడగొట్టి తిరిగి కట్టించిననూ లక్షరూపాయల కంటే ఎక్కువకాదు. కనుక గోపురం పడగొట్టినచో 10 లక్షల రూపాయిలు తమకు చిక్కగలవు అను ఆశతో తమవద్ద మిగిలిన సొమ్ము కూడా ఖర్చుచేసి గోపురమును పూర్తిగా పడగొట్టి కొన్ని నిలువల

లోతు వరకు త్రవ్వి వేసిరి. కాని ఎంత వెతకినా వారి కొక చిల్లిగవ్వకూడా దొరకలేదు. వారు, మరీ పేదవారై కూటికి గుడ్డకు కూడా లేనివారై అష్టకష్టములు పడుచుండిరి. తండ్రి కట్టించిన గోపురమును కూడా కూలద్రోయించిన దుర్మార్గులు. వీరికే పోయేకాలము కనుకనే వీరీ విధంగా దరిద్ర దుఃఖము ననుభవించు చున్నారని ప్రజలు వారిననేక విధముల దూషింపసాగిరి. ఒకనాడు వారి తండ్రి కాప్తమిత్రుడగు షావుకారు దూరదేశము నుండి ఆ ప్రాంతమునకు రావటం తటిస్థించి తన మిత్రుని చూసిపోదమని ఆ గ్రామము వచ్చెను. తన మిత్రుడు చనిపోవుటయు తన కుమారులాస్తినంతయు పాడుచేసుకొనుటేగాక తండ్రి కట్టించిన గోపురము గూడా పడగొట్టి అష్టకష్టములను భవించుటయు విని తన మిత్రుని కుమారులను పరామర్శించుటకు వచ్చెను. వారంతవరకూ రహస్యముగా నుంచిన లెఖ్ఖ పుస్తకములోని పద్దునాతనికి చూపి గోపురం కూల గొట్టించిన కారణము, యిదియని ఆతనికి తెలియజేసిరి. తన మిత్రుడు సత్యవాది. ధర్మాత్ముడు, లెఖ్ఖ పుస్తకములో అసత్యము వ్రాయునా? అని యెక మూహర్తమా లోచించి యదార్థమును తెలుసుకొని తాను కొంత కాలమునకు తిరిగి వత్తుననియు ఆలోగా పడగొట్టబడిన గోపురము అచ్చముగా ఏనమూనాలో ఎంత ఎత్తున స్తలములో కట్టబడి వుండెనో అదే స్థలంలో అదే నమూనాలో అదే ఎత్తున గోపురం కట్టించి అదే మాదిరి శిఖరం పెట్టించవలసినదిగా ఆదేశించి గోపురం కట్టుబడి నిమిత్తం ఒక లక్ష రూపాయిలున్నూ వారు మామూలు హోదాలో నివశించుటకై ఒక్కొక్కరికి వేయి రూపాయుల చొప్పునన్ను యిచ్చి వెడలిపోయెను. అతడాదేశించిన ప్రకారం ఆ షావుకారు కుమార్లు గోపురం కట్టించి ప్రజల మన్ననలకు పాత్రులై సుఖముగా కాలక్షేపము చేయసాగిరి.కొంత కాలమునకు వారి తండ్రిగారి మిత్రుడు తిరిగి వచ్చెను. ఆ మరునాడే మార్గశిర శుద్ధ ఏకాదశి. ఏకాదశి రోజున ఉదయం సరిగా 9 గంటలకు గోపుర శిఖరం యొక్క నీడ వారి దొడ్డిలో నొకచోట పడెను. ఆచోటును గుర్తించుటకై చుట్టూ గీతగీసి ఒక నిలువలోతున త్రవ్వించెను. అపుడు వారికి అచ్చట ఆ ధనమంతాయూ దొరికెను. లెక్కించగా సరిగా పదిలక్షలూ పైసా తక్కువ లేకుండా నుండెను. తాను పెట్టిన పెట్టుబడి అందుండి తీసుకొని మిగతా మొత్తం ఆ నల్గురు కుమార్లకు పంచియిచ్చి వివేకముగల ఆ బుద్ధిమంతుడు యదేచ్ఛగా వెడలిపోయెను. ఆ ప్రజ్ఞాశాలి ఆ పద్దులోని ప్రతి అక్షరమునకు తగినవిలువ నిచ్చిలక్ష్యార్థమును గ్రహించి యా రహస్యమును గుర్తించుట

వలన కదా తమకు మహోపకారము జరిగినది. ఆ షావుకారు కుమార్లు ఆ జన్మాంతము అతనికి కృతజ్ఞులై సుఖముగా నుండిరి. అట్లే గ్రంధముల యందు గూఢముగా గురుగోప్యమగు విషయములు నిక్షిప్తమైయుండును.ఆ విషయములు ఆయా సాంప్రదాయక గురూత్తములకే తెలియును. గ్రంధములుండనే యున్నవిగదా! యిక గురువెందుకు? అని అనుకొని వూరుకొంటే లెఖ్ఖపద్దుకు సరియగు అర్ధము తెలియక నష్టముల పాలైన షావుకారి కుమారుల వలె ఎట్టి ప్రయోజనమున్నూ పొందలేరు. సరిగదా అనర్ధముల పాలగుదురని తెలుసుకొనవలెను. ఐతే గ్రంధములు కేవలం నిష్ప్రయోజనము! అంటే అవి పాఠకులకు గ్రంధస్త విషయమందలి వుత్సాహము కల్గించి గురువుల వద్దకు గొని పోవుట కవి. మాత్రమే ఉపకరించును. అందుకే "గురోన్ముఖేన జ్ఞాతవ్యంనాన్యధాగ్రంధకోటిభి" అన్నారు పెద్దలు.

5. శుష్క వేదాంతము - శూన్య హస్తములు

కలువాయి అనియొక గ్రామముండెను. ఆ గ్రామ మందలి స్త్రీ పురుషలెల్లరు వేదాంతులే. ఒకప్పుడు నడి వేసవిలో మిట్ట మధ్యాహ్నమున ఒక బ్రాహ్మణ బాటసారి, ఆ గ్రామము మీదగా పయనమై పోవుచూ ఆకలి బాధ కాగలేక ఒక ఇంటికడ కేగి, అమ్మా భోజనము పెట్టుమని ఆ యింటి ఇల్లాలిని యాచించెను. ఆమె అంతకు పూర్వమే భోజనము ముగించి తాంబూల చర్వణము చేయుచూ యీ మాటలు విని "ఏమయ్యా నీవు చదువుకొన్న బ్రాహ్మణుని వలెనున్నావు. అంతయు బ్రహ్మస్వరూపము గదా? నీవూ, నేనూ, అన్నము సర్వము బ్రహ్మస్వరూపమే ఎవరిని, యెవరు, ఏమికావెలనని అడుగదగును? అని వేదాంతము మాటలాడదొడగెను. ఈమెకేమైనా మతిచలించనదేమో ననుకొని బాటసారి మరియొక యింటకేగెను. ఆ యింటి యిల్లాలు కూడా అదే ధోరణిలో మాటలాడసాగెను. పాపమా బ్రాహ్మణుడేయింటికేగిననూ యిట్టి వేదాంతోపన్యాసములే గాని పట్టెడన్నము పెట్టువారు దొరకరైరి. చివరికి ఆ బ్రాహ్మణు డూరి బైట నున్న చెర్వులో స్నానం చేసి కడుపు పట్టిన నీరు త్రాగి ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసుకొను చుండెను. ప్రొద్దు వాలి పోయెను. సాయంత్రపు వంట ప్రయత్నములో వూరి వనితలు ఒకరొకరుగా మంచి నీటికై చెరువుకు రాసాగిరి. యంతలో, తొలుదొల్త వేదాంతోపన్యాసము గావించిన యామె బిందెగైకొని నీటికై వచ్చి బిందెగట్టుపై నుంచి

స్నానముకై చెరువులో దిగెను. వెంటనే ఆ బాటసారి బాపనయ్య లేచి ఆ బిందె చేత పట్టుకొని దారిపట్టెను. బిందె, బిందె, దొంగ, దొంగ, అని అరుస్తూ తడిబట్టలతో ఆమె యాతని వెంటబడెను. పలువురు గ్రామస్థులాతనిని పట్టుకొని ఏమిటీ పట్టపగలు దొంగతనమని యాతని నిలదీసిరి. అయ్యా, నేను బ్రహ్మం, ఆ యిల్లాలును బ్రహ్మమే యీ బిందెయూ బ్రహ్మమే, యజమాని యెవరు? దొంగ యెవరు? అంతయూ బ్రహ్మస్వరూపమే అని ఎలుగెత్తి వుపన్యసింప దొడగెను. మధ్యాహ్నామాతడు భోజనము కొరకై గ్రామమంతటా తిరిగిననూ యిట్టి వేదాంతము తప్ప ఒక్క కబళం పెట్టిన వారు లేరని జరిగినదెల్ల నాతడు వివరించెను. గ్రామమందలి స్త్రీ పురుషులెల్లరూ సిగ్గుపడి శుష్క వేదాంతము శూన్య హస్తములు ప్రదర్శించుట మానుకొనిరి. నాటి నుండి ఆ గ్రామము పేరు మీదుగా మెట్ట వేదాంతమునకు కలువాయి వేదాంతమని పేరు వచ్చెను.

ఈ కథ యందు తానూ, అన్నమూ, సర్వము బ్రహ్మమే కనుక భోజనమెందుకు? అని అడిగిన యిల్లాలు తాను భుజించుట మానినదా? తనకవసరమైన భోజనము యితరులకు అవసరం కాదా? కనుక వేదాంతం తెలియుట యందు రెండు విధములు కలవు.

1. అన్వయ విధానము : సుఖప్రాప్తికి దుఃఖ నివృత్తికి తానెట్లు తాపత్రయ పడుచున్నాడో. అట్లే యితరులున్నూ అని గుర్తెరిగి వారి క్షేమమునకై కూడా చేతనైనంతలో తాను కృషిచేయవలెను. యిది రాజయోగ పద్ధతి.

2. అన్వయ వ్యతిరేక విధానము : యితరుల సుఖ దుఃఖముల పట్ల తానేమీ పట్టించుకొనక, కేవలం ఎట్లు ఉదాసీనత వహించుచున్నాడో, అట్లే తన కష్ట సుఖములను కూడా ఏ మాత్రము లెక్కచేయక ఉదాసీనత కల్గియుండుట. ఇది సన్యాసి పద్ధతి.

వేదాంతము తెలుసుకొన్నందుకు ఆచరణకు యందప్రమత్తుడై మెలిగినచో సార్ధకము. లేనిచో కలువాయి వేదాంతము అపహాస్యము పాలగుట తథ్యము.

6. మెట్ట వేదాంతము

ఒక రాజధానీ నగరమున యొక యేనుగునకు పిచ్చెత్తి వీధుల వెంబడి పరుగులిడుచుండెను. వేదాంత వాక్యములను నేర్చిన యొకానొకడా వీధిని పోవుచుండగా వెనుక నుండి యేనుగు పరుగులిడుచు తన వైపు వచ్చుచుండుట గాంచి యాతడు పారిపోయెను. అతని మిత్రుడొకడాతని జూచి నవ్వుచూ, ఏమయ్యా! నీవు వేదాంతం నేర్చుకున్నావు? "బ్రహ్మసత్యం, జగన్మిధ్య" అని ఎక్కడ పడితే అక్కడ వుపన్యాసాలిస్తావు. జగత్తు మిధ్య అయితే ఏనుగు మిథ్య కదా! అది తరుముకొని వస్తే భయపడి ప్రక్క సందులలోనికి ఎందుకు పలాయనం చిత్తగించావు మరి." అంటూ ప్రశ్నించాడు. అందుకాతడు సమాధానంగా "అవును గజమూ మిధ్యేనాపలాయనము మిథ్యే" అన్నాడట.

ఇది, మెట్ట వేదాంతమునకు ఒకటో రకం నమూనా, ఏ పాప కార్యాలు చేసినా, యీ విధంగా వేదాంతం చెప్పుకొని, ఆ పాప కార్యములన్నీ మిథ్యయే యని సమర్ధించుకొంటూ మరీ మరీ అవసరానుసారం ఎన్ని పాప కార్యాలైనా చేస్తూనే వుండవచ్చు. కానీ న్యాయస్థానంలో ముద్దాయిగా నిలబడి నేను చేసిన దొంగతనం మిథ్యే మీరు చేసే దొరతనము మిథ్యే అంటే అతని నేరము నాకు నిష్కృతి లభించునా? "నేను, నీకు విధించు శిక్షా మిథ్యే. ఒక సంవత్సరం కఠిన శిక్ష నీకు విధిస్తున్నాను" అని న్యాయాధిపతి తీర్పు చెప్పడా?

మరొకపుడు ఇట్లే మదొన్మత్తమాతంగా మొకటి చెలరేగి పై నున్న మావటి వాని అంకుశాఘాతములైనా సరుకుగొనక వీధుల వెంట పరుగులిడుచుండెను. "సర్వం ఖల్విదం బ్రహ్మ" నేహనా నాస్తి కించన" యిత్యాదిగా వేదాంత పాఠములు నేర్చుకొనుచున్న విద్యార్థి యెదురుగా వచ్చు చుండెను. మావటివాడు తప్పుకో! తప్పుకో! యీ యేనుగునకు పిచ్చెత్తింది అని అరచుచుండెను. జనులు పికాపకలై యిటునటు పారిపోవుచుండిరి. అంతయూ బ్రహ్మమైతే, యీ పిచ్చి యేనుగు మాత్రం బ్రహ్మము కాదా? నేనెందుకు తప్పుకోవాలి?" అని అనుకొంటూ ఆ విద్యార్థి నిర్లక్ష్యముగా నడచి వచ్చు చుండెను. యింతలో యేనుగు వచ్చి అతనిని తొండముతో జుట్టి దూరంగా విసరివేస్తే తన దారిని తాను పోయెను. విద్యార్థి కాయమంతయూ గాయముల పాలయ్యేను. అతడట్లే గురువు చింతకే తెంచి "అయ్యా! మీ మాటలు నమ్మి నేను

దుఃఖముపాలైతి"నని జరిగిన దంతయూ చెప్పి గురువునూ ఆ గురుబోధనూ దూషింప దొడగెను. "నాయనా, నేను చెప్పిన శ్రుతి వాక్యము లసత్యములు కావు. నీవూ బ్రహ్మమే. యేనుగుయూ బ్రహ్మమే. యేనుగు నెక్కిన మావటివాడునూ బ్రహ్మమే. అతని కేకలు విని పారిపోయే ప్రజలున్ను బ్రహ్మమే. బ్రహ్మమైన మావటివాని వాక్కులు బ్రహ్మవాక్కులు కావా? వానినెందుకు పాటించలేదు? అని గురువాతనిని మందలించెను.

కనుక సర్వమూ బ్రహ్మమేనని, సంపూర్ణముగా ఆత్మదృష్టి చూచి యుండవలెనే గాని, తనకనుకూలమైనంత వరకూ మాత్రమే వేదాంతమును పాటించి, తన అహంకారము వదలక స్వార్థమును విడువక యుండు నెడల అదియును మెట్ట వేదాంతమే కాగలదు.

7. మోసకారి భక్తులు - 1 (ఆషాఢ భూతి)

పూర్వమొక గురువుగారి వద్ద అమూల్యమైన సూర్యకాంతమణి యొకడుండెను. ఈ సంగతి నెవరికి దెలుపక ఆ మణిని పరుండే బొంత లోపలి భద్రమొనర్చి క్షణమైన ఆ బొంతను వదలక గురువుగారా రత్నమును యెంతో జాగ్రత్తగా కాపాడుకొను చుండెను. యీ సంగతి యెట్లో, గ్రహించిన మోసకారి యెకడా రత్నమును యెటులైన సంగ్రహించి కాజేయవలెనని సంకల్పించెను.

ఈ సంకల్పంతో ఆ గురువుగారి నాశ్రయించి ఆయన శిష్యుడై వెనువెంట దిరుగుచూ గురువుగారి యందమితమగు భక్తి శ్రద్ధలు నటించి శేవాశుశ్రూషలు చేయుచూ తన యందు నమ్మకము కుదురుటకై వేయి విధంబుల ప్రయత్నించుచుండెను. గాని గురువుగారు బొంతను మాత్రము క్షణమైన వీడక జాగరూకుడయ్యే మసలుచుండెను. కనుక శిష్యునికా రత్నమును సంగ్రహించుట కవకాశము దొరకలేదు. పట్టు వీడక సమయమునకై అతడు వేచియుండెను.

ఒకనాడు గురుశిష్యులిరువురును ఒకరియింట భిక్ష ముగించుకొని మరియొక గ్రామము పోవుటకై బైలుదేరి ఒక అరణ్యము గుండా పోవుచుండిరి. కొంత దూరమేగిన తర్వాత, ఆ శిష్యుడు బిగ్గరగా రోదనము చేయుచూ తన పాపమునకింక నిష్కృతి లేదని 'వా' పోవుచూ, "అయ్యా! యెంతో ఆదరణతో మనకాతిధ్యమిచ్చిన ఆ గృహస్తు సొత్తు హరించిన పాపిష్ఠినై పోయానే! చూడుడు. వారి యింటి కప్పు తాలూకు గడ్డిపోచ నా మూటలో చిక్కుకొని యున్నది. దయయుంచి తమరిచ్చట యొక ఘడియ ఆగుడు.

ఈ గడ్డి పరకను వారికిచ్చి వేసి క్షణములో తిరిగివత్తును" అని పల్కుచూ, గురువుగారు వలదన్ననూ వినిపించుకొనకుండా వెనుదిరిగి ఆ గ్రామమువైపు మహా వేగమున పరుగెత్తెను. గురువుగారి దృష్టికి తాను మరుగగు వరకు ఆ విధంగా పరుగెత్తి, యొక చోట, కూర్చొని కొంత తడవాగి మరల పరుగెత్తుకొనుచు, గురువుగారిని సమీపించి, అయ్యా! యిక నడవండి. నా మనస్సెంతో తేలికపడింది. వారి సొత్తు వారికిచ్చి వేసితిని. అమ్మయ్యా! నా పాపమును బాపుకొంటిని. పరుల సొత్తు హరించుట కన్ననూ, ఘోరపాతక మింకేదైన గలదే?" అని బ్రహ్మాండముగా యుపన్యసించెను.

గురువుగారీ మాటలకు ముగ్ధులై, శిష్యుని పవిత్రాంతః కరణకెంతో సంతసించిరి. శిష్యునియందమితమైన నమ్మకమును, అమాయక హృదయమున అంకురించి నానాటికి వృద్ధి చెందెను. శిష్యుడది గనిపెట్టి మరింతగా గురుసేవయందప్రమత్తుడై యుండెను.

అది గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసము, గురువుగారు శిష్యుని పిలిచి, "ఓరీ! నేనీ నదిలో స్నాన సంధ్యాదులు నిర్వర్తించుకొని వచ్చెదను. అంతవరకు నీవిక్కడ సామాను, బొంత జాగ్రత్తగా చూచుచుండుము" అని శిష్యుని కప్పగించి నిశ్చింతగా నదిలో దిగి స్నానం చేసి మంత్ర జపంలో మైమరచియుండెను. ఇదే అదనుగా, అని శిష్యుడా గురువుగారి బొంతను మాత్రం తీసుకొని పారిపోయెను. అప్పటికి సూర్యుడు బాగా నెత్తిమీదకు వచ్చెను ఇక పరుగెత్తలేక, ఆతృత నాపుకొనలేక, తన వద్ద నున్న చాకుతో ఆ బొంతను కోసి, రత్నమును వెలికిదీసెను. అది సూర్యకాంతమణియనీ, సూర్యకిరణములు సోకినంతనే దాని నుండి అగ్ని జ్వాల లుత్పన్నమగుననీ పాపమా శిష్యునికేమి తెలియును? రత్నముపై సూర్యకిరణములు పడుటతోడనే భగ్గున మంటలు లేచి బొంత సహితముగా క్షణంలో ఆ శిష్యుని భస్మీభూతము గావించెను.

ఆ శిష్యుని అసలు పేరేమో తెలియదు. భూతియనగా బూడిద. ఆషాఢమందా విధంగా బూడిదైనందున "ఆషాఢభూతి" అని, అతనికి మరణానంతర పౌరుషనామము. చిక్కెను. నాటినుండియు "అతి వినయం దూర్త లక్షణం" అన్నట్లుగా వినయ విధేయతలెంతో ప్రదర్శించుచూ మోస విధంగా ప్రవర్తించు వారికీ "ఆషాఢభూతి" యను నామము రూఢమయ్యెను.

8. మోసకారి భక్తులు - 2(దేవతలనే మోసం చేసిన వారు)

ఒక గ్రామంలో కన్నయ్య అనేవాడు ప్రతి నిత్యం తన గొఱ్ఱెలను మేతకై అడవికి తోలుకొని పోయేడివాడు. ఒకనాడు తన మందలోని గొఱ్ఱెపిల్లయెకటి తప్పిపోయినట్లు యింటికి తిరిగి వచ్చిన పిదప నాతనికి తెలిసెను. ఆ వూరి గ్రామ దేవత పేరు పోచమ్మ. "నా గొఱ్ఱెపిల్ల సురక్షితంగా తెల్లవారే సర్కి నాయింటికొస్తే పదహరు రాటల పందిరి వేసి, ఒక యెనుబోతును బలియిస్తానని" కన్నయ్య పోచమ్మకు మొక్కుకొనెను. పది రూపాయల కిమ్మతుగల గొఱ్ఱెపిల్ల కోసం నూరు రూపాయిలు వదులు కొంటానంటా డేమిటి తన భర్తయని అతని భార్యా మాచెమ్మ ఆతనివంక ఆశ్చర్యముగా చూచెను. "అంతా వుళ్ళక్కి ఊరకే యన్నాను".అన్నట్లు చేయి అడ్డం పెట్టి చేతిచాటునుండి భార్యకు కన్నయ్య సౌజ్ఞ చేసెను. ఐనా కన్నయ్య యేమిచేస్తాడో చూద్దామని పోచమ్మ తన మహిమచే గొఱ్ఱెపిల్ల వాని యింటికి తెల్లవారే సరికే వచ్చునట్లు చేసెను.

కన్నయ్య మాచెమ్మను తీసుకొని మ్రొక్కు చెల్లించుటకై పోచెమ్మగుడి వద్దకు పోయి, తల్లీ నాకోరిక దీర్చావు. యిదుగో నీకు మ్రొక్కు చెల్లించుకొంటాను. అని చెపుతూ పందిరి ఆకారంగా చేయి తిప్పుతూ పదహారు చిటికలు వేసి పందిరి పూర్తిచెసెను. యిదిగో యెనుబోతును బలియిస్తున్నానని భార్యా తలలోని బలిసిన పేనునొక దానిని బైటికిలాగి అమ్మవారి గుడి గడపవైపు దానిని కుక్కి, భార్యవైపు జూసి మందహాసం చేసెను. బంధుమిత్రులను భార్యపుత్రులను, తల్లిదండ్రులను గురువులను గూడా మోసము చేసినవారున్నారు. దేవతలనే మోసంచేసిన భక్తులనెక్కడా చూడలేదని ఆశ్చర్యముతో పోచెమ్మ ముక్కుమీద వ్రేలువేసుకొనెను. ఇంత అమ్మవారూ గూడా ఆ ఆశ్చర్యమునుండి తెప్పరిల్ల లేకపోవుటచే అమ్మవారు ముక్కు మీగ వేసిన వ్రేలు అట్లనే నిలిచిపోయెను.

దర్శనార్థమై వచ్చిపోయెడి పోచెమ్మ భక్తులు " పోచెమ్మ ముక్కుమీద వేలేసు కుంది" యిదేమి ఆశ్చర్యమని కనబడిన వారందర్నీ యీవింతను ప్రకటిస్తూ రాగా క్షణములోఆనోటకానోట రాజుగారి చెవులబడెను. ఆయన స్వయంగా యేతెంచి యీవింత దృశ్యమును స్వయంగా జూచి, అమ్మవారి యీవింత ప్రవర్తనవల్ల దేశమునకే కీడురానున్నదోయని శంకించుచూ అమ్మవారి ముక్కు మీద వేసిన వేలు ఎవరైనా

తీయిస్తే వారికర్ధ రాజ్యమిస్తానని రాజ్యమంతటా చాటింపునకు కాజ్ఞాపించిరి.

ముక్కుమీద వేలేసుకొనుటకు కారణమేదో తెలిస్తే తప్ప యెట్లా అది తీయించాలి? అందుకేమిచేయాలి?ఎవరికీ ఏమీ అర్ధంగాక వూరుకున్నారు. కన్నయ్య భార్య మాచెమ్మ రాజుగారి వద్దకు పోయి, పోచెమ్మ ముక్కుమీద వ్రేలు తాను తీయించితీర్తాను అని ప్రతిజ్ఞలు పలుకసాగెను. ఆలయ తాళపు చెవులామె కిప్పించి రాజుగారామెకు ఒక్కరాత్రి మాత్రము గడువిచ్చిరి.

అర్ధరాత్రి సమయం ఆలయపు తలుపులు తెఱచి మాచెమ్మ లోనికేగి తలుపులు తిరిగి భద్రముగా లోన తాళము వేసెను. క్రిందికి జారాడు చీరెకుచ్చుళ్లు పైకిలాగి గోచీవేసి చీరకట్టి పైటకొంగు నడుముకు జుట్టి బిగించి గుడిలోనొక మూలనున్న చీపురుకట్ట చేతబట్టి "ఏయ్ పోచెమ్మ! ఎవరనుకొన్నావో నేను మాచమ్మను ముక్కుమీద వ్రేలు తీస్తావా మొఖం వాచెటట్టు చీపురుకట్ట దెబ్బలు తింటావా" అంటూ చీపురు పైకెత్తి మహంకాళి వలె ఉగ్ర స్వరూపంతో పోచెమ్మ పై కురికెను.

పాపం? పోచెమ్మ ఖర్మం కాలినది. దానిచేత చీపురుకట్ట దెబ్బలుకూడా యెక్కడ తినవలసి వస్తుందోనని హడలిపోయి చటుక్కున ముక్కుపైనుండే వ్రేలు తీసివేసెను. ఏమయ్యో ! పోయిన గొఱ్ఱెపిల్లను తిరిగి పొందేనని పొంగిపోయేవేగాని చూచుకో నా తడఖా పోచెమ్మ పొగరడంచి అర్ధ రాజ్యం అవలీలగా సంపాదించాను అంది పక పక నవుతూ భర్తతో మాచెమ్మ.

9. పరివర్తన

ఒక పట్టణములో స్వామియను పేరుగల గజదొంగ యొకడుండెను. అతడు ధైర్య సాహసములు గల బలిష్ఠుడైన వ్యక్తి గొప్పవారి యిండ్లలో ప్రవేశించి విలువగు వస్తువులు మాత్రము నాతడు దొంగిలించుకొని పోవుచుండెను. ధైర్యసాహసములకు తోడు మారువేషములు ధరించుట యందాతడు కడునేర్పరియగుటచే నాతడెవ్వరికి చిక్కకుండ తప్పించుకొనుచుండెను.

ఒకనాడాతనికి రాజుగారి అంత:పురములో ప్రవేశించి రాణిగారి రత్నాలహారము కాజేయవలెనని సంకల్పము కల్గి ఒక వృద్ధ పరిచారకుని వేషము వేసుకొని కోటలో ప్రవేశించి రాణిగారి శయనాగారము చేరి యొక మూల నక్కి యుండెను రాజదంపతులకు ఏకైక పుత్రికకు 18 యేండ్ల వయసు దాటినది. తగు వరుడు లభించ

కుండుటచే వివాహం కాలేదని రాణి బెంగపెట్టుకొని యుండెను.రాజదంపతులు ఏకశయ్యాగతులై యుండగా రాణి "ఏమండీ! మనఅమ్మాయి గతి యింక యింతేనా?" యుక్త వయసురాలగు కన్యను యింటనుంచుకొని యెట్లు నేనాందోపభోగముల ననుభవించగలను ? అని రాజుగారి కోరికను త్రోసిపుచ్చెను. వరాన్వేషణములో రాజుగారి కిదివరకే ప్రాణము విసిగిపోయెను. సకల బోగభాగ్యములుండియు కుమార్తెకు తగిన సంబంధమే చూడలేకపోతినే యని లోలోపల మిక్కిలి భాధపడుచుండెను. రాణిగారి మాటలకు గాయమున కారముజల్లినట్లుండి యీ దిగువ విధముగా శపధముచేసెను. సూర్యోదయము కాక పూర్వమే బైలుదేరి ఉత్తర దిశగా అరణ్య మధ్యములోనికి దారి తీసెదను. మొదట కనబడిన సన్యాసికి నా కుమార్తైనిచ్చి వివాహము చేసెదను. దీనికింక తిరుగులేదు. సరేనా?" అని కోపముతో చివాలున లేచిపోయేను.

స్వామి, రాజుగారి శపధము నాలకించెను. మెరుపువలె అతని నిశిదబుద్ధి యందొక యూహ తళుక్కున మెరిసెను. రాజుగార్కి తొలుదోల్తి మరునాడరణ్యములో కనపడు సన్యాసికి రాకుమార్తైయు ఆమెతోపాటు రాజ్యమును హస్తగతము కానున్నవి. తానే రాజుగారి అల్లుడేల కారాదు?. రాజుఅడితప్పడని అన్నమాట ప్రకారం చేసితీరునని గోప్పకీర్తి వహించినాడు రత్నాలహార మెందుకు? రాజుగారి అల్లుడనే యగుదునుగాక! అనితలపోసి వెంటనే తిర్గి వెళ్ళిపోయి చక్కగా సన్యాసి వేషము వేసుకొని స్వామి దొంగ సన్యాసిస్వామియై అరణ్యమున రాజుగారు రానున్న బాట ప్రక్కనే రాజుయెప్పుడు వచ్చునా అనుఅష్టాక్షరీ మంత్రజపము చేయుచుండెను రాజుగారును వేకువను లేచి యవ్వరికీ జెప్పకుండ ఉత్తరదిశగా బైలుదేరి వచ్చి అరణ్యములో మున్ముందుగానే యొకచెట్టుక్రింద కేవలం పరమశివుని వలె ప్రత్యక్షమైన స్వామి పాదములపైబడి రాజు తనకుమార్తైను స్వీకరించి తన్నుధన్యుని గావించుటకై కోటలోనకి రావలసిందిగా ప్రార్ధించెను. మనసు యొక్క తొందరపాటును నిగ్రహించుకొని రాజుగారిచే చాల బ్రతిమాలించుకొని స్వామి రాజుగారితో కోటయందు ప్రవేశించెను. అయితే ఈసారి కన్నపు దొంగగా కాక అల్లుని రీతిగా ప్రవేశించెను. అప్పటికప్పుడే రాజుగారి శపధమానోట యీనోట అంత:పురంమంతయు పాకిపోయెను. రాజదంపతుల కసలే సాధు సన్యాసు లన్నచో మహాగౌరము. అందులో కన్నకూతురికి కానున్న మగడని రాజదంపతులే స్వయముగానాతని కనేక విధముల పరిచర్యలు గావించసాగిరి. ఇక మంత్రి

సామంత్యాదులు దాసదాసీజనములు ఆ దొంగ సన్యాసికి గావించు సేవా ధర్మమును గురించి వేరుగా చెప్పవలెనా? స్వామి తల తిరిగిపోవుచుండెను. సాయంకాలమే వివాహము, రాత్రియే గర్భాదానము, స్తోత్రపాఠములతో శేవాశుశ్రూషలతో స్వామి వుక్కిరి బిక్కిరి అయిపోయెను. రాజుగారి సంకల్పానుసారము వివాహమహోత్సవము జరిగెను. పసుపు కుంకుమల క్రింద పెండ్లి కుమార్తెకు రాజు తన రాజ్యమునే చదివించెను.

రాత్రి రాకుమార్తెతో ఏకశయ్యాగతుడైన మనస్వామికి నిద్దర పట్టలేదు, రాకుమార్తె ప్రక్కనే దేదీప్యమానంగా దేవ కన్యక వలె మెరిసిపోతూ తృప్తిగా నిద్రించుచుండెను. ఆహా! ఏమి సౌందర్యము! ఏమి వైభవము! ఏమి ఆనందము!కాని, స్వామి యిట్లా లోచింప దొడగెను. ఎన్నో దుర్మార్గములు చేసి యెంత మంది సోత్తునో హరించి సంఘ విద్రోహినైన నాకేనా యీ సత్కార మానపూజాదులు! నావేష భాషలు జూచినేనొక మహాత్ముడనని, పాపం! వీరు మోస పోయినారు. నేను వేషధారి సన్యాసినైనా ఏదో పురాకృత పుణ్య విశేషోదయముచే యీవిధంగా నాకీ యెక్కడలేని గౌరవము సంప్రాప్తించి నది. నాకృత్రిమ నటనయే యింత సన్మానమునకు కారణమైనపుడు నిజముగా అంతః కరణ మార్పుజెందిన నిజమగు సన్యాసియెంత పూజనీయుడో త్యాగము నందెంతటి మహత్తర శక్తియున్నది. అట్టి సన్యాసమును చేకొనకుండనే నింకను విలంబనయేల చేయవలయును? ఈ రాజ్యము, ఈ స్త్రీ, నేను, ఈ సమస్తము నశ్వరమైయున్నది. శాశ్వతమగు మొక్షప్రాప్తికి అశాశ్వతమగు విషయానందము యెంతో ఆటంకముగా నుండగా తప్పదు కనుక వెంటనే నిజముగా సన్యసింతునుగాక, యని తీవ్ర వైరాగ్యమాతని తొందర పెట్టసాగెను. దారేషణ, ధనీషణ, పుత్రేషణలను నశింపచేసుకొని రాజ్యమునే వదలి పోయిన భుద్ధ భగవానుని రీతిగా నాతడు హృదయ పరివర్తనము పొంది సర్వసంగపరిత్యాగియై సన్యసించి అంత:పురమును రహస్యముగా వీడి అడవిదారి పట్టెను.

పాపమా! సన్యాసికి లభించెడి సత్కార మానవ పూజా గౌరవాదులకు వ్యామోహము జెంది స్వామి చేజిక్కిన రమణిని రాజ్యమను చేతులార జారవిడిచికొనెను. అంతరః సన్యాసులై రాజయోగి రీవితో రాజ్యము లేలిన జనకాదుల జీవిత రహస్యము లతడెరుగడు గదా!!

10. "పాలాంశ కుసుమం వృధా"

ఒక గ్రామంలో చదువూ సంస్కారమూ గల చక్కని బ్రాహ్మణ కుటుంబ మొకటుండెను. ఆ కుటుంబంలో వారందరూ గీర్వాద్రాంధ్రముల యందు చక్కని పాండిత్యము గలవారే, ఆ గృహస్తునికి నలుగురు కుమారుల తర్వాత శారద యను ఏకైక పుత్రిక గల్గెను. రూపమున రంభ, చదువునకు సరస్వతి, ఆమెకు యెన్మిదవ సంవత్సరము దొరబడెను. తండ్రియగు వెంకటావధానులు వరాన్వేషణకై బయల్వెడలెను. తిరిగి తిరిగి ప్రాణము విసుగెత్తెను. కుమార్తెకు తగిన వరుడు లభించలేదు. చివరకొక దూర గ్రామంలో ఒక మహా పండితుని దర్శనమాయనకు లభించెను. ఆయన సిరిసంపద లలో కూడా తన కన్న అధికుడే. ఆయనకు షోఢశ వర్ష ప్రాయుడగు సూరి శాస్త్రి యను ఏకైక కుమార్డు. మన్మధుని వంటి శరీర, సౌందర్యముగల నా బ్రాహ్మణ కుమారుని చూచీ చూచుటతోనే వెంకటావధానుల హృదయ ముప్పొంగిపోయెను. వెంటనే వివాహము స్థిరపరచెను. ఒక నెలలోపుగనే వివాహము జరిగిపోయెను.

నాలుగు సంవత్సరములు గడచిపోయెను. దూరగ్రామమగుటచే సూరిశాస్త్రి మరల అత్తవారింటికి పోనేలేదు. ఆ సంక్రాంతి పండుగకు వెంకటావధాని స్వయముగా నేతెంచి పండుగకు అల్లుని తన యింటికి తోడ్కొని పోయెను. యించుమించు తన వయస్సులోనే వున్న బావమరుదులు అందరూ అప్పటికే మహాపండితులైరి. వారిలో వారు జరుపు సాహిత్య గోష్ఠి శాస్త్ర చర్చలలో ద్వాదశ వర్ష ప్రాయమగు శారద మధ్య మధ్య పాల్గొనుచుండెను. యీ యిష్టాగోష్ఠులలో గాని శాస్త్ర చర్చలలో గాని సూరిశాస్త్రి మౌనముగా తలవంచుకొని వొకచోట కూర్చొనుచుండెను. "ఏమి బావగారూ మీ అభిప్రాయమేమి?" అని చర్చకు పురిగొల్పు బావమరుదులీతని మౌనము జూచి యాతడు కేవలం పండిత పుత్రుడేనని వెన్వెంటనే గ్రహించిరి. తన భర్త విద్యా గంధ మెరుగని వింతపశువని శారద చిలిపితనంగా అతనిని గురించి నామరూపాల నాజూకేగాని "పాలాశ కుసుమం వృధా" అని భర్తను గేలిచేయుచు అన్నగార్లతో పలికెను. సూరిశాస్త్రికామాటలు అగమ్యగోచరములేయైనను బావమరదుల పకపక నవ్వుటచే తన్నేదో గొప్ప తిట్టు తిట్టిందని సూరిశాస్త్రికి చాల యభిమానము, కోపము కలిగెను. అదేమియు బయట పడకుండ నిగ్రహించుకొని అర్ధరాత్రి సమయమున ఎవ్వరికి చెప్పకుండ అతడత్తవారిల్లు వీడిపోయెను. తానెటులైన మహాపండితుడై రావలెను. ఇదే అతని ఏకైక ఆకాంక్ష.

ఆ ఏకైక దీక్షతో నాతడచిరకాలములోనే కాశీనగరము చేరెను. అటనొక మహాపండితుని యిల్లు వెదకి పట్టుకొనెను. గురువుగారి పాదముల వ్రాలి విద్యాదానము చేయుడని వేడుకొనెను. "అటులే నాయనా పాదములిడు, వెళ్ళి స్నానం చెయ్యి. ముందు భోజనం కానియ్యి" అని గురువుగారతనికి పెరటులోనున్న నూతికి దారి జూపెను. ఆజానుబాహుడైన సూరిశాస్త్రికి. పెరటిలోనికి పోవు ద్వారము కొంచెము పొట్టిగా నుండుటచే తలకు దెబ్బ తగిలెను. "అబ్బా!" యని తల నొకసారి తడుముకొని వెళ్ళి స్నానము చేసి మరల నా గుమ్మముననే లోనికి వచ్చుటలో ద్వారబంధము తలకు తగిలెను. "అబ్బా" యని తల తడుముకొనుచూ సూరిశాస్త్రి లోనికరుదెంచెను, ఇదంతయు గురువుగారు గమనించుచునే యుండిరి. భార్యను పిలచి అతనికి నేయ్యి వడ్డించ వలదనిన్ని తాను తిరిగి చెప్పు వరకు ఆముదమును మాత్రమే అన్నములో అభికరించుచుండుమనియు నాజ్ఞాపించెను.

సూరిశాస్త్రి తొందరగా భోజనము ముగించి మరల వినయంగా గురువుగారిని, చదువుచెప్పుడని వేగిరపర్చసాగెను. గురువుగారాతనిని వెంటబెట్టుకొని చెరువు గట్టుమీద, నీ లాటి రేవులో వొక చెట్టు క్రింద కూరుచుండబెట్టి, యిసుకలో ఓనమాలు వ్రాసి యివి దిద్దుకొనుచూ నుండమని చెప్పి యింట్కిపోయెను. సూరిశాస్త్రి అక్షరములు దిద్దుకొనుటలో నిమగ్నుడై యుండెను. మంచినీటికై యేతెంచు మదవతులెల్లరూ నవయౌవనుడు. స్ఫూరద్రూపియైయున్న యీ పరదేశి బ్రాహ్మణుడెవ్వడో యీ వయస్సు లో గుంట ఓనమాలు దిద్దుకొనుచున్నాడే!! అని పరిహాసములాడుచు నాతని చూచి పకపకలాడుచూ యెయ్యారములొలుకబోయుచుండిరి. గాని, అక్షరాభ్యాసదీక్షలో నున్న అతని దృష్టిమాత్రము ఆకర్షించలేక తామేచిన్న బుచ్చకొని మరికొంత ఆశ్చర్య మభినయించి, గృహోన్ముఖులగు చుండిరి.

సూరిశాస్త్రి సాయంత్రమగుసరికి యింటకేగి గురువుగార్కి తానేర్చిన అక్షరములు వ్రాసి చూపెను. రాత్రి పెరటిలోనికేగు నపుడు గుమ్మము యధారీతి నాతని సన్మానించెను. గురుమాత అన్నమున ఆముదమే వడ్డించెను. యీ విధముగా విద్యాభ్యాసము చేయుచూ నాంధ్రగీర్వాణ భాషల నచిరకాలముననే సూరిశాస్త్రి అభ్యసించుటయే గాక సాంగోపాంగముగా వేదాధ్యయనము గావించి, చివరకు న్యాయ వేదాంత శాస్త్రములు గూడ చదివి పూర్తిగావించెను.

నాడుదయమున స్నానమునకై పెరటిలోనికి బోవుటలో యధారీతిగా అతని శిరోభాగమునకు సత్కారము జరిగెను. అతడు వెంటనే వెనుదిర్గి "ఏమిటండీ గురువుగారు! యీ ద్వారబంధమింత చిన్నదిగా చేయించిరేమండీ?" యనెను. గురువుగారి సహపంక్తినే భోజనము చేయుచూ "అమ్మగారూ! యీ అన్నము కొంచెము ఆముదము వాసన వేస్తోందేమండీ?" అని ప్రశ్నించెను. గురు దంపతులు చిరునవ్వు నవ్వుకొనిరి. భోజనమైన పిదప గురువుగారు "సూరిశాస్త్రి, నీకిక చదువు రాదు. ఐనా, నేను చెప్పగల్గిన విద్య అంతయూ నీకు చెప్పుటయూ అయినది. యిక నీవింటికి పోవచ్చును" అని సెలవిచ్చిరి.

సూరిశాస్త్రియు కాశీగంగను కావడి కట్టుకొని గృహోన్ముఖుడై ఆదిలో అత్తవారి గ్రామమే యరుదెంచి, వూరుబయట చెరువు గట్టుపై విడిదిచేసి, స్నాన సంధ్యాధనుష్ఠానములు నెరవేర్చుకొనుచుండెను. అతని బావమరుదులాగ్రామంలో సంపన్న గృహస్థులై యుండి, యాతాయుత అతిథి అభ్యాగతుల కాతిథ్యమిచ్చుటలో పేరొంది యుండిరి. వారునూ స్నానాదులకై యటకేతెంచి, సాక్షాత్ ప్రవరాఖ్య కుమారుని వలె బ్రహ్మతేజస్సు విరజిమ్ముచూ నుండు యీ పాతికేండ్ల బ్రాహ్మణ కుమారుచే, నాకర్షింపబడి, దరిచేరి నమస్కరించి, యీ దినము మా యింట నాతిథ్యము స్వీకరించు డని వారాతనిని వినయంగా ప్రార్థించిరి.

సూరిశాస్త్రి వెంటనే వారిని గుర్తించెను. కాని వారాసంస్కార మెరుగని తలజుట్టు, మీసకట్టు గడ్డములతోనున్న యాతనిని గుర్తింపలేకపోయిరి.

అత్తవారింట నుండి అకస్మాత్తుగా అదృశ్యుడై పోయిన అల్లుడభిమానముచే నాత్మహత్య గావించుకొనియే యుండును. అతడు తిరిగి అరుదెంచగలడనే అడియాశకులోనై ఆడపిల్లనట్టులలంకారము చేసుకొననిత్తురా? అను ఆశెమ్మ బోశెమ్మలు వూరి అమ్మలక్కలు దవడలు నొక్కుకొనుచుండిరి. అయిననూ అల్లుడిల్లు వీడి ఐదేండ్లయినది. అతడు తప్పక ఆత్మహత్య చేసుకొనియే యుండునని, నమ్మి ఆయా హితోగ్నులాడబడుచునకు శిరోముండనము గూడ గావించు యుండిరి. నేడు సూరిశాస్త్రి కాతిథ్యమిచ్చుటకు ఆమెయే వంటచేసి, వడ్డించు చుండెను. సూరిశాస్త్రి భార్యను చూచి జాలిపడెను. కాని అతని హృదయంలో నాటుకొన్న ఆమెయన్న యెగతాళిమాటలు అంతఃకరణమవమానముచే ఉడుకుచునే యుండెను. శారద చారు వడ్డించెను. ఇంగువ

జీలక మిశ్రుమమైన, యా చారు ఘమ ఘమలాడు చుండెను. కాని రుచిలోపించెను వెంటనే భార్యా దిక్కుముగమై సూరిశాస్త్రి "చారుచారు సమాయుక్తం హింగుజీలక మిశ్రితం. కించిల్లవణ శూన్యంచె, పాలాశ కుసుమం వృధా" యని అంటూ భార్య వైపు యెగతాళిగా చూచెను. శారద యొక్క క్షణమాతని తెరపార జూచి, భర్త యని గుర్తించి చారు గిన్నెతో సహా పారిపోయెను. శారదాయన్న అన్న పిలుపు కామె "మీ బావగారురా" అని లో నుండి సన్నసన్నగా, తీయతీయగా పలికెను. ఆ మరునాడే సూరిశాస్త్రికి అయుష్కర్మ అభ్యంజన స్నానము, నూతన వస్త్రాలంకారము, యధా శాస్త్రీయంగా గర్భాదానకాండ జరిగించబడెను.

'విద్యా తురాణాం నసుఖం ననిద్రా' అనగా విద్యయందాత్రత గలవాడు నిద్రా, సుఖంగాని తదిన సుఖములుగాని అభిలషించడు అన్నట్లుగా సూరిశాస్త్రి యెట్లు యేకైక దీక్షతో విద్యా సంగ్రహణ మొనర్చెనో చూచితిరా! బ్రహ్మ విద్యార్జన యందిట్టి ఏకైక దీక్షా రూపమగుతో పనియెంతయో అవసరము. కనుకనే నలుదిక్కుల యిల్లు కాలుచుండ లోపల చిక్కువడిన వ్యక్తి తొందరగా బైటపడుట కెంత తహతహలాడునో, సంసార దావకాలానలము నుండి బైట పడుకట్టి తహతహ కల్గుటయే ముముక్షత్వ మన్నారు. అట్టివారే బ్రహ్మవిద్యకు పూర్ణాధికారి.

11. "తన మాట దలపోయ తనకే సిగ్గై"

నాడాశ్వయుజ శుద్ధ పూర్ణిమ, సమయం రాత్రి 8 గంటలు. షోడశకళాప్రపూర్ణుడగు చంద్రుడు పైన పకపక నవ్వుచుండెను. శరత్కాల సహజ శీతలమగు మలయానిల మెంతో మనోహరమై వీచుచుండెను. చంద్రుని కభిముఖంగా గూర్చొని నొక చంద్రముఖి సన్నసన్నగా పాడుచుండెను. వయస్సు పదియారు సంవత్సరములు, పది గజాల దూరంలో తాజ్‌మహల్ శరశ్చంద్రికా శోభలో మిలమిల మెరిసిపోవుచుండెను. తాజ్‌మహల్‌ను చుట్టి వచ్చుచున్న యిరవై వత్సరములు వయస్సుగల సుందరాకారు డొకడామెను జూచి కన్నూ కాలూ కదపలేక అట్లే నిలచిపోయెను.

అతడామెను మెల్లగా సమీపించి, "యువతీ, ఎవరు నీవు? ఒంటరిగా నిటనెందుకున్నావు?" ఆమె తలయెత్తి జూచెను. చూపులు గలిసెను. ప్రధమ వీక్షణలలోనే వారు పరస్పర ప్రణయోపహతులైరి. "ఒంటరిగా నున్న నన్ను పలకరించుటకు సాహసించిన మీరెవరో ముందు తేలాలి? అని కొంటెగా పల్కుచూ, ఆమె చిరుకోప

మభినయించెను. "విజయనగరంలో నొక చిన్న జమీందారును, క్షత్రియుడను వినోదయాత్రలో వచ్చితిని." అతడమాయకముగా జెప్పివైచెను. "నేనా?నేనా?" నాపేరు సుభద్రాదేవి. నేను కాశ్మీర్ రాజకుటుంబమున కించుక దగ్గర దానను. నా తల్లిదండ్రు లిర్వురూ యాత్రార్థం వచ్చి పడవ మునిగి కృష్ణలో నాపసితనముననే మరణించిరి. శవ పరీక్షలో వారు కాశ్మీరు రాజబంధువులని తేలినదట. తెనాలిలో ఒక బ్రాహ్మణ దంపతులు నన్ను పెంచిరి. వారితో యాత్రలో ఢిల్లీ చేరితిని. ఢిల్లీ నగర వీధులలో వారు మాయమై పోయిరి. వెదకి కొనుచూ నిట వచ్చితిని" యని ఆమె భోరుమని ఏడువసాగెను. విజయనగరం రాకుమారుడు వెన్నవలె కరిగిపోయెను. ప్రక్కనే కూర్చొని ఆమెను దగ్గరకు లాక్కొని ఆమె నెట్టకేలకు సముదాయించెను. ఆమెను మరేమీ ప్రశ్నించక తన కోరికను వెల్లడించెను. వారిర్వురకు గాంధర్వ పద్ధతిగా తారాశశాంకుల సాక్షిగా వివాహము జరిగిపోయెను.

పది సంవత్సరములు బ్రహ్మానందంగా జరిగిపోయెను. రాణియై దాస దాసీ జనులతో నామె తులతూగుచుండెను. రాజుగారి తండ్రికి మిత్రుడట. ఒక రాజకార్యముపై వారింట కరుదెంచెను. రాజుగారింటలేరు. వచ్చిన ఆగంతుకుడు తెనాలి వాస్తవ్యుడగు నొక కమ్మ జమీందారని, సేవకుని ద్వారా తెలుసుకొని డ్రాయింగు రూములో కూర్చుండ నియమించెను. సోఫాలో కూర్చొని వంటవాడు తెచ్చిన పలహారాదులు సేవించి జమీందారు హుక్కా గొట్టమందుకొనెను. "అమ్మగారి నొకసారి పిలు, ఒక కబురు చెప్పిపోతా"నని అతడు లోనికి కబురు చేసెను. వెండి డబ్బీలో వక్కపొడి తీసుకొని రంభవలె మెరసిపోతూ సుభద్రాదేవి డ్రాయింగు రూములో అడుగు పెట్టెను. అరమోడ్పు గన్నులతో హుక్కా సుఖమనుభవించు కమ్మ జమీందారుని చూచుటతోనే ఆమె గతుక్కుమనెను. నన్ను రక్షించుమని ఆయన పాదాల మీద వ్రాలిపోయెను. జమిందారాశ్చర్యచకితుడై ఆమెను నిదానించి చూచిన పిమ్మటగాని నామెను గుర్తింపనే లేదు. "నీ రహస్యం కాపాడెద" నని అతడామెకు అభయమిచ్చెను. సుభద్ర లేచి యిక క్షణమైన నట నిల్వలేక, తన ముఖమిక నాయనకు చూపలేక లోనికి పారిపోయెను.

ఏమిటా రహస్యం! బెజవాడలో కృష్ణానదీ స్నానానికేగిన యీ కమ్మ జమిందారు గారికి 'క్యారు క్యారు'మని యేడ్చునొక పసిబిడ్డ దొరికినది. ఎవరు కని పారవేసినదో? ఏ కులముదో? ఎవరైనా కానీ, సంతానంలేని జమీందారుగారింట కన్నబిడ్డవలె పెరిగెను.

5,6 సంవత్సరముల అనంతరం జమీందారు గారికి సంతానము కలుగుట ప్రారంభించెను. నాటి నుండి సుబ్బమ్మ, సుబ్బియై జమిందారుగారింట దాసీ పిల్లయై క్రమంగా 16 సం॥ల వయస్సుగల దయ్యెను. ఆమెను తన సేవకుడైన వెంకన్నకిచ్చి వివాహము చేసెదనని జమిందారు ప్రకటించెను. కాని సుబ్బమ్మ ఆ తుమ్మ మొద్దును పెండ్లాడుట కిష్టము లేక, జమీందారు గారి మాట కెదురాడలేక అమ్మగారి చీరలు, నగలు కొన్ని మూటగట్టుకొని ఒకనాటి రాత్రి ఢిల్లీ జనతాలో ఆగ్రా స్టేషనులో దిగి నాటి రాత్రి వెన్నెల వెలుగులో తాజ్‌మహల్ వీక్షించుచుండెను. ఆ సుబ్బమ్మయే ఈ సుభద్రాదేవి యిదే ఆమె మూల రహస్యం.

తన మూలముగాని, స్థానముగాని ఎరుగని వారిని యెరుక యిట్టే భ్రాంతిలో ముంచి, తన మాయాజాలమున బంధించును కాని తన మూల మెరిగిన వారి కడ నిలువలేక మోమైన జూపలేక "తన మాట తలపోయ తనకే సిగ్గె"....జనును.

12. అందరూ మానవులేనా?

భద్రాచల సమీపమునగల సాంద్రారణ్యములో ఒక దిగంబర యోగి తిరుగాడు చుండెను. ఆ ప్రాంతపు కోయదొరల ద్వారా అతడొక గొప్ప సిద్ధుడని ఎన్నో మహత్తులు కలవాడనీ ఆ నోటకానోట దేశమంతటా ప్రచారమయ్యెను. అది విని ఒక్కొక్కరుగా వచ్చి ఆయనకు శిష్యులై ఆయనకొక పర్ణశాలను నిర్మించి అతని పరివేష్టించి యుంటూ పరిచర్యలొనర్చుచుండిరి.

ఇట్టుండనొక నాటి సాయంత్రం 3గంటల వేళ శిష్యులు పరివేష్ఠించియుండ యోగి కొలువు దీర్చి శిష్యులకు ప్రభోద గావించు చుండెను. వారు కూర్చొని యున్న పర్ణ కుటీరము దిక్కుగా యొక పాంథుడు వచ్చు చుండెను. యోగి ఆ గంతుకుని కొంత దూరములోనే గుర్తించెను.

వెంటనే యోగి కంగారుగా "ఒరే! మానవుడొస్తున్నాడురా! ఆయుత్తరీయ మిట్లాయిమ్మ"ని అందుబాటులోని శిష్యుని యుత్తరీయమును లాగుకొని నడుమునకు చుట్టబెట్టుకొని కూర్చొండెను. వచ్చిన ఆగంతకుడు దరహసిత వదనముతో తనకభ్యుద్ధానమిచ్చుటకు యెదురు వచ్చిన యోగిని బిగియార కౌగింలించుకొని కుశలమడిగెను. ఉభయకుశలోపరి యిర్వురును ఒకే ఆసనముపై నుపవిష్ఠులై చిన్ననాటి

ముచ్చట్లతో యించుక తడవు కాలక్షేపము చేసి పిమ్మట ఆగంతకుడు వెడలిపోవుట కుద్యుక్తుడయ్యెను. మన యోగి అతని కొంతదూరము సాగనంపి వీడ్కోలిచ్చి తన స్థానమునకు తిరిగి వచ్చుచు దారిలోనే తన స్థలము నుండి ఎప్పుడూ పోదునా యని ఆతురతోనున్న ఆ శిష్యుని యుత్తరీయమూడలాగి శిష్యునిపై గిరాటువేసి యధా ప్రకారము దిగంబరుడై వచ్చి తన స్థానమందుపవిష్టుడయ్యెను.

శిష్యులకదియేమియూ అర్థముకాలేదు. విభ్రాంతితో నొకరి ముఖమునొకరు చూచుకొనుచుండిరి. తుదకాశిష్యమండలిలో వృద్ధుడొకడు తెగువజేసి యోగిగారిని యీ రీతిగా ప్రశ్నించెను. "అయ్యా! మానవుడు వస్తున్నాడని యెన్నేళ్ళ నుంచియో పూనిన దిగంబర దీక్షను క్షణములో ఏల విడనాడిరి? మేమున్ను మానవులమే కదా! మా యెదుటలేని సిగ్గూ, దేహాభిమానమూ, యీ నూతన వ్యక్తి వద్ద నెందుకు మీకు క్రొత్తగా కల్గెనో సెలవియ్యండి స్వామి! మేంమందరమూ ఏమీ అర్థముకాక బాధపడు చున్నామని" వినయ విధేయతలుట్టిపడ ప్రశ్నించెను.

అందుకు దిగంబర స్వామి చిరునవ్వు నవ్వుచూ నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను " బిడ్డా! నిజమే మీ స్థూల శరీరముల నిర్మాణము మాత్రము మానవాకృతిలోనే వున్నవి. కాని మీ అంతః కరణములు మాత్రము మానవుల కుండవలసినవి కావు మీలో మనిషి ముఖము కుక్కలు, మనిషి ముఖము నక్కలు, మనిషి ముఖము తేళ్ళు, పెద్దపులులు వున్నారు. వాని స్వభావములే మీకునూ యున్నవి. మీరందరూ నిజముగా మానవులేనా? మీయందు మానవతా ధర్మమున్నదా? మీలో ఒక్కరి అంతఃకరణం దైననూ ఆత్మ స్వరూప సాక్షాత్కారమైనదా? కనుక మీలో నాకు నిజమగు మానవు డొక్కడైన గోచరించలేదు పశువుల ముందు మానవుడు దిగంబరుడై తిరుగుటకు సిగ్గుపడునా? మరి ఆ వచ్చిన యతడో? నిజమగు మానవుడు మేమిర్వురము ఒకే గురుని చెంత. శుశ్రూష చేసి ముందుగా ఆత్మస్వరూపమును గుర్తెరిగి పిమ్మట "ఆత్మాతీతం కేవలాత్మ" యని చెప్పబడిన పరిపూర్ణ పరబ్రహ్మ విషయకమగు సద్భోధను పొందితిమి. అతడు పెండ్లాడి రాజయోగియయ్యెను. నేనో దిగంబరినై సంగము వీడి యున్నాను. అతడు వచ్చు సరికి, నాకు సిగ్గు ముంచెత్తుకొని వచ్చినది. కనుక బట్టకట్టితిని. అతడు వెళ్ళిన తోడనే విసర్జింతిని అని చెప్పి మిన్నకుండెను.

13. అంధ గజ న్యాయము

పూర్వమొకానొక గ్రామమున ఆరుగురంధులు నివసించెడివారు. ఒకనాడొక స్వాముల వారు ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు, శిష్యులు మొదలగు పరివారముతో ఆ గ్రామ మేతెంచెను. ఏనుగెట్టిదో తెలుసుకొనగోరి, యీ అంధులు ఎట్లో ఏనుగు కడకేతెంచిరి. పరుండి యున్న యేనుగు శరీరమును చేతులతో తడువుచూ దాని ఆకారము నూహించుకొనిరి. ఒకడు చెవులను, ఒకడు దంతములను, ఒకడు తొండము ను, ఒకడు కాలిని, ఒకడు దాని ప్రక్క భాగమును, ఒకడు తోకను తడివి యేనుగు యొక్క ఆకారమును గురించి భేదాభిప్రాయము గలవారై తమలోతాము రణ,గుణ ధ్వనితో వాదించుకొనుచుండిరి. యీ గగ్గోలు విని ఒకడు వారిని సమీపించి ఎందుకురా మీరట్లా వాదించుకొనుచున్నారు అని అడుగగా, అందు చెవులను తడివి చూచినవాడు, "ఏనుగు చేటవలె వున్నది. నేను స్వయముగా తడివి చూచినాను. వీళ్లు కాదని వాదిస్తారు చూడండి" అనెను. "కాదు నేను తడివి చూడలేదా ఏనుగు బల్లెం వలె లేదా? అని దంతమును తడిమిన వాడు పల్కెను. "కాదు కాదు మీరిద్దరూ పొరపడినారు. ఏనుగు అచ్చముగా, పెద్ద పామువలె వున్నది అని తొండమును తడివిన వాడు పల్కెను. "అదేమీ కానే కాదు ఏనుగు స్థంబాకృతిలో నున్నదని కాలుతడవినవాడు పల్కెను. మీరందరూ చూడలేదన్న మాట ఏనుగు గోడవలెనున్నదని" నడుము తడిమినవాడు పల్కెను. "అందరూ చెప్పినది తప్పే ఏనుగు చీపురు కట్టవలె లేదా? అని తోక తడిమిన వాడు పల్కెను. అపుడక్కడున్న పెద్ద మనిషి అందరిని వారించి నవ్వుచూ యిట్లు పల్కెను. " మీరందరూ చెప్పిన మాటలూ సత్యములే. ఎవరూ తడివి చూచిన ఏనుగు యొక్క శరీరవయములను బట్టి వారు చెప్పుచున్నారు. కాని యేనుగు యొక్క సంపూర్ణ స్వరూపమును చూడకనే ఒకరు చెప్పినది ఒకరు తప్పని మీలో మీరు వాదులాడు కొనుచున్నారు. ఏనుగు యొక్క సంపూర్ణ స్వరూప మిట్టిదని చెప్పి వారిని సంతుష్టి పరిచెను.

ఇట్లే మతవాదులు కూడ సంపూర్ణ సత్యమును గ్రహించక తాము తెలిసినదే సత్యమని ఒకరినొకరు వాదించుచూ శాస్త్ర జన్య జ్ఞానముచే తామే గొప్ప వారమని అహంకారము కల్గి ఇతరులను నిందించు చుండిరి. అందుకే కృష్ణ దేశికులు కందార్థము లలో "మతముల వారలు తమ సమ్మతమైనటువంటి శాస్త్ర మర్యాదలచే మితమేరు

పర్చుకొని బహుగతులను కలహింతురు" అని సెలవిచ్చినారు. కనుక సర్వ మత వాదములను సమన్వయ పరచుకొని అన్నిటికి అతీతమగు పరిపూర్ణ పరబ్రహ్మ భావమును సద్గురువులచే తెలియుదురు గాక".

రాజయోగులు

14. సదాబ్రహ్మచారి - సదోపవాసి

ఒక గ్రామములో నదీ తీరమున ఒక గృహస్తు ఇల్లు కట్టుకొని భార్యతోను పదిమంది సంతానముతోను ఆదర్శ జీవితమును జరుపుచుండెను. అది బాద్రపద మాసము. నది వరద నీటితో పొంగి ఒడ్డులొరసి మహా వేగముగా ప్రవహించు చుండెను. ఆ వేగమునకు భయపడి రేవు నావులు రేవు దాటించుట లేదు.

ఈ పరిస్థితులలో నది దరికి ఒక సన్యాసి వచ్చి రేవు దాట వీలుకాక ఒక చెట్టు క్రింద మకాం చేసి యుండెను. నదిలో కొట్టుకొని వచ్చు కలపను పట్టుకొనుటకై ఇద్దరికి అదరికి తెప్పలపై ఈదులాడే వారి వలన ఇద్దరిని వున్న మన గృహస్తు ఆ దరిని ఉన్న సన్యాసి సమాచారములు విని ఆయన నామ రూపములను అడిగి తెలుసుకొని ఆ సన్యాసి తన బాల్య మిత్రుడనిన్ని ఉభయులు ఒకే గురువు వద్ద

శ్లో॥ విద్యాంతః బ్రహ్మ విద్యంతః వార్థి కాంత మగోచరం
పూర్ణబోధ ప్రవక్ష్యామి శృణు శిష్య మహోత్తమమ్

అన్నట్లుగా సంపూర్ణముగా బోధ పొందిన విషయం జ్ఞప్తికి తెచ్చుకొనెను. వెంటనే భార్యను పిలిచి నా బాల్య మిత్రుడొకడు వచ్చియున్నాడు. అతనికి విందు చేయవలెను" అని ఆజ్ఞాపించెను. షడ్రశోపేతమగు పంచభక్ష్యపరమాన్నములు తయారుచేయమని ఆజ్ఞాపించెను.

వంట పూర్తి అయినది అని తెలుసుకొని వంటకము లన్నింటిని ఒక గంపలో చక్కగా నమిర్చి ఆ గంపను భార్య నెత్తికెత్తి నదికిద్దరినున్న సన్యాసికి పెట్టి రమ్మనమనిన్ని వచ్చునప్పుడు తీర్థప్రసాదములుగొని రమ్మనమనిన్ని అతడాజ్ఞాపించెను. "అయ్యో! నది పొంగులు పారుచు అంచు ప్రవహించు చున్నదే! రేవు నావేనాలేదే? ఆ దరికి ఎట్లు పోవలెను? అని భార్య వాపోయెను. "భయములేదు సదాబ్రహ్మచారి సదోపవాసికి భోజనం పంపినాడు. ఆవలికి పోవలెను. దారిమ్ము తల్లీ" అని నదికి భక్తితో నమస్క

రించుము అని ఆ గృహస్థు సలహా ఇచ్చెను. నది వద్దకేగి ఆమె అట్లే ప్రార్థించగా నదియును ఆమె పోవుటకై దారి ఇచ్చెను. యదేచ్ఛగా ఆమె నడిచిపోయి సన్యాసికి ఆ పదార్థములన్నియు వడ్డింపగా, అతడు కాకికి మెతుకైన మిగల్చకుండా అన్నియు తినివేసెను. ఆమె ఆ సన్యాసి కడ తన భర్త కొరకు మంత్రాక్షింతలు తీర్థ ప్రసాదములు అడిగి గైకొని తిరిగు ముఖము పట్టుచు "స్వామీ, నదీ మహా వేగముగా ప్రవహించు చున్నది. నేనింటికెట్లు చేరగలను?" అని ఆమె వాపోయెను. వచ్చినప్పుడెట్లు వచ్చితివో అట్లనే పొమ్ము" అని సన్యాసి పలుకగా జరిగిన వృత్తాంతమంతయు ఆమెసన్యాసికి నివేదించెను. అప్పుడా సన్యాసి "సదోపవాసి సదా బ్రహ్మచారికి మంత్రాక్షతలు తీర్థ ప్రసాదములు పంపుచున్నాడు గనుక దారిమ్ము తల్లీ అని ప్రార్థించుము అని సన్యాసి పల్కెను. నదికి నమస్కరించి ఆమె అట్లే పలుకగా అవియును మహా మంత్రమువలె పని చేసినది దారి యిచ్చెను.

ఆమె సుఖముగా ఇంటికే తెంచి మంత్రాక్షింతలు తీర్థ ప్రసాదములు భర్త కొసంగి భర్తకు భోజన మిడి ఆమె భోజనం చేయక భీష్మించి పడక గది చేరి ముసుగు తన్ని పరుండెను. నీవేం భోజనం చేయవు? పరుంటివేల? లే! అని భర్త ఆమెను పలుకరించెను. అందుకామె నావలన పదిమంది బిడ్డలను కని సంసారం చేయుచున్న మీకు సదా బ్రహ్మచారులెట్లుగుదురు? గంపెడు పదార్థములు ఏమియు మిగల్చకుండా తినివేసిన ఆ బాకాసురుడు సదోపవాసి ఎట్లగును? కాదేమో నంటే నది మాత్రమే అందుకా మోదించి దారి యిచ్చినదే? యిది పరమాశ్చర్యముగా నున్నది దీనికి సమాధానము చెప్పిన గాని భోజనం చేయను అని ఆమె భీష్మించెను. అతడు భోజనమైన పిదప చెప్పెదను లే, భోజనము చెయ్యి అని అనేక విధముల అతడు చెప్పి చూసెను. గాని ఆమె మెత్త పడలేదు. అందుకై అతడు కోపము ప్రదర్శించుచు మూలనున్న కరవాలము తీసి ఝుడిపించుచు నేను చెప్పినట్లు చేయని యెడల నిన్ను చంపివేసెదను ఇదిగో కత్తి 'లే, పద' అన్ని వడ్డించుకో, మధ్యలో తలగాని పైకెత్తితివా తలూడి క్రిందపడును. అని బెదిరించును. ఆమెను వడ్డించుకొను లాగున చేసి ఆమె తినుచుండగా ప్రక్కనే నిలబడి కత్తి ఎత్తి పెట్టుకొని తల ఎత్తినచో నరికి వేత్తునని రౌద్రము ప్రదర్శించు చుండెను. వడ్డించుకున్న పదార్థములన్నియు మాత్రమే గాక ఏమీ మిగలకుండా వండిన పదార్థము అన్ని ఆమె తల ఎత్తకుండా తినివేసెను. అపుడామె భర్త ఇంచుక చిరునవ్వుతో పప్పులో

ఉప్పు సరిపోయినదా? పాయసమున పంచదార ఎక్కువైనదా? ఇత్యాది ప్రశ్నల వర్షము కురిపించెను. ఆ ప్రశ్నలన్నింటికి ఆమె ఇచ్చినది ఒకటే సమాధానము. "ఏమో నేనేమి యెరుగను. దేని రుచియు నేను గుర్తించలేదు. పొరపాటున తల ఎత్తుదునేమో ఎత్తినచో మీరు ఖండింతురేమో అని భయము మనస్సంతయు నిండిపోయినది" అని సమాధాన మిడెను. అది భర్త పకపకా నవ్వుచూ అదే విధముగా ఈ ఇరువది సంవత్సరముల నుండి నీతో సంసారము చేసి సంతానం కంటిని. అట్లే నా బాల్య మిత్రుడును. ఫలహారములన్నియు తినివేసెను. నిరంతరము మా మనస్సులు మాత్రము పరమాత్మయందేయుండుటచే నేను సదాబ్రహ్మచారి నైతిని. అతడు సదోపవాసి అయ్యెను" అని ఆమెను ఒప్పించెను.

ఇదే రాజయోగి లక్షణము."యతి ర్వా పతిర్బ్రహ్మచారిచగేః" అనగా సన్యాసి గాని చక్రవర్తి కాని గృహస్థు గాని బ్రహ్మచారిగాని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులలో ఎవరు గాని ఏ దేశము వారైనను, ఏ జాతి, కులముల వారైనను ఇట్టి రాజయోగముచే కృతకృత్యులు కాగలరనుట నిస్సంశయము.

15. అంతకీ యింతత్తై, యింతకు యింకెంతో (1)

ఒక గ్రామములో సుఖలాలసుడగు కృష్ణారావు అను యువకుడొకడుండెను. త్రాగుడు, జూదము, వ్యభిచారము అను ముచ్చటగా మూడు దుర్వ్యసనములు మాత్రమే అతని కుండెను. వాటికతడు లోలుడై పోవుట వలన పిత్రార్జితమైన సొత్తంతయు హారతి కర్పూరమువలె హరించి పోవుచుండెను.

ఒకనాడతడు మద్యమును కడుపారసేవించి కైపెక్కి తూలుచు మేలైన సుగంధ వక్కపొడితో గూడిన తాంబూలమును పరిమళములు వెదజల్లు పుష్పహారములును, చేత బట్టుకొని రాత్రి 8 గంటలకు వేశ్య యింటికి పోవు చుండెను. ఆ తూలుటలో చేత నున్న పుష్ప హారములు, తాంబూలములు పక్కనున్న మురికి కాలవలో పడి పోయెను. "శ్రీకృష్ణార్పణమస్తు" అని పకపక వెకిలి నవ్వులు నవ్వుచూ అతడు ముందుకు సాగి పొయ్యెను. కృష్ణా రావుకి 40 సం॥లు వచ్చు సరికి వ్యాధులు ప్రోవుఅయ్యెను. సుఖవ్యాధులచే శుష్కించిన అతని శరీరము నందు నిరంతర మధ్యపానముచే శిధిలమైపోయిన హృదయకోశము ఇక స్పందించలేక సహాయ నిరాకరణ మొనర్చెను. యమ ధర్మరాజుగారి సన్నిధిలో చిత్రగుప్తుడు అతని జీవిత చరిత్ర నివేదించెను. శరీర

వాంగ్మనస్సులలో దేనిచేతను అతడెన్నడున్నూ ఏ పుణ్య కార్యములూ చేసి యెరుగడు. యమధర్మరాజు కోపోద్రిక్తుడై ఓయీ నీ పాపములకు ప్రాయశ్చిత్త పరిహారములు లేవు శాశ్వత నరకమే తగిన శిక్షయితే కృష్ణార్పణమస్తు యెగతాళిగానైతాంబూల పుష్పాదులు పరమాత్మ కర్పించిన వాగ్రుట కర్మ ఫలితార్థంగా నీకైదు నిమిషములు స్వర్గాధిపత్యము లభించినది. ముందుగా స్వర్గాధిపత్యము మనుభవింతువా? నరకానుభవానంతరం అనుభవింతువా? చెప్పుమని గద్దించెను.

కృష్ణారావు క్షణకాల మాలోచించెను. "ఏమేమీ! యీ యెగతాళి మాటకు యింద్రాది పత్యమా! మెరుపు నొక ఊహ అతని మెదడులో మెరిసెను. చిత్తం, చిత్తం జీవితమంతా క్షణిక సుఖాలకై శరీరాత్మలను కైంకర్యము చేయుట కలవాడు పడ్డవాణ్ని. కావాలని కష్టం కోరుకొంటానా? నందో రాజా భవిష్యతి ముందు ఇంద్రత్వ మిప్పించండి అని కృష్ణారావు వేగిరపాటు చూపించెను.

ఇంద్రుని సింహాసనము దింపి కృష్ణారావును సింహాసము యెక్కియెక్కుట తోడనె"పది మంది బ్రాహ్మణులను పిలిపించు నేను దానాలు చేయాలి ఇంద్రుని కృష్ణారావు ఆజ్ఞాపించెను. చంద్రాయణాది వ్రతములు చేసిన వారు యజ్ఞయగాది క్రతువులు చేసినవారు వెంటనే సత్పాత్రులైన సద్రాహ్మనులు వచ్చినవారు. ఒకనికి కామదేనువు. మరొకనికి కల్పవృక్షము యింకోకనికి చింతామణి వేరోకనికి ఐరావతము యింకా మరోకనికి నందానోద్యానము యిట్లా స్వర్గమందలి సద్వస్తువులన్ని దానము చేసెను. చివరికి ఇంద్రుని పిలిచి నీవు శతాదిక యజ్ఞములు చేసిన సుకృతాత్ముడవు. నీకన్న తగిన వారెవరు ? నీకింద్రాది పత్యము దార పోస్తున్నాని చెప్పి ఇంతలో 5 నిమిషములు ఆఖరి గంటలో సింహాసనము దిగిపోయెను.

యముడు పకపక నవ్వుచూ "ఐనదా నీఇంద్రాధి పత్యము నడునడు నరకంలోనికి అంటూండగానే కృష్ణారావాతనిని వారించి" ఆగండి! ఆగండి! అంతకే యింతైతే యింతకి యింకెంతో"చెప్పండి. యీ ధాన ఫలము కూడా అనుభవించి పిదప మీనరకాని కొస్తాను అని చిత్రగుప్తుడు వైపు చిత్రంగా చూచి కన్నుగీటెను.

యమధర్మరాజు పగటి కాగాడావలె వెలవెలబోయెను. కృష్ణారావు వంటి కేసు తన అనుభవంలో ఎక్కడాతగలలేదు. కృష్ణారావుని తీసుకొని ఇంద్రసభలో యముడు కేసు పరిష్కారం కోరెను. ఇంద్రుడు బృహస్పతి వైపు చూడగా బృహస్పతి ఆకాశము

వైపు చూసెను. క్రమముగా కృష్ణారావు వైకుంఠ కైలాసాది పతులకడకు కృష్ణారావుని యముడు గొనిపోయెను. బ్రహ్మచారియైన వాణీ ప్రాసాదము సన్నగిల్లి బ్రహ్మదేవులు నీళ్లునవలెను దానాలన్నీ నాకే అర్పించాడు కనుక యీ కేసులో నేను ప్రతివాదిని తీర్పు చెప్పుటకు నా కర్హత లేదని విష్ణుదేవుడు యుక్తి చేసెను. పైగా గొప్పఫలాలు ఇవ్వడానికి ఉబ్బులింగడే సమర్థుడు. అతని వద్ద తెలుసుకోమన్నాడు. సదాశివుడున్నా విని ఏమీ చెప్పలేక స్తంభించి పోయి స్థాను రూపము వహించెను. యముని కింకేమీ దారితోచక నీ దానలకు ఫలితం నీవే కోరుకో త్రిమూర్తులున్నారు తీరుస్తారన్నాడు.

నేను చేసిన దానాలకేమి ఫలం యివ్వాలో నీకు తెలియక పోయె త్రిమూర్తులు నాకేసు తీర్మానించలేక దిక్కులు చూచిరాయె. నీవెమో యింకా మాట్లాడబోతామేమిటి? చాలు చాలులే వయ్యా! యిటు వంటి చేతగాని వానికి ధర్మరాజు పదవా పో!పో! నా యెదుటనుంచి అని కృష్ణారావు ధిక్కరించి బల్కెను. బ్రతుకుజీవుడా!! యని ధర్మరాజు సిగ్గుపడి యిల్లు చేరెను.

16. అంతకీ యింతత్తై, యింతకు యింకెంతో (2)

ఒక వూరిలో రామయ్య అనే పేదకాపు కూరగాయల వ్యవసాయమే జీవనాధారముగా గల్గి జీవయాత్ర సాగించు చుండెను. అతని కున్నదంతా ఒక పెరటి దొడ్డి మాత్రమే. అందాతడు కూరగాయల పాదులు పెట్టి కాపించి అమ్ముకొని జీవించు చుండెను. ఆదొడ్డిలో నితడు ఒక పొట్లపాదు పెట్టి ఆపాదు కాయలలోనుంచి ప్రతిరోజు ఒక కాయకోసి సత్‌పాత్రుని కొకనికి దానము చేయు చుండెను.

పొట్లపాదున నున్న కాయలన్నియు అయిపోయెను. ఆదినమున పాదున ఒకటే ఒక కాయ మిగిలి యుండెను. తన యింట్లో తినుటకు యెట్టి సామగ్రియు లేకుండా పోయెను. అతడా ఒక్క పొట్లకాయను వుడక బెట్టుకొని తింటే తప్ప క్షుద్బాధ తీరు అన్యోపాయము లేకుండెను. కాని తనకు నియమ భంగమగుచున్నదే? తానా ఒక్క కాయను కూర వండుకొని తింటే ఆరోజున శాకాదానము జరుగుటెట్లు? కాపు మనస్సు కల్లోల పడుచుండెను.

ఇంతలో 80 సంవత్సరముల వయస్సు గల సద్బ్రాహ్మణుడొకడు. రామయ్య యింటికేతెంచి రామయ్యా! నీవు నిత్యమూ శాకాదానము చేయుదువటగదా! యీ రోజు ఆ శాకాదానము నాకు చేయుము తినుటకేమిలేదూ నాయనా అని చతికిలబడెను.

వెంటనే రామయ్య కృత నిశ్చయుడై పాదున నున్న పొట్ల కాయను కోసి ఆ బ్రాహ్మణుని చేతిలో బెట్టి నమస్కరించి పంపివేసెను. మలుపు తిరుగుట తోడనే పొట్ల కాయతో సహా భూసురుడు తిరోహితుడయ్యెను.

రామయ్య మరణించిన పిదప యమధర్మరాజు కడకుకొంపోబడెను. చిత్రగుప్తుడు చిరచిరా జూచి ఇతడు మహాదాత. నిత్యమూ శాకాదానము చేసినవాడు. ఒకనాడు మారు రూపమున పరీక్షింప వచ్చిన విష్ణుమూర్తికి దానము చేసిన మహాపుణ్యాత్ముడని నివేదించెను. యమ ధర్మరాజు యిందుకేమి ఫలప్రాప్తి కలిగింపవలెను అని యోచించి ఒక దేశమునకు రాజ్యాధిపత్యము వహించిన రాజు గర్భ వాసమున నాతడు జన్మించ వలెనని తీర్పు యిచ్చెను మరియు రామయ్యకు పూర్వ జన్మ స్మృతి కూడ నుండు నట్లు వరమిచ్చి పంపివేసెను.

రామరాజు అనే పేరుతో రామయ్య ఆ దేశపు రాజుగారి గర్భవాసమున జన్మించిరి. పూర్వ జన్య స్మృతి గల్గి వివేకియై విద్యా బుద్ధుల నేర్చి కొంత కాలమునకు తండ్రి మరణించగా తాను రాజుగా సింహాసన మధిరోహించెను. వెంటనే తన కోట తాలూకు ఆవరణలో నున్న ఉద్యాన వనమంతయూ ఊడ పీకించి పొట్ల పాదులు చెట్టించి కాచిన కాయలన్నియు నిత్యమూ అందరికి దానము చేయుచుండెను. కొన్ని సంవత్సరములు గడచిపోయెను. కాని పొట్లకాయల దానములు మాత్రం ఎడతెరిపి లేకుండా నిత్యమూ జరుగుచునే యుండెను. రామరాజు గారి ఆ స్థానములోను రాజ్యములోనూ అనేక మంది పండితులు విద్వాంసులు నుండిరి. తన సమక్షమున కేతెంచిన ప్రతి పండితుని చూచుట తోడనే అయ్యా! అంతకీ యింతైతే యింతకు యింకెంతో! చెప్ప గలరా? అని రామరాజు ప్రశ్నించు చుండెను. సమాధానము చెప్పలేక రాజ సత్కారము పొందలేక పండితులు వచ్చిన దారినే బోవుచుండిరి.

కొన్ని సంవత్సరముల అనంతరము పరరాజ్యము నుండియేంచిన పండితుడొకడు రామరాజు సభకరుదెంచెను. రాజుగారు పొట్లకాయల రామరాజు గారిని పరరాజ్యము లలో ప్రసిద్ధి కెక్కిన వృత్తాంతమా పండితునకు తెలుసు. రాజుగారు వేయు ప్రశ్న వినీ వినుట తోడనే రాజుగారి హృదయమును గ్రహించి యిట్లనెను. అంత కింతైనది. గనుక యింతకు అంతే సిద్ధస్తుంది అనెను. రామరాజుగారికి అర్థముగాక వివరించుమని పండితుని రాజుగోరెను. ప్రభూ పేదరికంలొ క్షుద్బాదలో నుండినపుడు వున్నదంతా

(అది ఒక పొట్లకాయే కావొచ్చు) పరమేశ్వరునికి దానము చేసిరి కనుక రాజ్యప్రాప్తి కల్గినది. అన్ని అష్టైశ్వర్యములతో తులతూగు చుండియు పొట్లకాయ మాత్రమే యిప్పుడు తమరు దానము చేస్తే మీకు పొట్లకాయల పండించే జన్మ తప్ప యింకేమి కలగదు? అని చెప్పి వెడలిపోయెను.

17. చిత్తమంతా శివుని మీదే

ఒక గ్రామములో రామయ్య, సోమయ్య ఇద్దరు మిత్రులు ఉండెడివారు. ఈ ఇద్దరకు సంతానము కలదు. రామయ్య, కుమారుడును కష్టపడి వ్యవసాయము చేసుకొంటు కాలక్షేపము చేసిరి. సోమయ్య కుమారుడు సోమరిపోతు కాని ధనమ ధాంధుడు. జలసాలకు అలవాటుపడి చేతికిదొరికిన సొమ్మును దుభార ఖర్చులకై దుర్వినియోగము చేయు చుండిరి. అయినను సోమయ్య పొదుపరితనము జాగ్రత్త వలన సోమయ్య ధనము అభివృద్ధి గాంచుచునే ఉండెను.

బాల్య మిత్రుల కిరువురకు ఉత్తరదేశయాత్రలు చేయవలెనని కాంక్ష యుండెను. ఐతే, ఒక్కసారిగా రామయ్యకు వలయు ధనము చిక్కుట కష్టము. రామయ్య యెన్నడూ అప్పు చేయ యెరుగడు. అప్పుగానైననూ సోమయ్య ధనము తీసుకొనుట కంగీకరించలేదు. యిర్వురూ కలసి తీర్థ యాత్రలు చేయవలె ఎట్లు? వలయు ధనము రామయ్య కూడబెట్టుకొన్న పిదపనే ప్రయాణమై పోవుటకు వారిర్వురు నిశ్చయించుకొనిరి.

రెండేండ్లు అహో రాత్రస్య రామయ్యయూ కుమారుళ్ళును కష్టించి రెండు వంద రూపాయలు కూడబెట్టిరి. రామయ్య సోమయ్య ఒక శుభముహూర్తమున తీర్థ యాత్రలకై బయలుదేరి కాలి నడకను మజలీలు చేసుకొనుచూ తూర్పు దిశగా ప్రయాణము సాగించిరి. విజయనగర ప్రాంతము వరకు పోవుసర్కి రామయ్యకు దప్పిక విస్తారముకాగా నీవు నడుచు చుండుము నేను దాహం తీర్చుకొని ముందు మజ్లీలోనైనా నిన్ను కలుసు కొందును అని రామయ్య చెప్పుటచే సోమయ్య ప్రయాణము సాగించు చుండెను.

దాహమునకై పోయిన రామయ్య సమీప గ్రామములోని మొదటి యింటి కడకేగి ఎంత పిలిచినా ఎవరునూ పలుకకపోవుటచే ఓరు వాకిలుగా నున్న తలుపు గెంటుకొని లోనికేగి చూడగా ఒక కరుణామయ దృశ్య మాతని కండ్లబడెను. ముసలి వాడొకడు

కుక్కి మంచంలో కొన వూపిరితో మూలుగుచుండెను. అతని భార్య వంటింటిలో కొంగు పరుచుకుని పరుండియుండెను. కోడలు వంటింటి గుమ్మముపై తలవాల్చి కునికి పాట్లు పడు చుండగా ఆమె ఒడిలో చేరిన చంటివాడు శుష్కించి పోయిన ఆమె రొమ్ములను దవడలు పీకునట్లు కుడుచు చుండెను. ఆమె భర్త పెరటి గుమ్మం కడ మోకాళ్ళపై తలనాన్చి ముడుచుకొని పోయి కూర్చుండెను. దాహం కావలని బిగ్గరగా అరచిన రామయ్య మాటలకు మెల్లిగా అతడు తలెత్తి పెరటిలోని నూతి చూపించుచూ సంజ్ఞ చేసెను. రామయ్య బావి కడ దప్పి బాపుకొని వచ్చి యువకుని విచారించగా కరువుచే ఆ ప్రాంతమంతయు అట్టుడికి పోవు చుండెననీ మూడు రోజులుగా తమకెవర్కి గ్రుక్కెడు గంజి కూడా లేదని వినటంతో రామయ్య గుండె నీరయిపోయెను. వెంటనే అతడా గ్రామంలోని కోమటింటికి పోయి రెండు రూపాయలతో బియ్యపు నూకలను ఖరీదు చేసి తెచ్చి జావకాచీ అందరకు పోసెను. ఒక గంట అగుసరికి అందరికి పోవుచున్న ప్రాణములు తిరిగి వచ్చెను.

రామయ్య విచారించగా ఆకుటుంబమంతయు ఆయింటి యువకుని శరీర కష్టముపై నాదారపడి యుండెను. ఆకాశమంటిన ధరలతో కుటుంబ పోషణ జరుగక చివరకు గంజి మెతుకులు కూడా మూడు రోజుల నుంచి లేకుండా పోయెను. యిట్టి స్థితిలో వారినట్లే వదలి పోవుటకు రామయ్యకు కాలాడలేదు. వారికి బ్రతుకుతెరువు చూపించకనే పోయినచో తనకు తీర్థయాత్రా ఫలము మాత్రము యెట్లు చేకూరును. రామయ్య దీర్ఘముగా ఆలోచించి ఆ మరునాడే విజయనగర సంతకు పోయి ఒక బండిని రెండెడ్లను రూ.50/- లకు ఖరీదు చేసి యడ్లకు వారం రోజులకు సరిపడు గడ్డికొని బండిమీద వేసుకొని సాయంత్రమునకు తోలి తెచ్చెను. ఆ ధనము కూడా రామయ్య తెచ్చిన నూకలతో కుటుంబం వారు గంజి కాచుకొని త్రాగి తెప్పరెల్లి యుండిరి. రామయ్య యువకుని పిలిచి నాయనా? యివిగో యీ బండిని కిరాయికి త్రోలుకున్నచో దినమునకు నాలుగైదు రూపాయలు రాగలవు. దీనితో కుటుంబమును పోషించుకో నేను పోయి వచ్చెదనని పోవుట కాయత్తపడెను. "అట్లు పోవుటకు వీలులేదు. మా కుటుంబమునకింత మేలు చేసినవాడవు పదిరోజులుండి పోక తప్పదు" అని బలాత్కారముగా ఆపుచేసిరి. ఆపదిరోజులలో కుటుంబము వారందర్కీ తగు బలము చేకూరెను. ఏలోపము లేకుండా కుటుంబము జరిగిపోవుచుండెను. గ్రాసమునకు

పోను మిగిలిన సొమ్ముతో ఒక అంగ వస్త్రము, ఒక చీర యువకుడు కొనగల్గెను.

మీరుణమెట్లు తీర్చు కొందుమోగదా! అని కృతజ్ఞతా పూర్వక ఆనంద బాష్పము లతో కుటుంబము వారంతా వీడ్కోలు నివ్వగా రామయ్య బయలుదేరెను. కాని డబ్బు సంచిలో రెండు రూపాయలు మాత్రమే మిగిలియుండెను. వానితో తీర్థయాత్ర సాగించుట యెట్లు? రామయ్య ఇంటి ముఖం పట్టి 4రోజులలో ఇల్లు చేరెను. కాని రామయ్య చిత్తమంతా సోమయ్య చేయు తీర్థస్నానములు దర్శించి అర్చించెడి దేవతా మూర్తులు వారిపైనే లగ్నమై సోమయ్య ఈ సర్కి పూరి జగన్నాధము చేరతాడు. యీ సర్కి కాశి చేరతాడు. గంగా స్నానము చేస్తాడు అయ్యో నాకు ప్రాప్తి లేక పోయెనే అని మనస్సులో సోమయ్య చేయు తీర్థయాత్రలు, దేవతారాధనలు, పున్యకర్మలయందే లగ్నమై సోమయ్య యెప్పుడు వచ్చి ఆ విశేషములన్నియు నెరిగించునా అని దదేక ధ్యానముతోనే కాలం గడుపు చుండెను.

సోమయ్య పోయిన ప్రతి క్షేత్రమందునూ తనకన్న ముందే దైవదర్శన పూజా భిషేకములు గావించుకొని వెడలిపోవు రామయ్య దూరంగా సోమయ్య దర్శన మిచ్చు చుండెను. యిదేమి నాతో గలిపి యాత్రలు సేవించకుండా నాకన్నా ముందే పూర్తి చేసుకోవాలన్న తలంపు! అని సోమయ్య ఆశ్చర్య పోవుచు చివరకు యాత్రలు ముగించు కొని ఫలానా తేదీకి ఇల్లు చేరుకొంటున్నానని సమీప గ్రామమునుండి కబురు చేసి స్వగ్రామము చేరుకొనెను. మేళతాళములతో రామయ్య ముందు నడువగా సోమయ్య కుటుంబము వారందరూ సోమయ్య కభ్యుద్దాన మిచ్చిరి. రామయ్య సోమయ్యను బిగియారా కౌగిలించుకొని క్షేమమడిగెను. కాని రామయ్య తన్ను దగా చేసెనని సోమయ్య భావించు చుండెను. జరిగిన సమాచారమంతా సోమయ్యకు చెప్పి తనకు తీర్థయాత్రలు ఈజన్మలో తనకు లబించజాలవని కంట తడి పెట్టుకొనెను. సోమయ్య నమ్మకం చిక్కక కొన్ని రోజుల అనంతరము రామయ్య చెప్పిన విజయనగరప్రాంత గ్రామమునకు పోయి ఆకుటుంబము వారిని కలిసి విచారించి రామయ్య కధనంతయు సత్యమని తెలుసుకొని ఆశ్చర్యముతో యింటికి తిరిగి వచ్చెను.

ఆహా! రామయ్య యెంత దన్యుడు? నిజముగా రామయ్య చిత్తమంతా యాత్రాదుల యందే యుండుటచే తీర్థయాత్రలఫలమంతా యాతనికే దక్కెను. తానో చిత్తమంతా తన ఆస్థిపాస్థులను తన కుమారులు ఏమి పాడుచేయునో ? ధనమంతా

ఖర్చు చేయునో ? ఏమో ? అను సంశయ భయదుఃఖములతోనే నుండుటచే తాను యాత్ర చేసినను చేయని వానితోనే సమానము కదా? చిత్తమంతా శివుని మీదే వున్న రామయ్య నిజముగా తీర్థయాత్రలు చేయకనే చేసినాడు. ఎంతటి సుకృతాత్ముడు.

18. మాతా పుత్ర విరోధామ హిరణ్యాయ నమో నమః

ఒక గ్రామములో ఒక రైతు కుటుంబంలో తల్లి కొడుకు వ్యయసాయమే ఆధారముగా జీవితము గుడుపుచుండిరి. వారికొక ఎకరము మాత్రమే మెరక భూమి యుండెను. అందులోనే వివిధములైన కూరగాయలను కాలానుసారముగా పండించుచూ అందు వచ్చు ఆదాయముచే కాలం గడుపుచుండిరి. వేకువనే లేచి కుమారుడు పొలం పోయి పగలంతయు పొలంలో కష్టించి తిరిగి రాత్రి పడిన పిమ్మటనే ఇంటికి వచ్చుచుండెడివాడు. భోజనము గంపలో పెట్టుకొని తల్లియే తీసుకొనిపోయి కుమారుని కందించుచూ యింటికి తిరిగి వచ్చునప్పుడు పొలం నుండి తాను మోసితేగల్గినన్ని కాయకూరలు మొదలగునవి యింటికి తీసుకొని పోవుచుండెడిది.

ఆనాడు యథాప్రకారము భోజనం తల్లి తెచ్చుసరికి కుమారుడు నీటికొరకొక దొరవు త్రవ్వు చుండెను. గంప క్రింద బెట్టి కంచంలో వడ్డించి వచ్చి బుజించుమని తల్లి కుమారుని పిలుచు చుండెను. ఇంతలో కుమారుని చేతి గునపము 'ధబేలు'మని భూమిలోని ఏదో వస్తువునకు తగిలెను. ఆ శబ్దము విని అశక్తితో తల్లికూడ గుంటలో దిగెను. ఇర్వురు కలిసి మరొక మూర లోతు జాగ్రత్తగా మట్టి పెల్లగించి తీసివేయగా రూపాయలతో నిండిన రాగి బిందె ఒకటి వారి కళ్ళబడెను. వార్వివురు పరమానందముతో ఆ ధనమును తాకి కళ్ళ కద్దుకొని వారి దరిద్ర విచ్ఛిత్తి అయినదని మిక్కిలి సంతసించిరి.

పైకి చూచుసరికి తల్లి తెచ్చి కంచంలో వడ్డించిన భోజన పదార్థములన్నియు ఒక కుక్క వచ్చి పూర్తిగా భక్షించి శేషించిన మెతుకులను నాకి వేయు చుండెను. అయ్యో!అయ్యో!! అంటూ తల్లి పైకి వచ్చెను. పోనిలే, భోజనం పోతే పోయింది గాని శేష జీవితమంతయు హాయిగా కాలు మీద కాలేసుకొని గడప గల సదవకాశము చిక్కినది. భూలోక సుందరి నొకతెను పెండ్లాడి పుత్రపుత్రికా సంతానంతో సమస్త భోగములనుభవిస్తాను. నీవు పోయి మంచి భోజనము తయారుచేసి వేగిరంగా తీసుకురా నేనిక్కడే కాపలా వుండి రాత్రి పడిన పిమ్మట ఎవరి కండ్ల పడకుండ ధనము ఇంటికి తెస్తాను అని కుమారుడు పలికెను. "ఏలాగు నేనింటికి పోతున్నాను గదా! గంపలో

పెట్టుకొని ఎవరు చూడకుండా యిల్లు చేరుస్తాను. ఖాళీ పాత్రలు తీసుకొని పోతుంది అనుకుంటారు గాని ఏమి అనుమానము తగులదులే అని తల్లి పలికెను. ఓహో! ఈ ధనము ఈ వంకతో నీ స్వంతము చేసుకోవాలనుకుంటున్నావేమో. ఇందొక పైసాకూడ నీకు రాదు అని కుమారుడు మారు పలుకగా చిన్న బుచ్చుకొని తల్లి ఇంటి దారిన యిట్లాలోచించసాగెను. భూలోకసుందరిని తెస్తాడట. పెండ్లాడి, బిడ్డలతో సమస్త సుఖములనుభవిస్తాడట. నాకొక పైసా కూడ ఇవ్వడట ఆహా! అపుడే ఎంత పొగరు వచ్చినది? పెళ్ళాము బెల్లం ముక్క. తల్లి బెడ్డ ముక్క. ఇక యింకో సన్యాసిని తెచ్చి దానిక్కూడా నన్ను దాస్యము చేయమంటాడు కాబోలు. యిదంతా యీ ధన ప్రభావము కదా! వానికి దక్కకుండా యీ ధనము నేనే పొందే ఉపాయ మాలోచించాలి" అని యింటికేగి వంట చేస్తున్నంత కాలమూ తీవ్రముగా ఆలోచించ సాగెను.

ఇక్కడ కుమారుడు ఇట్లా ఆలోచించ సాగెను. "యిది తల్లి గాదు దయ్యము. అప్పుడే ఎంత ఎత్తు వేసిందో ధనమంతా గంపకెత్తుకుపోతుందట. ఏలాగైనా ధనము కాజేయాలని కాకపోతే ఏమిటిది? ధనము చూచింది. యిక, సగమైనా యిమ్మని కూర్చొని నేనూ నా భార్య సుఖముగా అనుభవించకుండా అడుగడుగునా అడ్డు తగుల్తుంది. దీని హజమాత్ చేస్తే తప్ప యింత ధనము నాకు సుఖముండదు" అని కుమారుడా లోచించు చుండెను.

ఇంతలో తల్లి అన్నము గంపలో బెట్టుకొని రానే వచ్చెను. నాగలి తాలుకు మేడి తోక ఒకటి ప్రక్కనే పడియుండెను. తల్లి గంప నేలబెట్టి లేస్తూ ఉండగా కుమారుడా మేడితోకను చేతబట్టి ఆమె శిరో భాగమున బలముగా నొక దెబ్బ వేసెను. ముసలది కిమ్మనకుండా ముందుకు పడుటలో గోతిలోపడిపోయి ప్రాణములు విడిచెను. కుమారుడు తొందరగా గోతిలో దాగి ఒక మూలకా శవమును లాగి పైన పోగు పడిన త్రవ్వకపు మట్టిలో ఆమెను తొందరగా పూడ్చి వేసెను.

అతనికి భోజన వేళ మించి పోయెను. శ్రమచే మేను దస్సిపోయెను. ఆకలి కణకణలాడుచుండెను. తొందరగా కంచములో అన్నం పెట్టుకొని నాలుగు కభలములు మ్రింగి ఏమీ అన్నము కొంచెము చేదుగా నున్నట్లున్నదే అనుకొంటూ మరి నాలుగు ముద్దలు మ్రింగెను. అప్పటికి అతని అనుమానము బలపడెను. కొంపతీసి ముదుసలిది అన్నములో ఏమైనా కలుపలేదు కదా అనుకొనుచుండగానే తల తిరుగ సాగెను. గుండెలు

బరువెక్కెను. అన్నములో కలిపిన మహా విషము చురుకుగా పని చేయగా నాతడు విలవిల తన్నుకొని ప్రాణములు విడచెను.

శ్లో॥ లాంగలేన మాతామాతా, విషాన్నేనహతాసుతా
మాతాపుత్ర విరోధాయ హిరణ్యాయ నమో నమః

19. నిజమైన దేవుడు

ఒక రాజు తన కొలువు కూటంలో నున్న పండితుల నుద్దేశించి దేవుని గురించిన ప్రశ్నలు మూడడిగినాడు. 1. దేవుడెక్కడున్నాడు? 2. దేవుడేదిశను చూచు చున్నాడు? 3. అతడే పని చేయు చున్నాడు? ఆ ప్రశ్నలు మూడింటికి తృప్తికరమగు సమాధనము చెప్పినచో అర్ధ రాజ్యమిత్తునని రాజు ప్రతిజ్ఞ చేసెను.

సభలో శాస్త్ర పండితులనేకులుండిరి కాని స్వానుభవము లేకుండుటచే ఎవరున్ను చెప్పుటకు సాహసించక కొంత గడువిమ్మని కోరిరి. నాటి కారు మాసముల వ్యవధిలో నున్న మాఘ శుద్ధ పౌర్ణమినాడు ఎవరైననూ సమాధనములు చెప్పి ప్రకటించిన బహుమానము పొందవచ్చునని తన రాజ్యమంతటా చాటించెను.

ఆస్థాన పండితుని మేనల్లుడు హిమాలయ ప్రాంతంలో కొన్నేళ్ళుగా గురువుల సేవించి ఆత్మస్వరూప జ్ఞానమును పొంది గడువు దినమునకు రెండు రోజుల పూర్వమే ఆ రాజధాని నగరమునకు వచ్చి యుండెను. ఈ వృత్తాంతము విని మేనమామతో తానును రాజుగారి దర్బారుకు ఏ తెంచెను. కాషాయాంబరము, జడలు కట్టిన కేశ రాశి, చిరు గడ్డము, బ్రహ్మ వర్చస్సుతో మెరసి పోతున్న అతనిని చూసి అతడు తప్పక రాజు గారి ప్రశ్నలకు సదుత్తరం ఇచ్చి అర్ధరాజ్యం గెల్చుకొనగలరని యెల్లరను ఆసక్తితో చూచుచుండిరి.

రాజుగారు సభాస్థలికే తెంచి సింహాసనారుఢుడై నా ప్రశ్నలకు ఏవరైననూ నుత్తరమీయగలరా? అని సభనుద్దేశించి పలికెను. ఐదు నిమిషముల తర్వాత ఎవరునూ లేవలేదూ ఆస్థాన పండితుని మేనల్లుడు లేచి యేమా ప్రశ్నలు. ఒక్కొక్కటిగా అడుగుడు. నే సమాధానములు చెప్పెదను అని కించిదాంహకారములతో పలికెను. రాజుగారాయని విగ్రహము చూచి వినయముతో అయ్యా దేవుడెక్కడున్నాడు? అని మొదటి ప్రశ్న అడిగెను. ఒక గిన్నెలో పాలు తెప్పించుడు చెప్పెద అని ఆ యువ సన్యాసి పల్కెను. పాల గిన్నె రాజుగారికి చూపిస్తూ "ఈ పాలలో వెన్న యున్నది గదా! ఎక్కడున్నది?

పాలయందంతటా వెన్న సూక్ష్మరూపంగా వ్యాపించి యున్నట్లే దేవుడంతటా యున్నాడు" అని బాల సన్యాసి పలుకుటతో సభయంతయు హర్షధ్వానములతో చెలరేగెను. రెండు, దేవుడే దిశగా చూచు చున్నాడు? సెలవిండు అని యింకనూ వినమ్రుడై రాజు ప్రశ్నించెను. అందుకు సమాధానముగా బాల సన్యాసి ఒక కొవ్వొత్తి దీపమును దెప్పించి, దీప కలిక ఏ దిశ చూచుచున్నది? అట్లే దేవుడన్ని దిశల చూచుచునే యున్నాడు అని సమాధానము చెప్పెను. తెరపులేకుండా హర్షధ్వనులు ఐదు నిమిషముల వరకు మిన్ను ముట్టెను. మూడు, దేవుడేమి చేయుచున్నాడు? శెలవిచ్చి నన్ను కృతార్థుని చేయుడని రారాజు వేడుకొనెను. అందుకా బాల సన్యాసి మేఘ గంభీర స్వరముతో "మీరు శిష్య స్థానములో వుండి నన్ను ప్రశ్నించవలెను. నేను గురు స్థానములో నుండి శంక నివృత్తి చేయవలె"నని పలుకగా రాజు సింహాసనము దిగి బాల సన్యాసిని సింహాసన మెక్కించి చేతులు కట్టుకొని నిలబడి "అయ్యా! దేవుడేమి చేయుచున్నాడో కూడ శెలవిచ్చి సంశయ విముక్తి గావింపుడని విన్నవించెను. అపుడా బాల సన్యాసి చూడు రాజా! బిక్షకుడనైన నేను సింహాసన మలంకరించగా రారాజైన నీవు నా యెదుట చేతులు కట్టుకొని నిలిచినావు కదా! యీ పని దైవమే చేయించినది? అమీరు పకీరుగాను, ఫకీరును అమీరుగాను చేయుటయే ఆ భగవంతుని విలాసము అని నమ్ము అని సింహాసనము దిగి రాజునకు సింహసనమిచ్చెను. అంతట రారాజు యింతకంటె యీ ప్రశ్నలకు సమాధానమీయ గల వారెవ్వరైనా సభా స్థలి నున్నచో రావచ్చును" అని లేచి విన్నవించెను.

అంతలో సభలో నొక మూల నుండి సామాన్యుని వలె గాన వచ్చు వ్యక్తి యెకడు లేచి సింహాసనము సమీపింపజొచ్చెను. కొందరాతని వారింప నెంచిరి గాని ఆతడెవ్వరిని సరకు గనుక బాల సన్యాసి కెదురు పక్కగా నిలబడి రాజా! ఆసన్యాసి చెప్పిన దేవుడు నకిలి దేవుడుకాని నిజమైన దేవుడుకాదు అని మెల్లగా ఆచి ఆచి పలుకుట జాచి సభ వారందరు నివ్వెరపోయిరి. రాజు ఇంచుకు కోపంతో "ఏమీ నకిలి దేవుడా? ఎందుచేత? ఎవరు నీవు? నీ మాట ఋజువు చేయనిదే యిపుడే నీకు శ్చిరచ్ఛేదము చేయింతుననెను. అందుకా సామాన్య వ్యక్తి నిర్భయంగా రాజా! నేనా బాల సన్యాసిని కొన్ని ప్రశ్నలడిగి ఇపుడే నా మాటలను ఋజువు చేసుకొందును" అని బాల సన్యాసి దిక్కై స్వామీ! పాలలో వెన్నవలె యీ దృశ్యమైన ప్రపంచంలో దేవుడంతట నున్నాడనే గదా తమ అభిప్రాయము?

సన్యాసి:- అవును

సామాన్యుడు:-దృష్టాంతములో వెన్న యెంత సత్యమోపాలున్న అంత సత్యమేగదా! అట్లే దేవుడెంత సత్యమో జగత్తున్ను అంతే సత్యమా?

సన్యాసి:- కాదు కాదు బ్రహ్మము సత్యము జగత్తు మిద్య

సామాన్యుడు:- ఐతే మిద్య అయిన జగత్తులో సూక్ష్మంగా వున్న బ్రహ్మమును మిద్యా వస్తువువే అయి వుండవలెనా వద్దా, రాజా ఇప్పుడు చెప్పుడు సన్యాసి చెప్పిన దేవుడు నకిలి దేవుడగునో లేదో!

రాజు:- (యిందుకు నివ్వెరపోయి) ఆ! ఆఅ!! సరే దేవుడు అంతట చూచుననుటలో మీ ఆక్షేపణ ఏమి?

సామాన్యుడు:- స్వామి! మీరు చెప్పిన దేవుడు కేవలదృగ్ స్వరూపుడై సర్వ దృష్యములకు ద్రష్టమై వున్నాడని గదా! మీ భావము?

సన్యాసి:- అవును దృక్ బ్రహ్మ దృష్యమాయేతి అని సిద్దాంతం గదా?

సామాన్యుడు:-ఐతే దృశ్యమే లేకుంటే దృక్ శబ్దమెట్లు వర్ధించ గలదు? దృష్ట దర్శనము ద్రక్కలేక జ్ఞేత జ్ఞేయము జ్ఞానము ఇత్యాది త్రిపుటలలో ఒకటి అసత్య మగునో మిగతా రెంటికి వునికియే లేదు గదా. ఆకల్పంలో మీరు చెప్పిన దేవుణ్ణి నిజమైన దేవుడని అనవచ్చునా?

రాజు:- అనరాదనే తోస్తుందే! ఐతే నిజమైన దేవుడు అఘటన ఘటనా సమర్ధుడు! అనుటకు మీ ఆక్షేపన ఏమిటో చెప్పదెరా?

సామాన్యుడు:-అహా దేవుడు నిష్రియుడని మీరు అంగీకరిస్తారా?

సన్యాసి:-తప్పకుండాను

సామాన్యుడు:-ఐతే మీరు చెప్పిన దేపుడు అమీరుని ఫకీరుగా, ఫకీరుని అమీరుగా చేస్తాడంటే అతడు నిష్క్రయడైన నిజమైన దేవుడెట్లా అవుతాడు. జ్ఞానకర్మలతో కూడిన వాడే అనాలి.

రాజు:-(తొందరగా సింహాసనము నుండి దిగి వచ్చి ఆ సామాన్యునికి పాదాబివందనం ఆచరించి) అయ్యా ఆ నిజమైన దేవుడెక్కడున్నాడు? ఏ వైపు చూస్తున్నాడు, ఏమి చేయుచున్నాడో మీరే శలవిచ్చి నన్ను తరింపజేయ వేడుచున్నానని అంజలి బద్దుడై నిలిచెను.

సామాన్యుడు:-ఎక్కడ? అను ప్రశ్నకే తావు లేకుండా (ప్రశ్నించే వాడు వాని తెలివిలేని) ఆ పరిపూర్ణ పరబ్రహ్మయే యున్నది దాని యందు అన్య యేమి లేదు. గనుక నన్ను అది శుద్ధ నిరవయము, నిరీంద్రియము కనుక నన్ను అందు దిక్కుల నిర్ణయమే లేదు గనుక నన్ను ఏవైపు చూచుచున్నది అను ప్రశ్నకున్ను తావులేదు. దానియందు జ్ఞానము గాని శక్తిగాని లేదు. కనుక జ్ఞాన కర్మ క్రియలుండుటకే సావుకాశములేదు. అది శుద్ధ నిష్క్రియము అదే నిజమైన దేవుడు. "న చక్షుర్గతి నవాగ్గచ్ఛతినోమనః అను శ్రుతి దానికి మాత్రమే అన్వయించును.

౨౦. కనకపు సింహాసనమున.....

తండ్రి యనంతరము సింహాసన మెక్కిన రాజసింహునికి యిరువదైదు ఏడులు నిండినా వివాహం కాలేదు. కారణం యేకన్యయు నాతనికి నచ్చక పోవటమే. ఒకనాటి సాయం సమయమున అశ్వము నెక్కి రాజధాని నగరపు పొలిమేరల దాటి వాహ్యాళికేగి వెనుతిర్గి వచ్చుచుండగా నెత్తిన బుట్టతో మాసిన జీర్ణ వస్త్రములలో పగలంతయు నగరమున బిచ్చమెత్తి పొద్దుగూకుసరికి అడవిలో వున్న ఇల్లు చేరవలెనని బిర బిర చనుదెంచు పదియారరేండ్ల నెరజవ్వని యెకతే రాజ సింహునికి తారసపడెను. అస్తమించబోవు అరుణారుణ కాంతులు ఆమె ముఖంపై బడి వింత సోయగము తీనుచూ ఆమె అందము ఇనుమడింప జేయు చుండెను. మసి పాత్రలో చుట్టిన మాణిక్యం రీతి యామె శరీరచ్ఛాయలు మిసమిస మెరసిపోవుచుండెను ఆ ప్రథమ వీక్షణలోనే రాకుమారుని మనస్సు దోచుకున్న ఆమె సోయగము వర్ణణాతీతము.

రాకుమారుడామెని పలకరింపగోరి తన యశ్వము నాసన్నని రాచబాట కడ్డము నిలుపగా చేయునది లేక ముఖమెత్తి నాతని జాచి సిగ్గు దొంతరలచే చక్కిళ్ళు మరింత కెంపెక్కి తీయని కోకిల స్వరముతో దారి వదులుడని ఆమె యాతని ప్రార్థించెను. శ్రోత్ర నేత్రములచే విందారగించుచూ ఆమె పేరు బాలయని, తండ్రి సూరయ్యాయని, వారుండునది సమీపస్త కోయగూడెమని తెలుసుకొని రాకుమారుడామెకు దారిచ్చుట తోనే మరుని గజ్జల గుర్రమువలే మా కోమలి రివ్వున పరుగెత్తి పోయెను.

సూరయ్యాను రప్పించి కోరిన మానముల నిచ్చి ఆమెనంతఃపురమునకు చేర్చి ప్రతిదినము వచ్చి చుక్కలలో జాబిల్లి వలె వెళ్ళి పోవు నామె నొక శుభ ముహుర్తమున పెండ్లాడి ఆమెతో కామోప భోగములనుభవించు చుండెను. అంతఃపురము

మహారాణియై మహారాజభోగములన్నియు అనుభవించు చున్ననూ అది ఏమియోగాని ఆమె అనతి కాలములోనే చిక్కి శల్యమైపోయెను. రాజవైద్యులు ఆమె వ్యాధి ఇదిమిద్ధమని నిర్ణయించలేకపోయిరి. దృష్టిదోష నివారణకు భూత వైద్యమునకు భూతవైద్యులు తమ శక్తి నంతయు ధారపోసిరి కాని యేమియు లాభం లేక పోయినది. మహామంత్రిని రప్పించి యెటులైన మహారాణి తనకు దూరమైపోకుండా నుపాయమాలోచించవలెనని లేనిచో నామెపై బెంగచే తన ప్రాణములు కూడా పోవుట తప్పదని తమ యుబయులకు ప్రాణదానము చేసి పున్నెము కట్టుకొనుమనీ రాజు వరివరి విధముల ప్రాధేయపడెను. మహామంత్రి మహారాణి పూర్వయుదంతమునంతయు తెలిసియే వుండెను. తళుక్కున ఒక వుపాయము మాతని సూక్ష్మబుద్ధికి గోచరించనే మహారాణికి తప్పక సంపూర్ణారోగ్యము చేకూర్చునని తాను విదించినట్లు రాజదంపతులు కొంత కాలము నడువవలెననీ రాజువద్ధ వాగ్దానము గైకొని మంత్రి వెడలి పోయెను.

మరునాడే యొక ప్రత్యేక సౌధమునందు యేర్పాటు గావింప నియోగించెను. అందుకొక్క గదిలో ఒక్కొక్క పదార్ధము చొప్పున బియ్యము, పప్పుదినుసులు, రస వర్ణములు యిత్యాదిగా భోజన పదార్ధములు, నిత్య జీవితావసరమగు యితర వస్తువులు సమకూర్చబడెను. రాణి ఒక్కతియే అందు నివసింపవలే, భోజనాదికములన్నియు తానే తెచ్చుకొని పచనము చేసుకొని భుజించ వలెను. ఇతరులెవ్వరికి అందు ప్రవేశము లేకుండ నటుల తగిన కట్టు దిట్టములు చేయబడెను. రాణి నందు చేర్చ నిర్గమ ద్వారములన్నీ మూసి తాళములు వేసి తాళపుచెవులు మంత్రి యాధీనము నందు వుంచుకొనెను. ఒక నెల అట్లే గడిచిపోయెను. తన ఆరవ ప్రాణమైన రాణి యెట్లు వున్నదో! ఏమి కష్టపడుచున్నదో! చూడవలెనని రాజు పట్టుపట్టెను. రాణిని నిర్బదించిన సౌధమునందలి ఏప్రదేశమైనను బైటనుండియే చూడగలిగేటట్లు మంత్రి యాదిలోనే రహస్య స్థానమొకటి యేర్పాటు గావించి యుంచెను. రాజు నాస్థానమునకు గొంపోయి వారిర్వురును రాణి యెక్కడ నున్నదో ఏమి చేయుచున్నదో చూచుచుండిరి.

ఉదయము నందే నిద్ర లేచిన రాణి అప్పుడే విచ్చిన మదుర సౌరభము నెగజిమ్ము గులాభి పువ్వువలె రాజునకు నేత్రోత్సవము గావించెను. సంపూర్ణారోగ్యము కల్గిన ఆమె శరీరం యెక్క వంపు సొంపుల లావణ్యం వెనుకటి కంటె ద్విగుణీకృతమై ప్రకాశించు

చుండెను. రాజు కృతజ్ఞతతో మహామంత్రికి నమస్కారం చేసి మంత్రి యీ విజయమెట్లు సాధించెనో వినగోరగా, మాట్లాడవద్దని పూరకచూచు చుండుడని మంత్రి రాజుని కోరెను. మరొకొన్ని నిమిషములలో రాణి చంక ఒక బుట్టతో వొక గది వద్దకు బోయి "అమ్మా! కొంచెం బియ్యం పెట్టమ్మా" అని గదిలోకి వెళ్ళి కొన్ని బియ్యము బుట్టలో వేసుకొని తెచ్చుకొనెను. మరొక గది వద్దకేగి అమ్మా కొంచము పప్పులు పెట్టమ్మా అని దేవురించి పప్పు తెచ్చుకొనెను. యిట్లే వలయు సామగ్రి అంతయు ఆయాగదుల కడకేగి బిచ్చమెత్తుకొని వండుకొని తినెను. ఆపిదప నామె తృప్తిగా తేన్చి యెక్క చెట్టునీడను కొంగు పరుచుకొని గుర్రెట్టి నిద్రపోయెను. రాణి యొక్క శరీర పృష్టికి ఆమె మనో సంతుష్టికి గల కారణమేదియో రాజునకు తెలిసిపోయెను. ముష్టి మూడు పంక్తులా ముఖమున ధాత వ్రాసియుండగా అది మార్చుట తన వశమా! రాజు అసహ్యముతో ఛీ! ఛీ! యని చీదరించు కొనెను.

కనకపు సింహాసనమున శునకము కూర్చుండబెట్టి శుభలగ్నము
నందొరగ బట్టకట్టిన వెనుకటి గుణమేల మాను వినరా సుమతి

ఇట్లే శిష్యుల గుణగణములను సరిగా పరిశీలంచకనే భోధాధి కారమిచ్చి వారి పూజనీయత చేకూర్చవలెనంటే సాధ్యమా?

పై పూతలచే ఇత్తడి పుత్తడిగా ఎంతకాలము చెలమణి కాగలదు? కొంతకాలమున కట్టి గురువు చెల్లని రూపాయి వలె హాస్యభాజనుడై పోగలడు. గతరాత్రి యుపదేశము గొన్కి మరునాడే భోధాధి కారము పొందిని వాని మాట వేరే చెప్పనక్కరయేలేదు.

21. ఎవరి ప్రాణం వారికి తీపి

జన్మ రాహిత్య మాసించి యొకానొక సత్ శిష్యుడు ఆ గ్రామమంలోనే వుండిన నొక గురువుగారింటికి ప్రతి నిత్యము శ్రద్ధగా బోయి శ్రవణము చేయుచుండెను. ఆ గురువుగారు బహు కుటుంబీకుడు. కుటుంబపోషణకై యాయన యొక వుద్యోగము నందు వుదయము 11 గం లగాయతు సాయంత్రము 5 గంటల వరకు కష్టించి పనిచేయు చుండెను.

సాయంత్ర మారు గంటల మొదలు రాత్రి 8 గంటల వరకు సమావేశమైన భక్తులకు వేదాంతపు ప్రభోధము గావించు చుండెను. కాని ఈ శిష్యుడు మాత్రము సాయంత్రం అరుగంటల ఒక అరగంట మాత్రమే గురుభోధన విని 6 అగుసరికి అనుజ్ఞ తీసుకొని యింటికి బోవుచుండెను.

ప్రతి దినమూ ఆ శిష్యుడారున్నర గంటలకే వెడలపోవుచుండుట గాంచి గురువుగారాతని ఒకనాడు చేరబిల్చి యిట్లగెను. "ప్రతిదినము అరున్నరకే నీవు వెడలి పోవుటకు కారణమేమి? రాత్రి 8 గంటల వరకు నేను ప్రభోధ చేయుచున్నాను గదా! ఎన్నో ముఖ్య విషయములు ప్రతిదినమూ పోగొట్టు కొనుచున్నావే! ఎంతో యెంతో లక్షణ యుతుడవు తప్పక కృతార్ధుడవగుదవని కొంటేనే" అందుకా శిష్యుడు అయ్యా! నేనేమి చేయును? సాయంత్రము చీకటి పడకుండా ఇల్లు చేరుకోమని తల్లితండ్రులు, భార్య పట్టుబట్టుచున్నారు. నేనంటే వారి పంచప్రాణములూను చీకటిలో నేనేమై పోదునో? నాకేమైన ఆపదగల్గునేమో యని వాని భయము. వారి ప్రాణం కంటే మిన్నగా నన్ను ప్రేమించు చున్నవారి మాట కాదనలేక ఆరున్నరకే వెడలిపోవుచున్నాను అని సమాధానమిచ్చెను.అందుకా గురువు "వారి ప్రాణం కంటే మిన్నగా, నిజముగా వారు నిన్ను ప్రేమిస్తున్నారంటే నేనెంతమాత్రము నమ్మను" అని పలుకగా లేదు స్వామీ! నిజముగా వారు నన్నట్లు ప్రేమిస్తున్నారు. మీకు సందేహముంటే పరీక్షించుటకేమీ అభ్యంతరము లేదు అని శిష్యుడు పలికెను. అట్లైతే నేను చెప్పినట్లు చేస్తే నీయందు వారికెంత ప్రేమ వున్నదో వెల్లడవుతుంది. రేపు ఉదయం ఏడుగంటలకు నీవు కడుపు నొప్పితో మరణభాధ పడుచున్నట్లు 5 నిమిషములలో ప్రాణం పోవనున్నట్లు అభి నయింపుము. నేనొక మహాయోగి వేషములో వస్తాను ఆపైన జరిగే తమాష నీవే చూద్దువులే. అట్లా చేస్తావా? గురువరుడగగా చిత్తము స్వామీ! తమయాజ్ఞ కెన్నడైన

యెదురాడితినా? రేపు వుదయము అట్లనే మరణ బాధను అభినయిస్తాను. తప్పక దయచేయుడు అని శిష్యుడు పలికెను.

మరునాడు వుదయం శిష్యుడు కడుపులో శూలనొప్పితో ప్రాణం పోవుచున్నది. యింట గిజ గిజ తన్నుకొన నారబించెను. యిరుగు పొరుగు వారందరు పోగైరి. ఎందుకైన మంచిదని నాతనిని బైట వాకిట ముంగిట చాపలో పరుండ బెట్టిరి. తల్లిదండ్రులు, భార్య విలవిల తన్నుకొని గ్రుడ్లు తేలవేస్తూ మరణయాతన పడుచున్ననాతని చుట్టూ రోదన మారంబించిరి. ఒకరిద్దరు వైద్యులు వచ్చి చేతి నాడి పరీక్షించి కారణం చెప్పలేక గుటకలు మ్రింగుతూ పది నిమిషముల కంటే బ్రతకడని చెప్పి వెడలి పోయిరి.

ఇంతలో మహా మంత్ర వేత్తయగు యోగీశ్వరుని వేషంలో గురువుగారట సాక్షత్కరించి తాను మహామంత్రవేత్తనని తన మంత్రతీర్ధముతో యెటువంటి వ్యాధినైన నివారించి, పోయె ప్రాణమును కూడా అరికట్టగలనని గంభీరముగా పల్కెను.

కుర్ర వాని ప్రాణములెట్లైన రక్షింపమని అవసరమైతే తన ప్రాణములైన ధారపోయు సిద్ధముగా వున్నామని అతని తల్లిదండ్రులు, భార్య అతని పాదములపై బడి ప్రార్ధింపసాగిరి. అపుడా యోగీశ్వరుడు ఒక గ్లాసులో మంచినీరు తెప్పించి రెండు నిమిషములు మంత్రించి గంభీరముగా నిట్లు పలికెను మీముప్వురు మీప్రాణము కన్న మిన్నగా ఈ కుర్రవానిని ప్రేమించు చున్నారు గదా! యీ కుర్రవానిని రక్షించుటకొక్కటే మార్గము యీతని కొరకై మీలో యెవరైన నొకరు చనిపోవుటకు సిద్ధంగా నున్నారా? యీ మంత్ర తీర్ధము తాగిన వారి ప్రాణము సునాయాసముగా ఏబాధ పడకుండా పోవును. కుర్రవాడు చిరంజీవియై నూరు సంవత్సరములు బ్రతుకును. యిదిగో తీర్ధము త్వరగా రండి ఎవరో ఒకరు త్రాగండి అని తొందర పెట్టసాగెను. అపుడు తండ్రి అయ్యా! నేను చనిపోతే యీకుటుంబము జరిగేదెట్లు కుర్రాడు చిన్నవాడికేమీ తెలియదు యెట్లా? అనెను. తల్లి అయ్యో! కోడలు ముక్కుపచ్చలారని ముద్దరాలు ఏమీ తెలియదు? నేను పోతే యీసంసారం యెట్లా దిద్దుకోగలదు? ఎట్లా? భార్య అయ్యో! మూడునెలలైన కాపురము చేయలేదే యీ ఆనందము కోసమేగదా నేను పెండ్లి చేసుకొన్నది? అని భోరు భోరున యేడవసాగెను. యింతలో ఆ కుర్రవాని తండ్రి తొందరగా పరిగెత్తుకొని వచ్చి యోగీశ్వరుని పాదములపై

పడి అయ్యా మహాత్ములు మీరు! సర్వ సంగ పరిత్యాగులు! లోకంతో మీకు పనిలేదు మీరు చనిపోయినా మీ కొరకేడ్చే భార్య, పుత్రాదులు లేరుకదా దయయుంచి మీరే ఆమంత్ర తీర్థము త్రాగి మా కుఱ్రవానికి ప్రాణదానం చేయక తప్పదు" అని ఏడవసాగెను.

అపుడా యోగీశ్వరుడు లే నాయనా! చూచితివి గదా! నీ తల్లిదండ్రుల యెక్కయు, భార్య యెక్కయు ప్రేమ నీపై యెంత యెక్కువగా వున్నదో! యికలే వారిని నమ్మికొని నీజీవితము వృధా చేసుకోకు అని పక పక నవ్వుచూ "ఆత్మ వస్తు కామాయ సర్వం ప్రియం భవతి" అనుకొంటూ గురువుగారు వెడలిపోయిరి.

22. నూటికి నూరు పాళ్ళూ వృధా

కాలికి బూట్లు, కళ్ళకు చలువజోడు, చేతిలో ట్రాన్సిష్టరు రేడియో ధరించి గోదావరి ఆవలి ఒడ్డు చేరుటకై నవీన నాగరికుడొకడు రేవు పడవ నెక్కెను. అందు ఏబది సంవత్సరముల వయస్సుగల బాటసారి మాత్రముండెను. 60, 70 సంవత్సరములు వయస్సు గల వృద్ధనావికొకడు పడవను దరికి మెడ్డుచుండెను.

అతని నెగతాలి పట్టించుటకై యువకుడు "యేయె తాతా రాత్రి సినిమా చూచావా యెంత బాగుందో" పడవ తాత "నాజన్మలో నేనెప్పుడు సినిమాకు వెళ్ళలేదు బాబూ" యువకుడు:-సినిమా చూడని బ్రతుకెందుకూ? నీజీవితము పాతిక బాగము వృధా అయినట్లే. యువకుడు మరొక సిగరెట్టు ముట్టించి రెండు దమ్ములు లాగి మరల "యేయె తాతా డిటెక్టివె నవల చదవడం యిప్పుడే పూర్తి చేసాను యిస్తాను చదువుతావా?"

పడవతాతా:-నాకెందుకు బాబు చదువు రాని వాణ్ణి.

యువకుడు:-చదువే రాద అయితే నీజీవితంలో 50 పాళ్ళు నిరర్ధకమై పోయింది. మరోక్షణమాగి యేయె తాతా కేరమ్సు ఆటలో 20 పాయింట్లు అడ్వాన్సు యిస్తాను ఏం పందెము కాస్తవు.

పడవతాతా:-ఆ ఆటేటో నాకసలే తెలియదు.

యువకుడు:-ఐతే నీజీవితము నూటికి 75 పాళ్ళు వృధా అయిపోయినట్లే ఏమంటారు సారు అని రెండవ బాటసారి వైపు చూచి వెకిలిగా నవ్వసాగెను.

పడవ గోదావరి మధ్యలో ఉండెను. దూరమున గాలి మబ్బురివ్వున ఉప్పెనవలె

కదలి వచ్చుచుండెను. పడవ అపుడే యిటు నటూ వూగిసలాడి పోవుచుండెను. యువకుడు భయపడుచూ "ఏయె తాతా త్వరగా ఒడ్డుకు చేర్చవోయి నీకు పుణ్య ముంటుంది. బాబూ ఎట్లా చేర్చనూ? మీకు ఈత వచ్చునా? అయ్యో ఈ తరాదే యెట్లా! ఐతే మీ జీవితము నూటికి నూరుపాళ్ళు పూర్తి అయిపోయింది అన్న మాటే

2వబాటసారి:-నాయనా పోని భగవంతుని ప్రార్ధించుకోవయ్యా! ఆ పరమాత్మయైన రక్షిస్తాడు.

యువకుడు:-నేనెన్నడూ ఆపని చేయలేదు ఎట్లా చేయాలో ఏమో ఏమి తెలియదు.

బాటసారి:-ఇక ఏమీ సందేహము లేదు. వివేక విహీనమైన బ్రతుకు నూటికి నూరుపాళ్ళు వృధా దుర్లభమైన మానవ జన్మకువచ్చి భగవంతుని ప్రార్ధించడమే చేతగాదా సిగ్గు, సిగ్గు, మబ్బు అటు పోయింది లే పరవాలేదు. కాని యిపుడైన నీమానవ జన్మ వృధా చేసుకోక వివేకము తెచ్చుకొని సద్గురుని జేరి పారమార్ధిక జీవిత అలవరుచుకో అని హితోపదేశము చేసెను.

23.అప్రస్తుత ప్రసంగం

శ్లో: అనుద్వేగ కరము వాక్యము సత్యం ప్రియ హితంచుయతే

అనగా మాట్లాడు వాక్యము ఇతరుల మనస్సునకు భయబీతులు గలిగించు నదియు, అసత్యమైనదియును, కీడు గలించు నదియును అయివుండరాదని భావం. అట్లే అనవసరము అప్రస్తుతమునగు మాటలను పలుక రాదని యీక్రింది కధ ఋజువు చేయుచున్నది.

25 ఏండ్లు నిండినా అమాయకుడగు పుల్లయ్యకు వివాహ సంభందమే రానందున వానికిక పెండ్లి కాదేమోనని తండ్రియగు వెంకయ్య భయపడు చుండెను. ఇట్లుండ నదృష్ట వశాత్తు దూరగ్రామం నుండి యొక సంభందం వచ్చెను. వెంకయ్య మిగుల సంతోషించి పుల్లయ్య చెవులకు అలంకారముగా ప్రక్కయింటి వారి తమ్మెట్లు(దుద్దులు) తెప్పించి పెట్టించి పురోహితుడగు రామయ్యను జతయిచ్చి పంపెను. పెండ్లికుమార్తె తండ్రి వారికి సకల మర్యాదలు గావించి స్పురద్రూపియగు పెండ్లికుమారుని చూచి ఎంతో ఆనందముతో "యితడేనా పెండ్లికుమారుడు" అని పురోహితుని ప్రశ్నించెను. చిత్తం! పెండ్లికుమారుడీతడే గాని చెవులకున్న తుమ్మెట్లు మాత్రమతనివి కావు అని రామయ్య బదులు చెప్పెను. తనతో వియ్యమందే తాహతు వీరికి లేదని, ఏదో

సాకుతో పెండ్లి కుమార్తెనైనను చూపకుండా పెండ్లి కుమార్తె తండ్రి వారిని సాగనంపెను.

దిగాలు మొగాలుతో వచ్చిన వీరి నడిగి ఏమి జరిగినదో తెలుసుకొని వెంకయ్య పురోహితుని బాగుగా చీవాట్లు పెట్టెను. ఒక సంవత్సరము గిర్రున తిరిగిపోయెను. మరొక సంభందమురాగా జాగ్రత్తగా మాట్లాడుమని హెచ్చరించి పిల్లను చూచి రమ్మని పెండ్లి కుమారునితో రామయ్యనే వెంకయ్య తిరిగి పంపెను. పెండ్లి కుమార్తె తండ్రి యీతడేనా పెండ్లి కుమారుడు? అని ప్రశ్నించిన వెంటనే తడుము కొనకుండా రామయ్య చిత్తం చిత్తం పెండ్లి కుమారుడు ఈయనే చెవుల నున్న తమ్మెట్లు కూడా యీయనవే అని ధీరముగా పల్కెను. పెండ్లి కుమార్తె తండ్రికి వెంటనే ఆతమ్మెట్లు ఎరువు సొమ్ములు అయివుంటాయని అనుమానము గల్గి వారిని వచ్చినదారినే వెనుకకు పంపివేసెను.

రామయ్య తెలివి తక్కువకు వెంకయ్య ఎంతో బాధపడెను. ఏడాది వడ్డీతో సహా రామయ్యకు చివాట్లు బహుమతి లభించెను. చెంపలు వేసుకొని యిక నెప్పుడూ అట్టి పొరపాటు జరగనీయవని రామయ్య హామీ యిచ్చి వెంకయ్యను శాంతింప జేసెను.

మరొక రెండేండ్లు గడిచి పోయెను. పెండ్లియిడూ దాటిపోయిన మరొక కన్యా రత్నమునకు పుల్లయ్య తగిన వరుడని ఆమెతండ్రి నిర్ణయించుకొని వచ్చి పిల్లను చూచుకొండని వెంకయ్యకు వర్తమానం పంపెను.

ఈ సారి అయిన బహు జాగరూకతతో మాట్లాడునని వెంకయ్య రామయ్యను మరీ మరీ హెచ్చరించి పుల్లయ్యతో ఆడ పెండ్లి వారింటికి పంపెను. పెండ్లి కుమార్తె తండ్రి వారిరువుకు యుచిత మర్యాదలు గావించి పాత ప్రశ్ననే రామయ్యను అడిగెను. జాగ్రత్తగా మాట్లాడవలెనని జపంచేసుకుంటూ వచ్చిన రామయ్య నిధానముగా ఒక నిమిషము ఆలోచించి అయ్యా! పెండ్లి కుమారుడితడే తమ్మెట్లు సంగతి నేనేమీ చెప్పదల్చుకోలేదు అని మూతి ముడుచుకొని కూర్చుండెను. చీకటిపడుతోంది తమరు వెళ్ళిరండి తర్వాత కబురు చేస్తాను అని పెండ్లి కుమార్తె తండ్రి చెప్పేవరకు రామయ్య మాట్లాడకనే కూర్చొని యింటికి తిరిగి వచ్చి జరిగిన కథ వెంకయ్యకు చెబుతూ తానెంత జాగ్రత్తగా మాట్లాడినదీ వివరించెను. పుల్లయ్యకిక వివాహ యోగము లేదని రామయ్య ను ముమ్మారు పంపినందుకూ వెంకయ్య తన్నుతానే తిట్టుకొనెను.

అతి వాగుడుతో అబద్దాలు చాలా దొర్లుతాయి. అందుకు మౌనమే మహదౌషదం "నభ్రూయంతే సత్యమ ప్రియం" అనగా సత్యమైనప్పటికి అప్రియమెన్నడూ మాట్లాడ వద్దని శాస్త్రం చెబుతోంది. తస్మాత్తే జాగ్రత్త?

24. కర్తేతి నైయాయికాః

బారిష్టరు సుందరంగారు మద్రాసులో పేరు ప్రఖ్యాతు లార్జించిన న్యాయవాది ఆయన భార్య రుక్మిణి అన్నివిధముల భర్తకనుకూలముగనే వర్తించుచూ భర్తప్రేమాభి మానములకు పాత్రురాలై వుండెను. ఒక్క విషయంలో మాత్రం వారిరువురకు ఏకా భిప్రాయము కుదురదయ్యెను. రుక్మిణి భగవద్భక్తురాలు. వేకువనే లేచి స్నాన మాచరించి పూజదికము మంతయు ముగించుకొని పూజామందిరమునకు తాళం వేయుచుండెడిది.

సుందరము గారికి కొంతకాలం వరకు తెలియనే లేదు. చివరకామె విగ్రహారాధన చేయుచున్న సంగతి తెలిసి ఆమెతో నేనెంతో విజ్ఞాన వంతురాలు వనుకొన్నాను. ఏమిటి చాధస్తం? అసలు దేవుడెక్కడున్నాడు? దేవుడే లేనపుడు యీబొమ్మలేమిటి? యీపూజ లేమిటి? అని భార్యను ఈ శీతాకాలంలో చన్నీళ్ళు స్నానాలా! రోగమొస్తే ఏం చేస్తావు అని భార్యను మొదట్లో మృదువుగాను పిదప కఠినముగాను మందలించి వేధించుట ప్రారంభించెను. అయ్యో! యిదేమిటండీ! దేవుడే లేడంటారేమిటి ఖర్మం! దేవుడే లేక పోతే యీప్రపంచమంతా ఎవరు సృష్టించారండీ! అని రుక్మిణి భర్తను ప్రశ్నించెను. "మూల ద్రవ్యములు వాని స్వభావముచేత అనోన్యం మిశ్రమంజెంది యీజగత్తుగానూ, జీవులుగానూ పరిణమించాయి. అంతే గాని సృష్టికర్త అనేవాడు లేనేలేడు. మనదేశం లోనే యీదేవుడు వెర్రి బాగా ముదిరిపోయింది. ఈమూఢత్వం వదలి యీ చ్ఛాదస్తాలకు వెంటనే స్వస్తి చెప్పు" మని బార్యను సుందరం శాసించెను. అందుకు ఏమీ సమాదానం చెప్పలేక నిరుత్తరురాలై ఆమె మౌనం వహించెను. సాయంత్రం వచ్చేసరికి గులాబె జాములు చేసి పెట్టాలి సుమా అని చెప్పి సుందరము కోర్టుకు వెడలిపోయెను.

సుందరం వచ్చేసరికి నెయ్యి,మైదా,కోవాముద్ద,పంచదార,వెలిగించిన స్టౌవా యిత్యాదులన్నీ ఫలహారం టేబులు పైనుంచి కుర్చీవేసి యెదురుగా మంచి నీళ్ళ గ్లాసూ,కాళీ టిఫెను ప్లేటు నుంచెను. భర్త సుందరం కాళ్ళూచేతులు, ముఖము కడుక్కొని టిఫిన్ చేయుటకు వచ్చీ రుక్కూ! ఏవీ గులాబుజాములు తీసుకొనిరా! అని బార్యను కేకవేసెను. అయ్యో! చాలాసేపైదండీ! యింకా తయారు కానే లేదా? అని చిరునవ్వుతో కొంటెగా నాతని చూచుచు నిలబడెను. తయారు కాలేదంటున్నావు ఎవరికి నప్పగించావు యాపని? అబ్బే లేదండి ఎవరికి వప్పజెప్పలేదు. సర్వసామగ్రి,స్టౌవు

పాత్రలు అన్నీ మీముందు బల్లమీద పెట్టి పక్కా రెండు గంటలైంది. యింకా యెందుకు తయారు కాలేదో ఆశ్చర్యంగా వుంది అని పక పక నవ్వసాగెను. సుందరం నివ్వెరపోయి "సామగ్రి వుంటేనే అవుతాయా చేసేవాళ్ళు చేయకపోతే? అని కళ్ళెర్ర చేసెను". "కోపడకండీ యింత పెద్ద ప్రపంచమే కర్త లేకుండా సృష్టి అయితే గులాబు జాములెందుకు తయారుకావు? అనుకొన్నానండి" అని విరగపడి నవ్వసాగెను.

25. కాశీ వెళ్ళి గాడిద గ్రుడ్డు తెచ్చితివా ?

శిష్టాచార సంపత్తు గల బ్రాహ్మణ కుటుంబంలో ఏకైక కుమారుడుగా పుట్టిన పేరి శాస్త్రికి గారాబముచే చిన్నతనంలో తల్లిదండ్రులు విద్యాబుద్ధులు చెప్పించలేదు. వివాహానంతరము కూడా అతడు నిరంతర కుక్షగాని యుండిపోయెను. అతని తల్లి దండ్రులు గతించినను పూర్వాభ్యాసము చెప్పున వారింటి కరుదెంచు అతిది అభ్యాగతు లకు మాత్రం పేరిశాస్త్రి యధాప్రకారము గౌరవ మర్యాదలు జరుపు చుండెను.

ఒక దిన మాతని యింట ఆతిధ్య మారగించిన పండితులు ప్రసంగ వశమున శతశ్లోకన పండితః అని పలుకులు విని దాని యర్ధ మడిగి తెలుసుకొన్న పేరిశాస్త్రికి ఎటులైన పేరిశాస్త్రి కూడా పండితుడు కావలెనని తీవ్రాపేక్ష జనించెను. నొక సుముహుర్తమున బైలుదేరి అతడు కాశి చేరి ఒక పండితుని యాశ్రయించి తనకు నూరు శ్లోకములను చెప్పి పండితుని చేయవలసిందిగా ప్రార్ధించెను. అది విని ఆతని అమాయకతకు నవ్వుకొని పదిశ్లోకములతోనే పండితుని గావింతునని ప్రతిజ్ఞ గావించి ఆ పండితుడు పేరిశాస్త్రికా పది శ్లోకములు పదినెలలు కష్టించి చెప్పి పంపివేసెను.

పేరిశాస్త్రి అరణ్య మార్గమున గృహోన్ముకుడై వచ్చుచూ దారిలో చచ్చి పడి వున్న గార్ధభకళేబరమును గాంచెను. వెంటనే అనాధప్రేత సంస్కారాతె కోటియజ్ఞ ఫలంచేతె అని జ్ఞాపకము రాగా దానికి దహనక్రియ జరిపించుటకు సమీపంలో అగ్ని లభించ నందున సర్వావయానాం శిరస్సోప్రదానః కనుక దాని శిరస్సుకు సంస్కారం చేస్తే చాలునని సరిపెట్టుకొని శిరస్సు ఖండించి మోసుకొని రాదొడంగెను కాని యిక దానిని మోయలేక "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" యింద్రియములలో నేత్రము అందునూ దక్షిణ నేత్రము శ్రేష్టము గదాయని గాడిద కుడి కంటి గ్రుడ్డును పెకలించి కొంగున మూటకట్టుకొని రాత్రి యగుసరికి సమీప పట్టణమునకు చేరి అందు విశ్రాంతి గైకొనెను.

మరునాడా నగరమును పాలించు రాజుగారి జన్మదినోత్సవం సందర్భమున

పండిత సత్కారము గావింపబడునని తెలుసుకొని తను గూడా పండితుడే గదా! తానెందుకు తగు సత్కారము పొందకూడదు! అని పేరిశాస్త్రి రాజదర్బారునకేదెంచెను. రాజు నాశ్వీరదించి అందరూ తగు కానుక లర్పించి తిరిగి రాజుగారిచే తగురీతి సత్కరింప బడుచుండిరి. పేరిశాస్త్రి వంతు వచ్చెను. కాశీ నుంచి అప్పుడే తిరిగి వచ్చు నాబ్రహ్మణికి గొప్ప సత్కారము జరుగునని సభవారందరూ నిరీక్షించు చుండిరి. దీర్ఘాయుష్మాన్భవ! అని రాజు నాశ్వీర్వ దించి పేరిశాస్త్రి ఏమి కానుక నీయవలెనో తెలియక అంజలి గటించిన రాజుగారి చేతులలో కొంగున కట్టి తెచ్చిన గాడిద గ్రుడ్డును జారవిడచెను. అది చూచి రాజుగారు ఛీత్కరము చేయుచూ దానిని నేలకేసి కొట్టెను. సభవారందరూ నిశ్చేష్టితులైరి. మంత్రి పేరిశాస్త్రి నడిగి సమాచారమంతయూ తెలిసికొని "కాశిపోయి గాడిదగ్రుడ్డు తెచ్చితివా? అని తూలనాడి పేరిశాస్త్రిని సభాస్థలి నుండి నెట్టించి వేసెను.

అట్లే ఈ శ్లోక శ్లోకార్ధములను వల్లె వేసినంత మాత్రమున ప్రయోజనమేమియు నుండదు. వస్తు నిశ్చయముగా గురుముఖతః భోధ నేర్చిన వారికే గాని ఇంగిత జ్ఞానం కలుగనేరదు అట్టి జ్ఞానము లేనిచో పేరిశాస్త్రి వలెనే అపహాస్యము పాలగుట తప్పదు.

26. చంచల లక్ష్మీ

శిష్టాచార సంపత్తి గల విష్ణుభట్టను బ్రాహ్మణుడు సిరిసంపదలతో తులతూగు చుండెను. నాడు మహాశివరాత్రి బార్య బిడ్డలందరూ కలిసి వేకువ జామున లేచి స్నానార్ధము నదికి పోయి జన రద్దీలో జరుగు దొంగతనములకు వెరచి తాను సువర్ణ బూషణములను జాగ్రత్తగా యింటిలోనే భద్రపరచి వెడలిరి. అంతకు పూర్వమే స్నానాదులు ముగించి గృహ మద్య ముందున్న మండువా అంచున కూర్చొని విష్ణుభట్టు సంధ్యావందనము చేసుకొను చుండెను.

ఇంతలో గురగుర శబ్దముతో మండువా లోపలి భాగము నందొక మహాబిల మేర్పడెను. యింటిలోని పెట్టెలు,బట్టలు,పాత్ర సామానులు సర్వము దొర్లుకుంటూ వచ్చి ఆ మహాబిళములో వాయువేగమున ప్రవేశించి అదృశ్యమగు చుండెను. విష్ణుభట్టు నిర్వీర్యుడై గ్రుడ్లప్పజెప్పి జూచూ చుండెను. యింతలో తన ముందున్న వెండి పంచపాత్ర వుద్దెరిణి దొర్లి బిలములో ప్రవేశించెను. అరివాణము కూడా బోవునేమోయని విష్ణు దాని అంచు పట్టుకొనెను. కాని చేతిలోని భాగము చేతొలోనే విరిగిపోయి అరివాణము

మిగతాభాగము దొర్లుకొంటూ పోయి బిలములో పడిపోయిన వెంటనే తిరిగి గురగుర శబ్దము చేయుచూ బిలము మూసుకొని పోయెను.

నాడింట వారికి శివరాత్రియే అలుపోయి బాలవృద్ధులందర్కీ వుపవాస ఫలితము,జాగరణ ఫలితము దక్కెను. మరునాడిక గత్యంతరము లేక విఘ్ణభట్టు బిక్షాటనకై వెడలెను. గ్రామస్తులందరూ ఆశ్చర్య చకితులై ఆతని లక్ష్మి ఎట్లు తొలిగి పోయినదో తెలుసుకొని సానుభూతి ప్రకటించుచుండిరి. ఆతని వృత్తాంతమును నమ్మని వారికి విఘ్ణభట్టు తన చేతిలో మిగిలిపోయయిన వెండి ఆరివాణపు ముక్కను చూపుచుండెను. కొన్ని దినములకు కృష్ణాపుష్కర మరుదెంచెను. నాలుగు రాళ్ళు సంపాదించుకొన వచ్చునని బ్రహ్మణపురోహితులు తీర్ధస్తమగు పుణ్యక్షేత్రముల కెరుదెంచు చుండిరి. విఘ్ణభట్టు విజయవాడ చేరెను. ధనికుడైన యెక షావుకారు విఘ్ణభట్టును సద్బ్రాహ్మణునిగా గుర్తించి తన యింటి కాహ్వానించి బసనిచ్చెను. వంట చేసుకొనుటకు పాత్ర సామగ్రి మొదలగు సర్వ సౌకర్యములు కలుగ చేయుచూ విఘ్ణభట్టు అనుష్ఠానదికము నిర్వర్తించుటకు పీఠ అరివాణము, పంచపాత్ర,ఉద్ధరణి మొదలగునవి యన్నియు కూడా నిచ్చెను.

అరివాణము చూడగానే పూర్వస్మృతులన్నియు విఘ్ణభట్టు మనో వీధిని తళుక్కు మని మెరసెను. ఏమీ సందేహం లేదు అదే అరివాణం. అంత ముక్కయే విరిగిపోయి వుండెను. పరీశీలించగా తన విలాసములే దానిపై గాన నయ్యెను. తన కిచ్చిన వుద్ధరిణి, పంచపాత్ర, వంట పాత్రలు అన్నిటిపై తన విలాసములే. విఘ్ణభట్టు ఆశ్చర్యము ను బట్టలేక షావుకారు కడకేగి ఆవిలాసము లెవరివని ప్రశ్నించెను.

గత శివరాత్రి నాటి ఉదయం 7 గంటలకు తన యింట ఒక మహాబిళ మేర్పడి అంటుండే ఆసామానులన్నియు వరుసగా చిచ్చుబుడ్డి నుంచి పైకి వెగసిన రీతిగా తన హాలులో ఎట్లు వచ్చిపడినదిన్ని చివరకి అంచు విరిగిన అరివాణము వచ్చిపడునట్లూన్నూ షావుకారు విశదీకరించెను. విఘ్ణభట్టు వెంటనే తన సంచిలో నున్న అరివాణపు ముక్కను తీసి షాహుకారికి చూపి ఆ అరివాణపు ముక్క అవునోకాదో అని పరీక్షించుటకు దగ్గరగా చేర్చగా రెండూనూ ఆనవాలు కూడా లేకుండా అతుక్కొని పోయెను.

షావుకారు తనకు శివరాత్రి నాడావిధముగా లభ్యమైనదంతయు విఘ్ణభట్టుకు తిరిగి దాన పూర్వముగా నిచ్చివేయుటకు సిద్ధపడెను. కాని పరిగ్రహించుటకు విఘ్ణభట్టు

నిరాకరించి యిట్లనెను. లక్ష్మీ చంచల నావద్ద నుండుటకు నిరాకరించి లేచివచ్చి నీపంచ చేరినది. నీకడనే యుంచుకొమ్మనెను. అందుకా షాహుకారు స్వామీ! లక్ష్మీ కటాక్షము మరల నీపై నేడు ప్రసరించినది కాదనకు మని ఆచరాస్తి అంతయు విష్ణుభట్టు నింటికి బండ్లపై తొలించి వేసెను.

27. తన పాపం ఇతరులననుభవింతురా?

పూర్వకాలమున ఒక బ్రాహ్మణస్త్రీ మట్టి, పేడ కలిపిన ముద్దలను (వుండలను) ప్రక్కన బెట్టుకొని ఇల్లు అలుకు కొనుచుండెను. ఆసమయమున బిచ్చ గాడొకడు ముంగిట నిలిచి అమ్మా బిచ్చం, అమ్మా బిచ్చమని కేకలు వేయుచుండెను. ఆబ్రహ్మణ స్త్రీకి కోపము చిరాకు గల్గి మట్టి పేడ కలిపిన ఒక వుండ చేతపట్టి తీసుకొని వచ్చి బిచ్చగాని జోలిలో తటాలున బడవైచెను. ఎంత పని చేసితివమ్మా! నీవు పిడికెడు బియ్యమైనను వేయలేదు సరికదా ఎక్కడో అడుక్కుతెచ్చుకున్న బియ్యము గూడా పాడొనర్చితివే అని దుఃఖ పడుచు బిచ్చగాడు వెడలిపోయెను.

ఆబ్రహ్మణ స్త్రీ మరణించి నరకలోకంలో యమధర్మరాజు కట్టెదుట చేతులు కట్టుకొని నిలువగా చిత్రగుప్తుడు ఆమె జీవితంలో నొనర్చిన పాపపుణ్యముల జాబితా చదివి వినిపించెను. ఆమె అన్ని పుణ్యములే చేసుకొనెను యితర పాపమేమి ఆమే చేయలేదు.

మట్టి పేడ కలిసి చేసిన వుండను బిచ్చగాని జోలిలో వేసిన నేరము విని నీవు చేసిన ఈమహాదానమునకు ఫలముగా నీవు అనుభవించుట దానము కోటి గుణితమై నీకొరకు యెదురు చూచుచున్నది రమ్మా అని మట్టి ,పేడా కలిపి చేసిప్రోగుగా పెట్టిన కోటి వుండల మహారాశిని చూపుచు నీవీ వుండలన్నిటిని భక్షించుటయే నీకు తగిన శిక్ష కనుక యిప్పుడే తినుట ప్రారంభించు మనియు యమధర్మరాజని వేగిర పెట్టసాగెను.

అంత నాబ్రహ్మణ స్త్రీ గొల్లుగొల్లున యేడ్చుచూ ప్రొద్దుటి నుంచి పని చేసుకొని చేసుకొని బండ పని చేయుచూ ఎంతో విసుగుతో వున్న నాకు బిచ్చగాడు కేకపై కేకవేస్తూ కోపము తెప్పిచ్చి నందున ఆకోపములో వళ్ళు తెలియక ఆమహాపాపమును చేసితిని. ఒళ్ళు తెలియని స్థితిలో చేసిన పాపమునకింతటి ఘోరశిక్ష విధింతురా? ఐననూ చేసిన పనికి మనసారా పశ్చాతాపము చెందు చున్నాను. నేను మరియే పాపము చేయని పవిత్రురాలనే కదా! నాకు కొంత గడువిచ్చి మరల భూలోకమునకు పంపితిరే

అని యీపాపము నుండి విముక్తురాలను కాగలను. దయవుంచి మరి మూడు సంవత్సరముల పాటు నా ఆయువును పెంచి పంపుడని ఎంతో దీనురాలై ఆమె యమధర్మరాజును ప్రార్థింపసాగెను. శిక్ష విధించుటలో దయాదాక్షణ్యములు లేని కఠిన హృదయుడైన యమధర్మరాజు యీమె యీమహాపాప పరిహారమెట్లు చేసుకొనునో చూతమని ఆమె కోరికను మన్నించి ఆమెను భూలోకమునకు మరల పంపివేసెను.

ఆబ్రహ్మణ స్త్రీ భూలోకమునకు తిరిగి వచ్చి పుణ్య తీర్థముల కడ మహాత్ము లుందురు కదా! వారెవరైన యీపాప పరిహారమునకు మార్గమేమైన సూచింపగలరేమో యని పుణ్యతీర్థము లెల్ల గాలించుచూ కనపడిన తపశ్శాలలు కందర్కి తానే పాపము చేసెనో చెప్పి దానికి ప్రాయశ్చిత్తమేమైన నున్నదేమోయని విచారింపసాగెను. యిట్టి మహాపాపమునకెట్టి నిష్కృతియున్నట్లు మేమే గ్రంథముననను చూడలేదనియే అందరును చెప్పుచుండిరి. రెండు సంవత్సరములు విట్టే తిరిగి పోయెను. ఒక చోట నొక మహాత్ము డామెకు యిట్లు చెప్పసాగెను చేసిన పాప ఫలము అనుభవించకనే యెట్లు పోవును? నీవో లేక నీ తరుపున మరొకరో ఆఫలమనుభవించవలసినదే దీనికొక్కటే యుపాయము కలదు. నీవు స్ఫురద్రూపివి ముప్పదియేండ్ల మంచి వయస్సులో నున్నావు. నీభర్తను యెట్లో ఒప్పించి నీవొక కామోద్రేకము కల్గిన విలాసినీ వేషము ధరించి జనసంకీర్ణమగు బజారులలో తక్కుచూ తారుచూ పురుషులను చూచి చిరునవ్వు లొలికిస్తూ తిరుగు చుండ వలెను. నీయందే కించిత్తూ కూడా దోష సంకల్ప ముండరాదు. నిన్ను చూచిన వారందరూ నీవొక పరమ వ్యభిచారివని భావించునట్లు నటించవలెను. అట్లా భావించిన వారందరూ నీ పాప ఫలమును పంచుకొన గలరు అని ఆమెకు సలహా విచ్చెను.

ఆమె ప్రతివ్రతయయ్యుసు. గత్యంతరము లేక యామహాత్ముడు చెప్పినట్లు సంచరింపసాగెను. యిక మరునాటితో ఆమెకు పొడిగించిన ఆయువు కూడా సమాప్తి కానుండెను. ఆరోజు సాయంత్రమామె యధాప్రకారము వేషము ధరించి బజారునకు పోవుటకై యిల్లు వెడలెను. ఆమెను ఆవీధిలోనే ఒక హరిజన వృద్ధదంపతులు యెదురైరి అది బ్రహ్మణ వీది ఆమెను బ్రహ్మణ స్త్రీ గా గుర్తించి భయ భక్తితో విశేషంతో ఆ హరిజన స్త్రీ యెడముగా తొలగుట ఆమే భర్త యేమీ యీ వ్యభిచార ముండకు ఆచారము కూడానా! ఛీ!ఛీ! చాలు చాలు దీనికే గౌరవము చూపించ నక్కరలేదు అని

భార్యను మందలింపసాగెను. అపుడా హరిజన స్త్రీ అయ్యో,అయ్యో ఆమె నట్లనుట ఎంత పాపమండీ కోటి పేడ వుండలలో యిప్పటికి మిగిలి వున్న ఆఖరి పేడ వుండ మీపాల బడినది. అది మీరు భక్షింపవలసినదే ఆమె పాపములమంతయు మీవంటి వారు పంచుకొనుట సంపూర్తి అయినది. ఆమె యీవేషంతో తన పాప పంకిలమును సంపూర్ణముగా ప్రక్షాళయొనర్చు కొన్నది లేండి అని చెప్పివేసెను.

ఇది కేవలం కథయే పూర్వ గ్రంధాలలో నుండినదే కావచ్చును. కాని ఆ బ్రాహ్మణ స్త్రీ పాపము ఇతరులు పంచుకొన్నారనుట సబబుగా లేదు. ఏల ననగా ఆమె వేష భాషలచే బుద్ధిపూర్వకముగా యితరులకు దురభిప్రాయములు కలిగించినది కదా! దాని వలన మరొక పాపఫలమంట వలెను గాని పూర్వ పాపము తొలిగిపోవునా? అసలు ప్రాయశ్చిత్తముల వలన పాపము పోవుననే మాట నిజమైన కాకున్న నిజమని అంగీకరించుట వలన అనర్ధమెకటి గోచరించు చున్నది. అవసరానుసారము పాపము చేసినా పరవాలేదు. దానికి ప్రాయశ్చిత్తము చేసుకొంటే సరిపోతుందనే భావనకూ తద్వారా దర్మనాశనమునకూ దారి తీస్తుంది. మొదట్లో పాపం చేసి తర్వాత పుణ్యము చేస్తే పాప ఫలమును, పుణ్య ఫలము తుడిచి వేస్తుంది. మొదట్లో పుణ్యము చేసి తర్వాత పాపం చేస్తే మాత్రము పుణ్య ఫలములు దేనికది అనుభవించ వలసినదే అనే వాదన ఒకటున్నది. యిదియును సరికాదు. ఏలనంటే తర్వాత పుణ్యము చేసి పాప నాశనం గావించు కోవచ్చుననే భావనికిది దారితీస్తుంది. ఉదా:-ఎవరి నెట్లా మోసగించి ధనార్జన చేసిన పరవాలేదు అందులో కొంత భాగము దాన ధర్మాల క్రింద ఖర్చు చేస్తే ఆపాపం పోతుంది అనే ధీమా కలుగుతుంది. కనుక మానవులను ధర్మాచరణకు పురిగొల్పునది. తాను అధర్మ ప్రవృత్తి నుండి మరలించునదిగాను ధర్మసూత్ర ముండవలనే గాని అధర్మాచరణ కెంత మాత్రము సందీయరాదు. కనుక పుణ్య పాప ఫలములు దేనికదే వేర్వే వేరుగా అనుభవించి తీరవలసినదే గాని పాపమును పుణ్యం పరిహరింపదు అనుటయే సిద్ధాంతము. అందుకే పెద్దలు ఆవశ్యమను భోక్తవ్యం పూర్వకర్మ శుభా శుభం అన్నారు.

28. వ్యవహారిక ధర్మం

సత్యమును సత్యముగా ఋజువు చేయుట అన్నప్పుడు సాధ్యము కాదు. అట్టి పరిస్థితులలో అసత్యమును అసత్యముగా నిరూపించుటకు అసత్యమునే ఆశ్రయించుట లౌకికమగు వ్యవహారిక ధర్మము. వజ్రమును వజ్రము చేతనే ఖండించ నగును. ఒక ముల్లును పెకలించుటకు ముల్లు వంటి వస్తువునే వుపయోగించ నగును. ఇందుకు దృష్టాంతముగా యీ క్రింది కథ వంటి కథలు కొన్ని యున్నవి.

ఒక గ్రామములో రామన్న, వెంకన్న అని ఇరువురు షడ్రకులు (తోడి అల్లుళ్ళు) వుండిరి. రామన్న సీసపు వ్యాపారము చేసేవాడు. గ్రామమంతయు పోవుచూ తనవద్ద గల సీసపు ముద్దను జాగ్రత్త చేసి తాను తిరిగి వచ్చిన పిదప యిచ్చి వేయుమని వెంకన్నకు వప్పగించి పోయెను. కొంతకాలమునకు రామన్న తిరిగి వచ్చి సీసపు ముద్ద నాకీయవలసిందిగా వెంకన్నను కోరెను. అందుకు వెంకన్న అయ్యో! అన్నయ్యా! సీసపు ముద్దను మూషికములు తిని వేసెను. ఏమి చేతును? అని కపట దుఃఖము వెళ్ళబోసికొనెను. గడుసరియగు రామన్న "పోనిలే తమ్ముడూ ఏం చేస్తావు? బాధపడకు నావద్ద నుండగా యెలుకలు తినివేస్తే యేం చేస్తాను? అని వెడలిపోయెను.

కొంత కాలమునకు వెంకన్న గ్రామంతరము పోవలసి వచ్చెను. రామన్న భార్య సిద్దక్కను ఆమె అప్పగారింట దిగబెట్టి గ్రామంతరం వెళ్ళి వస్తానని అంతవరకు యింట నుంచుకోవలసినదని రామన్నను బ్రతిమాలుకొని వెంకన్న గ్రామాంతరము పోయి ఆరునెలలకు తిరిగి వచ్చి భార్యను పంపివేయవలసినదిగా రామన్నను కోరెను. రామన్న అందుకు చిరునవ్వు నవ్వుచూ ఎగతాళిగా "అయ్యో తమ్ముడూ! ఏమి చేతును? సిద్దక్కను నిన్ననే గ్రద్ద మింగివేసినది" అని బదులు చెప్పెను. ఎక్కడైనా మనిషిని గ్రద్ద మ్రింగి వేయగలదా? వేళాకోళమును ఆపి సిద్దక్కను పంపి వేయుమని వెంకన్న పలుకగా అట్లా అంటావేమి తమ్ముడూ? మూషికములు సీసమును మ్రింగి వేయగా లేనిది సిద్దక్కను గ్రద్ద మ్రింగుటలో ఆశ్చర్యమేమున్నది అని రామన్న వాదించ దొడగెను. సిద్దక్క కొరకు వెంకన్న, సీసము కొరకు రామన్న తగువులాడు చుండగా పొరుగు వాళ్ళు వినోదముగా వినుచుండిరి. చివరికి వారి తగువు కొట్లాటగా పరిణమించగా చూచి అడ్డువెళ్ళి యిక బాల కవి వచ్చీరాని సంస్కృత జ్ఞానంతో వెంటనే ఒక శ్లోకమల్లి యీవిధంగా అందరూ వినుచుండగా గానము చేసెను.

శ్లో॥ సీసకము మూషికంఛైవ సిద్దక్కంగదయేమేవచ

షడ్డకో షడ్డకోశ్చైవ ముష్టియుద్ధః పునఃపునః

అపుడు పెద్ద మనుఘలు వారిరువురును మందలించి సీసపు ముద్దను రామన్నకు, సిద్దక్కను వెంకన్నకు యిప్పించి ఎవరిండ్లకు వారిని పంపివేసిరి.

29. నారు పోసినవాడు నీరు పోయడా

ఒక వూరి బయటనున్న దేవాలయ మంటపంలో పదహారేండ్ల బ్రాహ్మణ బ్రహ్మచారి యెకడు నివాసమేర్పరుచుకొని యుంటూ యుండేవాడు. కాలమంతయు భగవన్నామ సంకీర్తన గావించు కొనుచూ మధూకర వృత్తి భూని యెంతో లక్షణ యితముగా జీవితము సాగించు చుండెను. యెకనాడతడు యధాప్రకారము ఇంటి ముందాగి "భవతి బిక్షాందేహి" యని యాచించెను. నవయవ్వనవతి యగు ఆ ఇంటి ఇల్లాలు పెరటిలో అభ్యంగన స్నానమాచరించి చిన్న బట్ట చుట్ట బెట్టుకొని యింటిలోనికి వస్తూ బ్రహ్మచారి కేక విని అదివరకే సిద్దపరచి యుంచిన అన్నాదికమున్న పళ్ళెముతో వేగముగ వచ్చి వీధి తలుపు తెరిచెను. కుడిచేత పళ్ళెమున్నందున యెడమ చేత తలుపు గడియ తీయుటలో పమిట సాంతముగా తొలిగి పోయెను.

బ్రహ్మచారి యామె వక్షోజములు జూచి ఏమమ్మా ఛాతిమీద ఆకంతులేవమ్మా? యని పసిబాలుని వలె ప్రశ్నించెను. ఆయువతి పమిట సర్దుకొని అతని అమాయకతకు ఆశ్చర్య పడుచూ "బాబూ నాకు పుట్టబోయే పిల్లలకు దేవుడు పాలను దాచి వుంచిన పాలబుడ్లు నాయనా ఇవి అని లోనికేగెను. అమాటలను విన్న బ్రహ్మచారి మనసులో ఒక భావమంకురించి తీగె తొడుగు కొనసాగెను. ఏమీ పుట్టబోయె పిల్లల పోషణకై దేవుడు పాలను ముందే దాచి యుంచాడా? పుట్టి వున్న నా కాహారము పెట్టుట కాతడు జాగ్రత్తపడడా? అని యోచించుచూ గిరిక్కున వెనుతిరిగి దేవాలయమున కేగి తెచ్చుకొన్న ఆహారము తిని తృప్తి పడెను. నారు పోసిన వాడు నీరు పోయడా!

రెండు రోజులు గడిచిన బ్రహ్మచారి అగ్రహారము లోనికి మధూకరమునకై పోలేదు. మూడవరోజున యెక ముసలమ్మ నాయనా! రెండురోజుల నుంచి ఊరిలోనికి వచ్చుట లేదేమి? అయ్యో ఫస్తులుంటున్నావా? అతడేమియు మారు పల్కు నందున యింటికేగి అన్నము తెచ్చి అతనికి బెట్టెను.

ఇక అగ్రహారంలోని అమ్మలక్కలతో గుసగుసలు ప్రారంభమయ్యెను. అత్తమామ లా, ఆడపడుచులా భర్త గ్రామంలో లేడు. బ్రహ్మచారిని ఏమన్నదో! అతని కసహ్యమేసి గ్రామములోనికి రావటము మాని వేసినాడు అంటూ దవడలు నొక్కు కున్నారు. క్రమేపి ఈసమాచారము పురుషులలోనికి వ్యాపించి చివరికి ఆయువతి భర్త చెవిన సోకెను. అగ్రహారికులతో కూడి బ్రహ్మచారిని తోడ్కొని యువతి కడకు తీసుకొని వచ్చెను. నేరము ముఖాముఖిన రుజువుచేసి ఆమెను బయటకు నెట్టి వేయవలెను. ఇదీ అతని సంకల్పము.

యువతిని బయటకు పిలిచిరి. చూచి చూడడంతోనే బ్రహ్మచారి ఆమె పాదము లపై వాలి తల్లీ! నీవు పరాశక్తివమ్మా! నాకు జ్ఞానోదయము కలిగించి భగవంతుని యందు పూర్ణ విశ్వాశము చేకూర్చితివమ్మా! అని పడి పడి సాష్టాంగ నమస్కారములాచరింప సాగెను. అగ్రహారికులు విస్మయముతో జరిగిన యుదంత మంతయు తెలుసుకొని అసత్య నేరారోపణ గావించి నందుకు ప్రాయశ్చితమేమాయని ధర్మ శాస్త్రములు తిరిగి వేయజొచ్చిరి.

30. శెట్టిగారి పరీక్ష

లక్షాధికారియగు రామయ్యశెట్టి శతవృద్ధుడై మంచము పట్టి మరణమునకై యెదురు చూచు చుండెను. దమ్మిడీలేని దరిద్ర స్థితిలో జీవితం ప్రారంబించిన శెట్టి పట్టిన దెల్లా బంగారమై సిరిసంపదలతో తులతూగుచూ పది లక్షల నిలువ చేయుటయే గాక 50 ఎకరముల మాగాణియు సంపాదింప గల్గెను. అతనికి ముగ్గురు కుమారులు, మనుమలు, మునిమనుమలతో ఇల్లు కళకళలాడు చుండెను. వయస్సు మళ్ళిన దయ్యును. అతని భార్య వినయ విధేయతలతో నాతనికి సమస్థోపచారములు చేయు చుండెను. జీవితమందు నిజముగా గోరదగిన దేదియు లేనప్పటికి అతనికి సర్వప్రాణులకు సహజమైన దుఃఖ కారణమెకటి అంతఃకరణను పట్టి వేదించు చుండెను.

ఏమనగా ఆతని కుమారులు ఖర్చు పెట్టుటయే కాని కూడపెట్టుటేరుగరు. తాను గతించిన పిదప తన సంపదను ఎంతో కాలము నిలవ నీయరేమోయని అతని మనోవేదన. యింటికి పెత్తనము యెవరికిచ్చిన బాగుండునో పరీక్షించగోరి ముగ్గురు కుమారులను చేరబిలిచి వారికి ఐదేసి రూపాయల నిచ్చి సమాన ఘన పరిమాణము గల్గిన మూడు గదులను ఒక్కొక్కరికి కేటాయించి వారితో నిట్లనెను. "మీరిచ్చిన

సొమ్మును వినియోగించి, మీకు కేటాయించిన గదులను ఏ వస్తువుతో నైన నింపుడు నాకభ్యంతరము లేదు. కాని మీలో ఎవరు తక్కువ సొమ్ము అందు నిమిత్తము వెచ్చించునో వానికే తాళం చెవులిచ్చి వానినే గృహ యజమానిని గావింతును. మీకు ఇందు నిమిత్తము ఒక దినమే గడువు. కాని మీరు మీబుద్ధి నుపయోగించి స్వయంగా నిర్ణయించుకొనవలెనే గాని ఎవరి సలహాను తీసుకొనరాదు అని శాసించి పంపివేసెను.

మరునాడు ముచ్చురును శెట్టి తిరిగి రప్పించి ఎవడే వస్తువు ఖరీదు చేసెనో ఎంత వెచ్చించెనో వినగోరగా పెద్ద కొడుకు తాము ఐదు రూపాయలూ వెచ్చించి వరి గడ్డికొని దానితో గదిని నింపితినని చెప్పెను. 2వవాడు ఒక్క రూప్యము మాత్రము వెచ్చించి గడ్డికొని కొంచెం కొంచెంగా దానిని కాల్చి ఆగడ్డి పొగతో గదిని నింపితిననెను. మూడవవాడు ఒక అణా మాత్రమే ఖర్చు పెట్టితిననియు కాని ఇంకా గది నింపలేదని తండ్రి వస్తే ఏవస్తువుతో దానిని నిండించునని స్వయముగా చూడ వచ్చుననీ చెప్పెను. తండ్రిని ఆగదిలోనికి తీసుకొని పోయి అందు జాగ్రత్త పెట్టి ఆముదపు ప్రముదలోని వత్తిని అగ్గిపుల్ల వేసి ముట్టించెను. గదియంతయు ఆదీప ప్రకాశముతో నిండిపోయెను. రామయ్యశెట్టి ముఖము గూడా గదితో బాటు కలకలలాడ సాగెను.

రామయ్యశెట్టి పెద్దవానిని పిలిచి ఓరీ! నీవేమియు మిగల్చక యెంత వుంటే అంత ఖర్చు పెట్టే రకము నీవు పెత్తనము వహిస్తే అంతయు హారతి కాగలదు అని చెప్పివైచెను. రెండవ వానితో ఓరీ! నీవు ఆదా చేయగలవే కాని నీఖర్చు ఎవర్కి సంతోషము కలిగించదు. మరిన్ని దుఃఖము మాత్రమే చేకూర్చును. ఏలననగా గదిగోడలన్నీ మసి అయిపోయినవి చూరు లంటుకొని పోయే ప్రమాదము తప్పిపోయినది. చీవాట్లు పెట్టి నీకున్న ఈఇంటి పెత్తనము మీయరాదు అని చెప్పి పం...ను. మూడవ వాసిని ముద్దుగా చేరబిలిచి నీవు విశేషముగా కూడ బెట్టుటయే గాక నీవు చేసే ఖర్చు వలన అందరికి సంతోషమే చేకూర్చ గలవు. అని తక్షణము మొలనున్న తాళము చేతులను అతని పరము చేసి ఒంటరిగా నాతని తన గదిలోనికి తీసుకొని పోయి నాయనా! నీ పొదుపరి తనమునకు బుద్ధి కుశలతకునూ మెచ్చితిని. నీవు సూక్ష్మాతి సూక్ష్మమగు ఆత్మతత్వమును వస్తు ముద్రహితమగు పరిపూర్ణ పరబ్రహ్మమును తెలుసుకొన గల ధీమంతుడవు. కనుక సద్గురువు నాశ్రయించి ఎవరును ఏప్రయత్నము చేయనక్కరలేకనే ఎప్పటికిని సర్వత్రా శాశ్వతముగా నిండి

వున్నదేదో దానియందు తేజోంధాకార రూపంగా వచ్చిపోయే వస్తువేదో గురుముఖతః వస్తు నిశ్చయముగా తెలుసుకొని ధన్యుడవగుదుమని ఆశీర్వదించి పంపివేసెను.

31. అరవై యేళ్ళు వచ్చిన తర్వాత చదువుకోకమన్ను కొట్టుకోనా?

పూర్వమొకప్పుడొక అరవై యేళ్ళు నిండిన వృద్ధ బ్రాహ్మణ పంతుడొకడింటి అరుగుమీద చుట్ట కాల్చు కొనుచూ కూర్చుండెను. దారిన పోయె రైతొకడు తలపాగలో దాచిన కాగితమును తీసి ఆ బ్రహ్మణునిని వద్దకు వచ్చి ఆ కాగితముపై వ్రాయబడిన చిరునామదారుని యిల్లెక్కడో చెప్పుడని కోరెను. బ్రాహ్మణుడు సిగ్గుతో తలవంచుకొని నాకు చదువురాదు మరొకరికి చూపించు మని చెప్పివైచెను. రైతు యిదేమిటండి బ్రాహ్మణులకు చదువు రాక పోవటమేమిటండీ? ఇపుడైన చదువుకుంటే మీకూ నిమిషములో వచ్చేస్తుంది అని పల్కెను. అందుకా బ్రాహ్మణుడు ఆ వచ్చి చస్తుందీ? అరవై ఏళ్ళు వచ్చిన తర్వాత చదువుకోక మన్ను కొట్టుకోనా! అన్నట్లుంది నీవు చెప్పిన మాట అనెను. అందుకా రైతు ఏమో బాబు? ఆసామెతేంటో నాకేం అర్ధము కాదు చదువుకోటానికి మన్ను కొట్టు కోటానికి సంబంధమేటి బాబూ! అంటూ తన దారిన పోయెను. ఇంతలో పొరుగూరి పురాణాము శాస్త్రుల్లు గారా దారిని పోతుండగా చేతిలో చుట్ట పారేసి "శాస్త్రుల్లుగారూ! రండి రండి ఒక మనవి! అంటూ ఆబ్రాహ్మణుడు శాస్త్రుల్లుగారిని పిలిచి చాప మీద కూర్చో బెట్టెను. ఏమండి శాస్త్రుల్లు గారు ఒక సందేహము? అరవై ఏళ్ళు వచ్చాక చదువుకోక మన్ను కొట్టుకోనా? అనే సామెత కర్ధమేమిటో సెలవీయండి నా మట్టి బుర్రకేమి తోచలేదు" అని వినయంగా ప్రశ్నించెను. పురాణం శాస్త్రులు గారిదేమి బుర్రోగాని ఆయనకు ఏమి తోచక లేని చిరునవ్వు తెచ్చి పెట్టుకొని రొంటినున్న పొడుం బుర్ర దీసి రెండు ముక్కులకు నాసికా చూర్ణమును పక్షపాతం లేకుండా ప్రసాదించి చెయ్యి దులుపుకొని ముక్కు తుడుచుకొని చూడండి పంతులు గారు అక్షరాలు దిద్దించడానికి కుర్రాడి ముందు యింత మట్టితో గూడిన ఇసుక పరిచి బడిపంతులు అందు ఓనమాలు వ్రాసి కుర్రవాని వ్రేలు పట్టుకొని ఒకటి రెండుసార్లు అక్షరాలు దిద్దించి ఇక అక్షరాలు వచ్చేవరకు ఆఅక్షరాలు దిద్దుకొమ్మనేవారు. ఆ అక్షరాల మీద మనస్సు పెట్టి దిద్దిన వాడు ఇసుకలో అక్షరాలు చెరపివేస్తే మరల వ్రాయగలిగే వాడు. అట్లా మనస్సు పెట్టి దిద్దని కుర్రవానికి అక్షరాలు రాకపోవుటయే

గాక శరీర మంతటా అమట్టి కొట్టుకోవటమే జరిగేది. అలానే 60 ఏళ్ళు వచ్చిన వానికి అక్షరాలు రాక పోగా యిక మట్టి కొట్టుకోవడమే మిగిలేదండీ ఇంతే దాని అర్ధము అంటూ లేవబోయెను. ఐతే శాస్త్రుల్లుగారూ 60 ఏళ్ళు వచ్చిన తర్వాత యిక చదువు ప్రయత్నం మానుకోమనేనా మీశెలవూ? అని బ్రాహ్మణుడు జాలిగా ప్రశ్నించెను. అందుకు శాస్త్రుల్లుగారు అబ్బెబ్బే నాఅభిప్రాయం అది కాదండోయి శాస్త్రకారుడేమన్నాడో తెలుసా? "జరయు వృత్తియు లేని జనునట్లు ప్రాజ్ఞుండు. ధనము విద్య గూర్చ దలపవలయు ధర్మ మాచరించదగు మృత్యువుచే తలబెట్టి ఈడ్వబడిన వాని బోలె" అన్నాడు. కనుక తనకు ముసలితనము చావు లేనట్టుగానే భావించి విద్య, ధనమును సంపాదించమని పెద్దలయాజ్ఞ ఐతే దాన ధర్మములు చేసేటప్పుడు మాత్రము మరుక్షణంతోనే చస్తానేమో అన్నట్లుగా వెంటనే దానధర్మాలు చేయు మన్నారండి తెలిసిందా! అంటూ సాభిప్రాయము, మరొక చిరునవ్వు విసిరేడు. భేష్ భేష్ యీమాట నాకు నచ్చిందండీ! అంటూ బ్రాహ్మణపంతులు రొంటినున్న రూపాయి బిళ్ళ తీసి శాస్త్రుల గారి చేతిలో నుంచెను. శాస్త్రుల్లుగారు ప్రసన్న వదనముతో "యిష్ట కామ్యార్ధ సిద్ధిరస్తు" అని దీవించి శెలవంటూ అరుగు దిగి వెడలిపోయెను.

వెంటనే బ్రాహ్మణుడు దిగ్గున లేచి ఆవూరి బడి పంతులుకు కబురుచేసి అక్షరాలు దిద్దుట ప్రారంభించి కొద్ది దినములలోనే పెద్ద బాలశిక్ష, సుమతి శతకము పూర్తి చేసెను. ఆపైన బాలరామాయణము చదువుట ప్రారంభించి అచిరకాలంలోనే అది కూడా పూర్తి చేసెను. వ్యాకరణ శాస్త్రము నేర్చుకుందామని ప్రారంభించి ఒక రోజున డుకృంకరణ సూత్రమును అరుగుమీద కూర్చొని వల్లె వేయుచుండెను. సరిగా ఆసమయంలో ఒక వేదాంత గురువుగారాదారిని బోతూ ఆగి ఆబ్రాహ్మణుని సమీపించి అట్టి సందర్భములోనే ఆచెశంకరులు అశువుగా చెప్పిన భజగోవింద శ్లోకమెకటి పటించెను. ఆశ్లోకమిది. శ్లో॥ "భజగోవిందం, భజగోవిందం గోవిందం భజమూఢమతే సంప్రాప్తే సనిహితే కాలే నహి నహి రక్షతి డుకృంకరణే" వెంటనే బ్రాహ్మణ పంతులు దిగ్గున లేచి వినయముతో నమస్కరించి ఆగుర్వువుగారిని ఆసీనులను చేసి ఆశ్లోక తాత్పర్యమును వివరించుడని కోరగా ఆగురువీ విధముగా బోధించెను. ఓ తెలివి తక్కువవాడా! యీచదువులు, యీవ్యాకరణ సూత్రాలు నిన్ను రక్షించునా! మరణము సమీపిస్తోంది, మరణానంతరము సుఖము కొరకై గోవిందుని భక్తితో ప్రార్థించుకోవలెనే

గాని యీచదువులతో ఎంత మాత్రము కాలం వృధా చేసుకోకు అని ఆదిశంకరులు హెచ్చరిస్తున్నారు అని ఆశ్లోక భావమును వివరించెను. ఈభోధ విన్న బ్రాహ్మణుడు ముకుళిత హస్తుడై స్వామీ! జరము వృత్తియు లేని జనునట్లు ప్రాజ్ఞుడు, ధనము, విద్య గూర్పదలపవలయు నన్నారుకదా పెద్దలు? తమరు యీచదువులెందుకు? అంటున్నారే దీనికి సమన్వయమెట్లు! స్వామీ శెలవీయండీ అని కోరెను.

అందుకు వేదాంతి "నాయనా! విద్యయనగా బ్రహ్మ విద్యగాని లౌకిక విద్యగాదు. లౌకిక విద్య ఐహిక సుఖ సాధనమగు ధనసంపాదనకు మాత్రమేగాని పారలౌకిక సుఖమున యీషణ్మాత్రము పనికిరాదు. అందుకు గోవిందుని భజనమే సాద్యం.

బ్రాహ్మణుడు:-గోవిందుడనగా?

వేదాంతి:- గోవిందుడనగా వేదాంత వేద్యుడగు పరమాత్మయని అర్ధము.

బ్రాహ్మణుడు:- ఐతే పరమాత్మకు యెన్నియో పేర్లుండగా గోవిందుడనే నామమే చెప్పుటలో గల విశేషమేమి స్వామీ!

వేదాంతి:- ఆదిశంకరుల గురుదేవులు గోవింద భగవత్పాదచార్యులు. ఆగురువు స్వరూప లక్షణముచే పరమాత్మ స్వరూపుడే. ఆగురు పరమాత్మను తన స్వగురుమూర్తి యొక్క నా రూపముల యందే సదాదర్శించు శంకర భగవత్పాదులిట గోవింద అను నామముతోనే శ్లోకంలో వుటంకించి నారు. అందుచే గురుపాదము లాశ్రయించి గురుసేవజేసి తరించుమని శ్లోకము యొక్క లక్ష్యార్ధము.

బ్రాహ్మణుడు:- స్వామీ బాగా అర్ధమైంది. ఇంకొక చిన్న ప్రశ్న. అరవైయేళ్ళు వచ్చిన తర్వాత గురుసేవచే కృతార్ధుడు కాగలడా? అరవైయేళ్ళు వచ్చేక చదువుకోక మన్ను కొట్టుకోనా? అనే సామెతను తమరెలా అన్వయిస్తారు స్వామీ?

వేదాంతి:- అరవైయేళ్ళు నిండిన తర్వాతనైనా నీకు సన్నిహితమగు మృత్యువు మొక్క ఆలోచనయే నీకు కలుగుట లేదా. తొందర పాటుతో అప్పుడైనా గురుమూర్తి పాదము లాశ్రయించ వలదా అట్లా గురుదరిజేరి బ్రహ్మవిద్య సంపాదించనచో నీవు నిజముగా మట్టి కొట్టు కొందువు సుమా! అనగా వుత్పత్తికి స్థానమైన పృధ్వియందు తిరిగి సస్యాదులతో చేరి అన్న స్వరూపమై నానా యోనులయందు జన్మించవలసినదే సుమా! అని అర్ధము గ్రహింపవలెను.

బ్రాహ్మణుడు:-ధన్యోస్మి అని సాష్టాంగ నమస్కారము లాచరించెను.

32. దాన ఫలము

రామశాస్త్రి సీతమ్మనే భార్యతో కాశీక్షేత్రమున కేగు రోడ్డు ప్రక్కనొక పూరింటియందు కాపురం చేయుచుండెను. సంతానము లేదు. చుట్టుపట్ల కొన్ని మైళ్ళ దూరంలో నున్న గ్రామములకేగి బిక్షాటనముచేసి రామశాస్త్రి తెచ్చిన బియ్యముతో వారు జీవించు చుండిరి. సీతమ్మ గయ్యాళి గాని దానశీలత గలది. దారిని బోవు యాత్రికులకే వైపు చూచినా 4 మైళ్ళ దూరములో ఎట్టి సత్రమును లేకుండుటచే యీబ్రాహ్మణ గృహమున వారు భోజన సౌకర్య మర్దించు చుండిరి. ఉన్నంతలో సీతమ్మ అడిగిన వారికి లేదనకుండా ఆతిద్యమిచ్చు చుండెను. ఏరోజు తెచ్చిన బియ్యము ఆరోజే ఖర్చైపోవు చుండుటచే రామశాస్త్రికి యెంతో కష్టముగా నుండెను గాని భార్య నోటికి జడిసి మౌనము వహించి వూరకుండెడి వాడు.

ఇంతలో రామశాస్త్రి అన్నగారు ప్రాణాపాయ స్థితిలో వున్న వార్త తెలిసి కొన్ని అటుకులు మూట కట్టుకొని రామశాస్త్రి ప్రయాణమై రెండురోజులగుసర్కి సగం దూరం మాత్రం నడువ గల్గెను. తెచ్చిన అటుకులు మొదటిరోజునే ఖర్చైపోయెను. రెండవరోజు నిరాహారంగానే ప్రయాణము సాగించెను. మూడవరోజు మద్యాహ్నం వరకు యెట్లో నడువగల్గెను. లోన కడుపు, పైన తల మాడుచుండగా యికనొక్క నడుగైన నడువలేక సొమ్మసిల్లి ఒక చెట్టు క్రింద రామశాస్త్రి చతికిల బడిపోయెను. ఒక కోయవాడతని అవస్థచూచి జాలిపడి తన గుడిసెకు తోడ్కొనిపోయి యింటనున్న అన్నమాతనికి బెట్టి వేసెను. ఇంతలో కోయవాని భార్యవచ్చి సంగతి తెలుసుకొని తనకన్నం లేకుండా చేసెనని భర్తతో కలహం పెట్టుకొనెను. అది చివరకు కొట్లాటగా పరిణమించగా ఆకోయవనిత చూరులో నున్న చురకత్తితో కోయవాని గొంతుకలో పొడచి పారిపోవు చుండగా కోయవాడు ఆమెపై బల్లెము విసిరెను. కోయదంపతులు గాఢముగా గాయపడి గిల గిల తన్నుకొని రామశాస్త్రి కండ్ల యెదుటనే మరణించిరి. అటనున్న తనకేమి ప్రమాదమోనని రామశాస్త్రి తన దారి పట్టి పోవుచుండెను. కాని వారి మరణమునకు తాను కారణమైతినేయని కండ్లవెంట నీరు కారుచుండగా మహాదుఃఖముతో అతడు నడక సాగించు చుండెను.

అతనికి యెదురుగా వృద్ధ బ్రాహ్మణుడొక డరుదెంచి అతని దుఃఖ కారణమడిగి తెలుసుకొని యెన్ని విధములనో యూరడించ యత్నించెను. కాని రామశాస్త్రి

దుఃఖమాగుటలేదు. ఆకలికన్నమిడి తన్ను కాపాడిన కోయవాని కిట్టి దుర్గతి ఏల కల్గెను. అన్నదానమున కిదియేనా ఫలము? అని మాటి మాటి కాతడు తలపట్టుకొని దుఃఖించు చుండెను. కాదు నాయనా! ఆకోయవాడు వచ్చే జన్మలో మహదైశ్వర్య మనుభవించును. అన్నదానమింతయని వర్ణింప నలవి కాదు అని యెన్ని విధములు చెప్పియు రామశాస్త్రిని నమ్మించజాలక "ఓయీ! యీదేశము నేలు రాజుగార్కి నేటికి సరిగా ఏడవరోజున కుమారుడు జన్మించును. ఆబిడ్డని బొడ్డు కోయకముందే గుడ్డ తాకక ముందే అన్నదాన ఫలమును గూర్చి ప్రశ్నింతువేని నిజం తెలియగలదు" అని చెప్పి ఆవృద్ధ బ్రాహ్మణుడు తన దారిన పోయెను.

రామశాస్త్రి ఆసాయంత్రమగుసర్కి అన్నగారిల్లు చేరుకొనెను. అన్నగార్కి ప్రాణాపాయ స్థితి దాటిపోయి క్రమముగా స్వస్థత చేకూర్చుచుండుట గాంచి అట నుండి ఆదేశమేలు రాజుగారి నగరుకు ప్రయాణమై రెండు రోజులకు రాజుగారి కోటకు చేరుకొనెను. అట విచారించగా రాజుగార్కి అంతకు ముందు సంతానములేదు. ఎన్నో వ్రతములు ఆచరించి ఎన్నో క్రతువులు చేసి యుండెను. ఇపుడు రాణి గర్భవతియై నేడో రేపో ప్రసవించుటకు సిద్ధముగా నుండెను అని రామశాస్త్రి తెలుసుకొనెను. వృద్ధ బ్రాహ్మణుడు చెప్పిన మాటలయందు విశ్వాసమేర్పడెను. ఏదో వుపాయముతో రాజుగారి బిడ్డనిచే అన్నదాన ఫలమును గూర్చి చెప్పించవలెనని దీక్షబూనెను. ఒక జోతిష్కుని వలె, మంత్రవేత్తవలె యుచిత వేషము ధరించి రాజుగారిని దర్శించి నేటికి సరిగా 4వరోజున తమకు పుత్రుడు జన్మించును. ఏపుణ్యవంశమున తమ గర్భవాసమున జన్మించెనో ఆవిషయము కూడా ఆశిశువు నోటనే తమకు చెప్పించగలను అని బీరములు పల్కెను. అపుడే పుట్టిన శిశువు మాట్లాడునా? రాజు గారికి ఉత్సుకత పెరిగెను. అట్లు మాట్లాడింపనిచో అది సాభిప్రాయముగా, రామశాస్త్రి మొగము చూచెను. రామశాస్త్రి నిర్భయంగా నా తల తీయించును అని గంభీరముగా పల్కెను. సరే ఏమి ఏర్పాట్లు చేయవలె? అని రాజుగారు ప్రశ్నించగా, రామశాస్త్రి ఏమియూ చేయనక్కరలేదు. పుట్టిన శిశువును పుట్టినట్లుగా బొడ్డు కోయకుండా, గుడ్డ తగలకుండా బంగారు పళ్ళెమున పరుండబెట్టి నాయెదుటకు తీసుకొని రావలెను అని రామశాస్త్రి పల్కెను. రాజుగారు తగురీతి అంతఃపురమున ఏర్పాట్లు చేయుటకు ఆజ్ఞాపించిరి. 4వదినమున రాణిగారికి ప్రసవవేదన ప్రారంభమైన వార్త తెలుసుకొని రాజుగారు రామశాస్త్రిని రావించెను.

రాణిగారు మగశిశువునే కనిరి. చైతన్య విహీనముగా బుట్టిన శిశువును అట్లే బంగారు పళ్ళెములో నిడి తీసుకొని రాగానే కమండలోదకము శిశువుపై చల్లుచూ ఓయీ! నీవృత్తాంతమేమి అని రామశాస్త్రి పలుకగానే ఆశిశువు అయ్యా నీవు చెట్టుక్రింద ఆకలితోనూ,బడలికతోనూ సొమ్మసిల్లి పడియుండగా నిన్నుగొనిపోయి నీకన్నం పెట్టిన పుణ్యఫలముచే నాకీ జన్మ కల్గినది. నీకన్నము పెట్టినందుకు జగడమాడి నన్ను పొడచి నాబల్లెంతో చచ్చిన నాభార్య నేటికి మూడవరోజున మా పెద్ద పంది గర్భమున 6వ పిల్లగా జన్మించును. దాని నొసటను తెల్లమచ్చ వుండును. నీవాదరిని పోయి చూడుము. అని పల్కి మిన్నకుండెను. పిదప శిశువు బొడ్డు కోయగా "కేరుకేరు" మని రోదనము ప్రారంభించెను. రామశాస్త్రికి రాజుగారొక అగ్రహారమును బహుమతిగా వ్రాయించి యిచ్చి సగౌరవముగా సాగనంపెను.

రామశాస్త్రి తిరుగు ప్రయాణంలో కోయవాని యింటికేగి పంది ప్రసవించిన ఆరవ పిల్లను, నుదిటిమీద మచ్చను చూచి మరల దుఃఖా క్రాంతుడై యింటికేతెంచు చుండగా తొల్లిటి వృద్ధబ్రాహ్మణుడే యెదురై అన్నదాన ఫలితమును స్వయముగా తెలిసి కొంటివి కదా! మరల దుఃఖించు చుంటివేమి? అని ప్రశ్నించెను.

స్వామీ! మీరు సాక్షాత్తు భగవత్స్వరూపులు. నా దుఃఖోశమనార్థము యీరూపంలో అవతరించారు. నేను బిచ్చమెత్తి తెచ్చిన దానితో నాబార్య నిత్యాన్నదానము చేస్తోంది. నేనేమియు అనుట లేదు గాని యిట్లు పాడుచేయుచున్నదే అని లోలోపల క్రుళ్ళిపోతూ వుండేవాడను. నాకేగతి ప్రాప్తింపనున్నదో అని బోరుబోరున ఏడవసాగెను. నాయనా దుఃఖించకు నీచేతులారా దానధర్మములు జరుగక పోయినా ఆద్రవ్యము నీదేగదా! రాజసూయయాగమున ధర్మరాజు సొత్తు దుర్యోధనుడు, కర్ణుడు దానము చేసిరి ఫలితం ధర్మరాజునకే చిక్కి స్వర్గమునకేగెను. కర్ణ,దుర్యోధనులకు ఆపుణ్యఫలము చిక్కినదా? దుఃఖించకుము. అట్లే ఈజన్మముననే దానఫలము నీకు అభవమునకు వచ్చినది. అగ్రహారము లభించినది. ఇక్కడ నుంచి ఆరాబడితో చిత్తశుద్ధితో దానధర్మములు నిత్యాన్న దానము గావించి శేష జీవితము జరుపుకో! నీకు మేలు కలుగును అని ఆశీర్వదించి వృద్ధ బ్రాహ్మణుడు తన దారిన పోయెను.

33. సౌందర్య మేది ?

"సత్యం శివము సుందరము" అని పరమాత్మ అభివర్ణింప బడుచున్నాడు. సత్యమనుటలో నామరూపాత్మిక సమస్త వస్తు జాతము నశ్వరమై యున్నదనీ పరమాత్మ యునికి దృష్ట్యా నామరూపాలు మిధ్య అయి వున్నవనీ మన మర్ధము చేసుకొన గలము. అట్లే ఆపరమాత్మ "జ్యోతిషాం జ్యోతిః" అయి సర్వమును ప్రకాశింప జేయు ప్రకాశ వస్తువై మోక్షపదము శుభకరమూనై యుండుటచే అది శివం అని కీర్తింప బడుచున్నది. కాని నిరాకారమై చర్మచక్షువుల కగోచరమై యున్న ఆపరమాత్మను సుందర వస్తువుగా వర్ణింపనేల? అని శంకించి తెలుసుకొన గోరుట సమంజసమే. ఆపరమాత్మ నిరాకారములో "అపాపవిద్ధం" అనీ "విరజం" అనీ అభివర్ణింప బడుచుండగా సాకారముతో దానిని శుద్ధ స్పటిక సన్నిభవమని సమస్త కళ్యాణా గుణకారమని కీర్తింప బడుచున్నది. కనుక ఆపరమాత్మ సౌందర్యము రూపమునకు, వర్ణమునకు సంభందించినది కాదనిన్ని గుణములకు సంభందించినదే అనిన్నీ మనం గ్రహింప వలిసియున్నది. నిజ సౌందర్యమేదో యీదిగువ కధలు కొంతవరకు నిర్ణయించగలవు.

కాశీ నగరమందు ఇరువదియేండ్ల వయస్సు గల బ్రహ్మచారి మధూకర మెత్తు కుంటూ గురుని కడ బ్రహ్మవిద్య నభ్యసించు చుండెను. ఆచరణహీనమైన వేదాంత శ్రవణం నిష్ప్రయోజనమని గుర్తించి సగుణ సంపత్తి సత్శీలము గల్గి యాతడు ప్రవర్తించు చుండెను. అతని శరీరమెంతో బలిష్టమై సువర్ణచ్ఛాయలో మిసమిసలాడుచూ పురుషు లను కూడా ఆకర్షించి ముగ్ధులను చేయు చుండెను.

మధూకర నిమిత్తమాతని ఇంటికి వచ్చిన అతని సౌందర్యమునకు 16 యేండ్ల నవ యౌవనవతియగు కులకాంత యెకతె నాతని మోహించి తన కోరిక నాతని కెరిగించెను. అందుకా బ్రహ్మచారి అమ్మా! నీవు కులకాంతవు కదా! నీ భర్తతో సర్వ సౌకర్యములు అనుభవించు చున్నది కదా! నన్నేల కోరెదవు? అని ప్రశ్నించెను. అందుకామె, నీ సౌందర్యము నన్నాకర్షించినది అని బదులిడెను. నా శరీరంలో ముఖ్యముగా నిన్నే భాగము ఆకర్షించినది అని బ్రహ్మచారి మరల ప్రశ్నించెను. అందుకామె నవ్వుచూ నీ సుందర నేత్రములు నన్నెంతో ఆకర్షించు చున్నవి అని బదులు పల్కెను. అమ్మా! స్త్రీలకు గాని పురుషులకుగాని గుణమే ప్రధానముగాని శరీర సౌందర్యము ప్రధానము కాదు. ఈ నా సౌందర్యము నా చర్మ మెంత దళసరిగా నున్నదో

అంతే లోతుగాని క్రింద రక్తమాంసాదులు రోత పదార్థములే కదా? ఈ మాత్రము చర్మ సౌందర్యమునేల ప్రేమింతువు? ప్రాతివత్యము కాపాడుకొననిచో యిహపరముల యందు భ్రష్టత్వమే పొందెదవు అని నీతి వైరాగ్యములు బోధింపసాగెను. కాని ఆ యువతి మధ్యలోనే అతని మాటలు కడ్డుపడి నా సుందర నేత్రములకు నా మనస్సు దాసురాలైంది. నిన్ను నేను వదలలేను అతని బలత్కారింప నుద్యమించెను.

ఆ బ్రహ్మచారి తటాలున తన రెండు చేతులతో ఆమె వారించు లోపలనే చివాలున తన రెండు కండ్లు పెరికి ఆమె చేతుల్లో పడవైచి అమ్మా! యివిగో నీ సుందర నేత్రములు. యిచ్చ వచ్చినట్లు చేసుకో యిక నన్ను వదిలి పెట్టుము అని చెప్పచూ ఆమె గృహము వీడిపోయెను.

ఇట్లే ప్రచారంలో నున్న మరియొక కథ కూడా యున్నది. విదవయ్యును మహా సౌందర్యవతియగు పాతికేండ్ల యువతి ఒకయింటిలో ఒకతియే కాపురము చేయు చుండెను. ఆమెను చూచిన ఒక యువకుడు రాత్రి వేళ యెట్లో ఆ ఇంట్లో ప్రవేశించి తన కోరికను ఆమెకు వెల్లడించెను. యెటులైన అతని నుండి తప్పించు కొనుటకు అతనితో అయ్యా! నేను యిపుడు అపవిత్రురాలునై యున్నాను. మరి రెండు రాత్రులు గడిచిన పిదప నాల్గవ రోజు రమ్మని కామికుని బ్రతిమిలాడగా సంతోషముగా అతడెట్లో ఆమెను వదిలి వెళ్ళిపోయెను.

గతించిన భర్త ఒక మహా వైద్యుడు. కొన్ని మూలికలు ఇంటిలో ఇంకనూ నిలువ వుండెను. వస్తు గుణములను నెరిగిన ఆ యువతి ఒకానొక మూలికను ఇంచుక అధిక మోతాదులో చూర్ణముచేసి మ్రింగివేసెను. తెల్లవారే సరికి ఆమెకు రక్త విరోచనములు, వాంతులు ప్రారంభించెను. ఆసహ్య పదార్థమంతను ఆమె సేకరించి యొక జాడిలో నిలువ చేయ సాగెను. ఆ రెండు రోజులు ఆమెను ఆవ్యాది వదల లేదు. జాడి ఇంచు మించు ఆమె శరీరము నుండి బహిర్గతమైన చీము నెత్తురులతో నిండిపోయెను. ఆమె శరీరము వాడి వత్తైపోయి బహుదుర్బలమై పోవుటచే మంచం దిగుటకు కూడ శక్తి లేక బల్లి వలె మంచం నంటుకొని పోయి యుండెను. నిర్ణీత దినమున రాత్రి 10 గంటలకు ఆ కాముకుడు మరల వెనుకటి వలెనే యింట ప్రవేశించి, ఆమె కొరకు వెతుకాలాడి మంచం నంటిపెట్టుకొని పోయి కంపు కొట్టుచున్న ఆమెను చూచి "యీ ఇంటనున్న సుందరవతి ఏమై పోయెను" అని అతడాత్రతో ప్రశ్నించెను. అందుకామె

"ఓయీ! ఆ సుందర యువతిని నేనే యీ ఇంట మరెవ్వరును లేరు" అని బదులిడెను. అతడాశ్చర్యముతో "ఆ సుందర యువతివేనా నీవు" నీ సౌందర్యమంతా ఏమైనది అని ప్రశ్నించెను. అందుకామె బక్కచిక్కిన ముఖముతో నవ్వుచూ అయ్యా! నీవునన్ను కోరు చున్నావా? లేక నా సౌందర్యమును ప్రేమించు చున్నావా? యీ శరీరము ప్రేమించినచో ఇదిగో నా శరీరము నీ యిచ్ఛ వచ్చిన రీతిగా అనుభవింపుము. నా సౌందర్యము కోరుదువా? అదిగో ఆ జాడి మూత తీయుము దానిలో నా సౌందర్యమును నీ కొరకు భద్రపరచితిని అని బదులిడెను. అతడా జాడి మూత తీసి అందు దుర్గంధయుతమగు ఆ చీము నెత్తురులను చూడలేక మూత బెట్టి చీ!చీ! ఇదేమీ అని అసహ్యించుకొనసాగెను.

నాయనా ఈ చీము నెతురులు నా శరీరములో నున్నపుడు నేనెంతో అందముగా వుండి నిన్నెంతో ఆకర్షించు చుంటిని. అవి బయటకు పోయినపుడు నా శరీరమెంతో నీకసహ్యకరమైనది. నిజము ఆ చీము నెత్తురులోనే నా సౌందర్యము ఇమిడియున్నది అని మారుపల్కెను. అయువకునికి కనువిప్పై తల వంచుకొని వచ్చిన దారినే వెడలి పోయెను.

కనుక బాహ్య సౌందర్యము లేక చర్మ సౌందర్యమే సౌందర్యము కాదు. శీల సౌందర్యము గుణ సౌందర్యము లేక హృదయ సౌందర్యమే ప్రధానముగా యెంచి నేటి యువతరము వారు తమ శ్రేయస్సు కోరిన తమ తల్లిదండ్రులు తమకై యెనుకొన్న సాంప్రదాయము సద్గుణములు గల యువతీ యువకులను వివాహమాడి సుఖింతురుగాక!

34. అపకారికి ఉపకారము

ఒకానొకప్పుడు ఒక సాధువు పంటకాల్వ బోదె గట్టుపై నుండి నడచిపోవుచుండెను. బోదిలో నీరు నిండుగా ప్రవహించుచుండగా మహా వేగమున ఒక తేలు అందుకొట్టుకొని పోవుచుండెను. అది సాధువు కంటబడినది. "సర్వభూతహితేరతః" అనే లక్షణమును తన జీవితాంతం ఆచరించుటకు దీక్షపూనెను. ఆ సాధుపుంగవుడు తేలును ఎత్తి బయట పడవేసి దాని ప్రాణమును రక్షింప వలెనని కోరి దానిని పట్టుకొనుటకు ప్రయత్నము చేయుచుండెను. అతని స్పర్శ సోకినంతనే తేలు అతని చేతిని బలముగా కుట్టెను. ఆ బాధను తట్టుకొనలేక అంతట చేయి విదిలించుటలో తేలు మరల ప్రవాహములో

కొట్టుకొని పోవుచుండెను. అపుడాసాధువు ఇట్లు యోచించెను. నిష్కారణముగా కుట్టుట దాని స్వభావము. కాని సర్వ ప్రాణులకు హితము చేయుట నాకర్తవ్యము కనుక నేను మరల ప్రయత్నింతును అని నిశ్చయించుకొని ఆ తేలును రక్షించుటకు అతడు మరల చాలా ప్రయత్నించు చుండెను. అతడు ప్రయత్నించు నపుడెల్ల ఆ తేలు నాతని కుట్టుచునే వుండెను. అయినను సాధువు పట్టు విడువలేదు. ఇది అంతయు ఆశ్చర్యంగా తిలకించుచూ ఆ దారిన బోవు వాడొకడు అతని సమీపించి "సాధుసత్తమా! అది దుష్ట జంతువు కదా! అకారణంగా అందరిని కుట్టి బాధించును కదా! దానిని రక్షింప నేల పూనుకొందువు. ఇప్పుడైన రక్షింప భూనుట మానుకొని దానిని చావ నిచ్చుటయే మేలు.అందుకా సాధువు, "ఉపకారికి నుపకారము వీపరీతముకాదు చేయ వివరింపగా, నపకారికి నుపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ" అని పద్యము చదివెను. అది విని బాటసారి నీ నేర్పరితనము మానవ సమాజములో ఏమైన పనికి వచ్చునేమో కాని యుక్తాయుక్తము లెరుగని ప్రాణుల యెడ కూడా వర్తింప జాలదు. అది గ్రహించి యిప్పటికైన నా నేర్పరి తనము విరమింపుడు అని చెప్పుచూ తన దారిని పోయెను.

35. శిక్ష యెవరికి?

కురుపాండవ యుద్ధానంతరము పాండవ జ్యేష్ఠుడగు ధర్మరాజు పట్టాభిషక్తుడై సింహాసనమును అలంకరించి రాజ్యమును సుభిక్షముగా పరిపాలించు చుండెను. ధర్మము నాలుగు పాదముల నడిపించు చుండెను. దేశ ప్రజలందరూ అతని చల్లని పరిపాలనలో శాంతి సౌఖ్యము లనుభవించు చుండిరి "కాలే వర్షత్ పరన్య, పృధిహిసస్యశాలనీ అన్నట్లుగా దేశమందు యెట్టి కల్లోలములు లేక పాలిత ప్రజలందరూ సర్వ సౌఖ్యములు అనుభవించు చుండిరి.

ఇట్లుండ నొకనాడు శ్రీకృష్ణుడు ద్వారక నుండి పాండవులను చూచుటకై వచ్చెను. ధర్మరాజతనికి ఎదురేగి సకల మర్యాదలతో తోడ్కొని వచ్చి అర్ఘపాద్యాదులు నర్పించి ఎంతో గౌరవము చేసెను. ఆనాడు సాయంత్రము శ్రీకృష్ణుడు, ధర్మరాజు లిరువురు సౌధో పరిభాగమున ఇటు,నటు, తిరుగుచూ సరస సల్లాపములాడుచుండిరి. దేశ పరిపాలన యెట్లున్నదని శ్రీకృష్ణుడు ప్రశ్నించగా, నా యొక్క ధర్మ పరిపాలనలో, నా ప్రజలందరూ, సంపూర్ణ శాంతి సౌక్యములతో తులతూగు చున్నారు. ఎవరికిని ఎట్టి లోటు లేదు, అని కించి దహంకారముతో సమాధానమిచ్చెను. తటాలున శ్రీకృష్ణుడు

పురమున కనతి దూరంలో నిలబడి మూత్రవిసర్జన చేయుచున్న ఒకనిని చూపి ఎవరతడు? అనచార భయం నాస్తి తిష్టన్ మూత్రస్య సన్నిధై" అన్నట్టుగా నిలబడి మూత్ర విసర్జన చేయుచున్నాడే అని ఆశ్చర్యము ప్రకటించెను. ధర్మరాజు చూచి వెంటనే అతనిని తీసుకురమ్మని బటులను పంపెను. భటులు పోయి ఆ వ్యక్తిని బంధించి తీసుకొని వచ్చిరి. ఇతనిని చూచి ధర్మరాజు ఎవరు నీవు? నిలబడి మూత్ర విసర్జన చేయుట దోషము కదా! అని ప్రశ్నించగా ఆ వ్యక్తి మహాప్రభో నేనొక పేద బ్రహ్మణుడను. అన్యమగు మార్గములేక కుటుంబ సంరక్షణార్థము ప్రతి నిత్యము అడవికిపోయి ఎండు కట్టె తెచ్చుకొని, నగరంలో అమ్ముకొని జీవించుచున్నాను. నెత్తిపై నున్న కట్టెల తోనె కూర్చుండి మళ్ళీ లేవ లేనేమోనని భయము చేతను మోపు క్రింద పడవేస్తే మరల ఆ మోపును నెత్తి కెక్కించుటకు చుట్టు ప్రక్కల ఎవరు కనిపించక పోవుట చేతనూ నిలబడియే మూత్ర విసర్జన చేసితిని నేను చేసినది నేరమే తగిన శిక్ష విధించి దండింపుడు" అంటూ ఆ బ్రహ్మణుడు సిగ్గుతో తలవంచుకొని ఊరకుండెను. ధర్మరాజు శ్రీకృష్ణునితో స్వామి! ఈయన కేమి శిక్ష విధించవలయును అనెను. శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుచూ ఈ నేరము చాలా విచిత్రముగా నున్నది. చేసిన పని తప్పే అయిననూ ఇట్టి పరిస్థితిలో అతడు దండ నర్హుడో? కాడో? అను విషయము నేను నిర్ణయింప జాలకున్నను పాతళ లోకమున బలి చక్రవర్తి సర్వ ధర్మ సూక్ష్మములను చక్కగా గుర్తెరిగిన వాడు. పోయి తెలిసి కొందము అని ధర్మరాజును పాతాళము పోవు ద్వారము వద్దకు గొంపోయేను. అట కాపల కాయుచున్న దాపరికునిచే పాండవ జ్యేష్టుడగు ధర్మరాజు మీ దర్శనమునకై వచ్చియున్నాడు అని కబురు చేసెను. అతడు పోయి తిరిగి వచ్చి ఆ ధర్మరాజు యెవరో మాకు తెలియదు. మాతో ఆయన కేమియు పనిలేదు అని బలి చక్రవర్తి సమాధానము పంపెను. ఆ ధర్మరాజుతో శ్రీకృష్ణుడు కూడ వచ్చి యున్నాడు అని శ్రీకృష్ణుడు తిరిగి కబురు పంపెను. ఆ వార్త విని దిగ్గున లేచి బలి చక్రవర్తి ద్వారము కడకు అతి వేగమున అరుదెంచి, శ్రీకృష్ణునకు పాదాభివందనము చేసి లోనికి గొంపోయెను. ధర్మరాజు చాలా చిన్నబుచ్చుకొని శ్రీకృష్ణుని అనుసరించెను. అర్ఘ్యపాద్యాదులచే శ్రీకృష్ణుని అర్చించి బలి చక్రవర్తి కుశల మడిగి, వచ్చిన పని యేమని విచారించెను. శ్రీకృష్ణుడు వృత్తాంతమంతయు చెప్పెను కాని తన ప్రక్క నున్న ధర్మరాజే ఆ రాజ్యమునకు రాజని మాత్రము చెప్పక ఆ బ్రహ్మణునకు యెట్టి దండన విధింప వలెను? అని బలి చక్రవర్తి అడిగెను.

బలి చక్రవర్తి ఆ రాజ్యమేలు ప్రభుని హస్తద్వయమును ఖండించుటయే తగి
శిక్ష అనెను. ఆ మాట విని శ్రీకృష్ణ ధర్మరాజులిర్వురు నివ్వెర పోయిరి. వెంటనే ధర్మరా
చేతులు చాచి ఆ దుష్ట ప్రభువుని నేనే. ఇదిగో! నా చేతులు ఖండింపుడు అనెను
శ్రీకృష్ణుడు ధర్మరాజును వారించి బలి చక్రవర్తితో నీ తీర్పు చాల విచిత్రముగా నున్నదే
నేరము చేసిన వారికి శిక్ష వేయక ప్రభువుకే శిక్షయేల? అని ప్రశ్నించెను. బలి చక్రవ
ఇట్లనెను. బ్రహ్మవేత్తలై పూజ నీయులైన బ్రహ్మణులు కట్టెలు కొట్టి బ్రతక వలస
దుర్గతి కల్గించిన ప్రభువుదే తప్పు. బ్రహ్మణుడున్న పరిస్థితిలలో చేసిన నేరము నిజముగ
నేరమే కాదు. నా రాజ్యంలో నా తండ్రి ఆబ్ధికమునకు భోక్తలుగా వచ్చుటకు బ్రహ్మణు
దొరకరు. ఆబ్దిక మింకనూ ఆరునెలలకు రానున్న దనగానే నేను స్వయముగా వారిళ్ళక
పోయి నా తండ్రి తిథిని తెలిపి ప్రార్థించు చుండవలెను. అప్పుడు వారు కరుణించి
వచ్చి భోక్తలుగా నుండెదరు. అట్లు మహా దైశ్వర్యముతో తులతూగు లాగున చూచు
బాధ్యత ప్రభునిదే అని పలికెను. ధర్మరాజునకు శృంగభంగమయ్యెను. అహంకారము
పూర్తిగా నశించెను.

36. కామమ్మ మొగుడంటే.... కాబోలు ననుకున్నా! కాకపోతే నా కర్రా బుర్రా యివతల పారేయండి!

కామమ్మకు పన్నేండ్ల వయస్సులో వివాహమైంది. ఆమె బర్త అందగాడేగాని
అక్షరాలైన రావు. కామమ్మ తండ్రి అన్నగార్లు బాగా చదువున్న పండితులు. పండుగకు
అత్త వారింటి కరుదెంచిన పాపయ్య శాస్త్రి బావమరదుల ఎగతాళి మాటలు భరించలేక
కాశీ లేచిపోయెను. పది యేండ్లు గతించిపోయేను.. పాపయ్యశాస్త్రి తిరిగి ఆయగ్రహారం
రాలేదు. ఎక్కడో చనిపోయి వుండునని యెల్లరు భావించిరి. ఛాందసులైన ఆ ఊరి
వారంతా బలత్కారముగా కామమ్మకు వైధవ్య చిహ్నము లన్నియు కల్పించిరి. యీ
వార్త ఆ ప్రాంతమంతయు ప్రాకి పోయెను.

ఆరు మాసముల అనంతరము జడలు కట్టిన జుట్టు బాగా పోయిన గడ్డం
మీసములతో ముప్పది యేండ్ల వయస్సు వాడొకడు కాశీ కావడితో ఆ ఊరే తెంచి
ఊరి చెరువులో స్నానం చేసి గట్టున కూర్చొని జపము చేయు చుండెను. అగ్రహారము
లోని అమ్మలక్కలు మంచి నీళ్ళు తీసుకొని పోవుటకై గుంపులు గుంపులుగా వచ్చి
జపము చేసుకొనుచున్న యతనిని నిదానించి చూచి కామమ్మ మగడేనని వారిలో

వారు చెప్పుకొనుచుండిరి. ఈ వార్త క్షణములో ప్రాకిపోయెను. కామమ్మ సోదరులు వచ్చి చూచి సగౌరవముగా ఇంటికి గొని పోయి కామమ్మ కాపురము కుదుట పడిందని ఆనందించుచుండిరి. పాపయ్య శాస్త్రి పాండిత్యమును పరీక్షించవలెనని బావ మరుదులువ్విళ్ళూరు చుండిరి. కాని మరల కోపించి లేచిపోవునేమోనని తొందం పడుటలేదు.

మరి ఆరుమాసములు గతించెను. భార్యను తీసుకొని స్వగ్రామంపోతానని మాట వరసకు కూడ పాపయ్య శాస్త్రి అనలేదు. ఇంతలో పాపయ్య శాస్త్రిని చూచిపోదామని అతని మేనత్త కుమారుడు వచ్చెను. పాపయ్య శాస్త్రికి గడ్డం క్రింద పెద్ద మచ్చ వుండెడిది. కాని అది ఇప్పుడు మచ్చుకైనా లేదే అని అందరి యెదుట ఆశ్చర్యము ప్రకటించెను. అందరిలో అనుమాన బీజములంకురించి నీ వెవరివో చెప్పుమని నిర్భంధించిరి. నేను పాపయ్యకాను. అందరూ కామమ్మ మొగుడంటే కాబోలు అనుకొని కాపురం చేసితిని. కామమ్మ మగణ్ణి కాదంటే నాకర్రా బర్రా యిలా పారెయ్యండి. యిప్పుడే పోతానన్నాడట.

అట్లా వుంది యీ యెరుక వ్యవహారం. యెరుకే బ్రహ్మమని నిర్ధారణ చేసి అందుకు తగిన శ్రుతులు ముందరపెడితే కాబోలునని సమ్మి మూలంలేని యీగుర్తెరిగే శరీరము అనే సంసారమందు చిక్కినే బ్రహ్మమని నిక్కి విర్రవీగుచున్నది. వివరణ గ్రంథాలు భాష్యాలు వ్రాసి యితరులను నమ్మిస్తూన్నది.

పూర్వ పుణ్య విశేషముచే పూర్ణగురు సందర్శనమై గురుముఖతః పరిపూర్ణమును అందుమూలముగాని స్థానంగాని లేని యెరుకను వస్తు నిశ్చయముగా యెరిగిన పిమ్మట"తన ముచ్చట పరికించిలేచి సకలంబు తన వెంట చనుదెంచ తన మాట తలపోయ తనకే సిగ్గయి తానట్టె చనును".

37. గురు భక్తులు ఉదంకుడు

ఉదంకుడు పైల మహర్షికి శిష్యుడు. విద్యా సంపూర్తి చేసుకొన్న మీదట పౌషక మహారాజు ధర్మపత్ని ధరించే కుండలాలు గురుదక్షిణగానిమ్మని గురుపత్ని ఉదంకుని కోరెను. ఆ కుండములు కొరకై ఉదంకుడొక మహారణ్యము గుండా ప్రయాణము చేయుచుండెను.

ఉదంకుని కెదురుగా అంబోతు నొకదానిని అధిరోహించి వచ్చు దివ్య పురుషుడొకడు దర్శన మిచ్చెను. తనకడకి అరుదెంచిన ఆ దివ్య పురుషుని తేజస్సుని చూచి అచ్చెరువొందెను. ఆ ముని కుమారుని యీ వృషభము యొక్క పేడను భుజించుమని ఆజ్ఞాపించగా నా యాజ్ఞ నుల్లంఘించనేరక ఉదంకుడట్లే నొనరించెను. ఆ దివ్యపురుషుడు చూచి సంతుష్టుడై కార్యసిద్ధియగుగాక యని ఉదంకుని నాశీర్వదించి అంతర్ధానమయ్యెను.

పౌషక మహారాజు కడకేతెంచిన ఉదంకుని పూజించి అతని రాకకు కారణ మడుగగా తన వృత్తాంత మెరుగించి గురుదక్షిణ నొసంగుటకై రాణిగారు ధరించిన కుండలముల నర్థించెను. తానిమ్మంటినని చెప్పి రాణిగారి వద్ద నుంచి తీసుకోమ్మని చెప్పెను. అట్లేనని రాణిగారికై అంతఃపురమంతయు వెదికినను ఉదంకుని కామె గానరాక పోయెను. రాజుగారా సంగతి ముని కుమారునిచే విని అయ్యా ఆమె మహా పతివ్రత. అశుచుల కామె కటబడదు ఐతే, తామర శుచులు అనినేనట్లనగలను? ఉదంకుడు తాను భుజించిన పేడ సంగతి స్ఫురించి వెంటనే పోయి తటాక జలములో స్నాన మాచరించి ఆచమనము చేసి శుచియై అంతఃపురమున కేతెంచెను. పట్టపురాణి అతని కభిముఖముగా వచ్చి గౌరముంచి తాను ధరించిన కుండలముల నొసంగి యిట్లు హెచ్చరించెను. స్వామి!వీనిని భద్రముగా తీసుకొని పోయి గుగుపత్ని కిండు. కాని వీని నెట్లయిన హరించి తీసుకుపోవలెనని తక్షకుడు అనే నాగ రాజు వేచియుంటాడు. అతడు మహామాయవి. జాగ్రత్త. అని చెప్పెను.

ఉదంకుడు తిరుగు ప్రయాణంలో దప్పిగొని కర్ణకుండలాలను గట్టుపై ఒక పవిత్ర స్థానమున నుంచి నొక జలాశయమున దిగి జలపానము చేయుచుండగా మానవ రూపంలో తక్షుడాకుండలములను తస్కరించి పారిపోవుచుండగా ఉదంకుడు వెన్నంటి నాతని పట్టుకొనబోవ తక్షుకుడొక పాము రూపము వహించి ఒక కలుగులో దూరి

పాతళ లోకము చేరెను. తపోబలం చేత ఉదంకుడు కూడ నా లోకము చేరెను. అందన్నియు నాగులే. బలాఢ్యుడైన తక్షకుని గుర్తించి పోరాడి గెల్చి కుండలములను తిరిగి సంపాదించుటెట్లు ఉదంకుడు వాసుకుని గూర్చి తపస్సు చేయగా ఒక దివ్య పురుషుడు మహాశ్వము నొక దానిపై అధిరోహించి సాక్షాత్కారించి యీ అశ్వము చెవిలో నూదుమని ఆజ్ఞాపించెను. ఉదుంకుడట్లు చేసి నంతనే ఆ యశ్వము యొక్క నాసికా రంధ్రముల నుండి మహా జ్వాలలు బయల్వెడలి నాగ లోకమును భస్మీపటల మొనర్చసాగెను. అప్పుడిక చేయవలసినది లేక తక్షకుడు క్షమాపణ గోరి కుండలములు ఉదంకుని చేతిలో బెట్టివేసెను.

కాని ఏమి ప్రయోజనం? ఆ దినమే ఆ కుండలముల ధరించుటకు సుమూహూర్త మేర్పడి యుండెను. పాతాళము నుండి బయల్వెడలి భూలోకమును చేరి కుండలము లను గురుపత్ని కీయుట యెట్లు! ఉదంకుడు చింతా క్రాంతుడయ్యెను. యిది తెలుసుకొని ఆ దివ్య పురుషుడు అశ్వం నధిరోహించి వచ్చి సకాలమునకు ఆ కర్ణ కుండలములు గురుపత్ని కొసంగి గురు దంపతుల నాశీర్వాదములు పొంది గురు ఋణము నుండి విముక్తుడాయెను.

38. శెట్టి గారి కోరిక

ఒక గడసరి శెట్టి శ్రీ మహా విష్ణువు గూర్చి దీక్షగా తపస్సు చేసెను. శ్రీ మహా విష్ణువు అతనికి ప్రత్యక్షమై ఒక్కటే ఒక్క వరమిత్తునని కోరుకొమ్మని చెప్పెను. అందుకా గడసరి శెట్టి "చిత్తం ప్రభూ! చిత్తం ఒక మనవి ఒక్క కోరికే గాని పొడగుగా ఉంటే కోపము చేయకండి మరి అడుగు మంటారా? ఫరావా లేదు? ఎంత పొడగైనా సరే ఒక్క కోరికే అడగాలని "శ్రీ మహా విష్ణువు పల్కెను. అందుకా శెట్టి చేతులు జోడించి "మహా ప్రభూ! ఏడంతస్తుల మేడ పై కెక్కి నాముని మనుమని మూడవ కుమారుని చంక నిండుకొని సంజకెంజాయలో ప్రకృతి సౌందర్యమును వీక్షించుచూ నేను యిటు అటు పచారు చేయుచుండాగా నా భార్య బంగారు గిన్నెలో పాయసాన్నము గొనితెచ్చి నాతో బాటు తిరుగుచూ నా చంకనున్న బాలునికి తినిపిస్తూ వుంటే నేను ముచ్చటగా ఆనందిస్తుండాలి. యిదే నా కోరిక స్వామీ ! అనుగ్రహించండి అని కోరు కొనెను. అందుకు శ్రీ మహా విష్ణువు ఆరినీతస్సాదియ్యా ఎన్ని కోరిక లిమిడ్చేవు ఆ ఒక్క కోరికలో 5 తరాలపాటు నీవు నీ భార్యా ఆయురారోగ్యములతో తులతూగుతూ వుండాలి.

ఏడంతస్తు లెక్కి దిగే సత్తువుండాలి, కంటి చూపైనా తగ్గరాదు. ఐదు తరముల పర్యంతము వంశవృక్షము బాగా విస్తరించాలి. ఏడంతస్తుల మేడ బంగారు పాత్రలలో పాయసాన్నము భుజించే ఐశ్వర్యము వుండాలి. ఆయురారోగ్య ఐశ్వర్యములన్నియు కోరినావు గాని కీర్తి ప్రతిష్టలు కోరుకోలేదేమి? అందుకాశెట్టి దరిద్ర నారాయణు నారాధించే యే గాంధీ గారి వంటి కోమటికోగాని లక్ష్మీనారాయణుడవైన నిన్నుపాసించు మాబోట్లకి ఎందుకండీ? ధనముంటే చాలు'' నన్నాడు శెట్టిగారు.

39. వింత పాణి గ్రహణం

విజయవాడ స్టేషన్‌లో గుంటూరు పోవు రైలు కూత వేసి బయలుదేరి నడుచుచుండగా 22 ఏండ్ల యువకుడును అరవై యేండ్ల వృద్ధుడును వగర్చుకొంటూ వచ్చి ఎట్లో పెట్టె లోనికి యెక్కిరి. యువకుడు చేతనున్న సూటికేసుతో చొరవగా చోటుకై ముందుకు సాగుతూ తూలిపడి కూర్చొని యున్న యువతి భుజము పై పడి ఆమె ప్రక్కన చతికిల పడవలసిన వాడయ్యెను.

అంత యువతి "చూడు మామయ్యా యీ తుంటరి గాడిద. ఎంత పని చేశాడో. వీని కళ్ళు కాలిపోయాయా? అని తూలనాడ సాగెను. క్షమించండి. తూలిపడ్డాను. అనే మాటలను వినిపించుకోకుండానే యువతి మేనమామా మరికొందరూ యువకుని దూషింపసాగిరి. యువకుని పక్షంగా కొందరు "పాపం తూలిపోయేడు బుద్ధి పూర్వకంగా అంతపని చేస్తాడా'' అని సమర్థింపసాగిరి. ఉభయ పక్షముల వాదోప వాదములు యెడ తెగకుండా సాగి చివరకు కొట్లాట వరకు వచ్చుటతో మధ్యవర్తులైన కొందరు పెద్దలు కలుగజేసుకొని శాంతి స్థాపనకై ప్రయత్నించ సాగిరి. గుంటూరు స్టేషన్ వచ్చువరకు ఈ గలాటా యిట్లే సాగిపోయెను. స్టేషన్‌లో బండి ఆగిన తోడనే యువతి తండ్రి వచ్చి కూతుర్ని తన బావమరిదిని కలుసుకొని 'రండి, కారు రెడిగా వుంది' అని సామానులు పట్టించుకొని వెడలిపోయెను. యువకుడు వృద్ధుడును మెల్లగా రైలు దిగి ఎవరి కోసమో యెదురు చూచుచూ నిలబడిరి. యింతలో ఆ!ఆ! వచ్చారు నమస్కారము. బండి దాటిపోయిందేమో ననుకొన్నాను. కనబడకపోతే రండి? కృష్ణమూర్తి గారూ అని వృద్ధుని జెబ్బ కొని చిరునవ్వుతో యువకుని చేతిలో సూటికేసు అందుకొని కారు రెడిగా వుంది అని స్టేషన్ బైట వేచి యున్న నొక కారులో వారిరువురును ఎక్కించి ఒక మేడ ముందు కారు ఆపు చేయించెను. ఆ మేడ గేటులో పాలరాతిపై కె. కామేశ్వరరావు

అడ్వకేటు అని చెక్కబడి యుండెను. ప్లీడరు గారు స్వయంగా వచ్చి గేటు తీస్తూ, "ఏం వెంకట్రామాయ్యగారు వచ్చారా అంటూ కారులోనికి చూచి చిరునవ్వుతో రండి రండి బావగారు నమస్కారం దయచేయండి.' అని ఆయన నమస్కరించి దిగిన యువకుని రూపమునకు ముగ్ధుడై కమాన్, గుడ్ మార్నింగ్ అని పల్కుచూ చిరునవ్వు లొలికించెను. "ఒరేయి కుర్రాడా వీరిని బాత్‌రూమ్‌కు తీసుకెళ్ళరా కాళ్ళూ చేతులు కడుకొంటారు అంటూ కుర్రవానికి పురమాయించి పంపెను.

కారులో దిగిన వృద్ధుడు కృష్ణమూర్తిగారు ఆయనతో నున్న యువకుడు రామారావు, ఎం.ఏ., పెండ్లికొడుకు అతని తండ్రి కృష్ణమూర్తిగారూ మధ్యవర్తులూ కుర్చీలలో ఆసీనులై అల్పహారములు గైకొని యిష్టాగోష్టి సలుపుచుండిరి. ఇంతలో ప్లీడర్ గారు ఏమో అమ్మాయిని తీసుకొని రా! మరల వర్జ్యం వస్తూంది అంటూ కేక వేసారు.

రతిదేవివలె అందాలొలికించు పెండ్లి కూతుర్ని జెబ్బ పట్టుకొని తీసుకొని వచ్చి కూర్చొబెట్టి తల్లి తలుపు చాటుకు పోయెను. కొంచెం తలయెత్తి యిటు చూడమ్మా యితడే పెండ్లి కుమారుడు మధ్యవర్తి వెంకట్రామయ్యగారు రెండుమూడు సార్లు హెచ్చరించగా పెండ్లి కుమార్తె తలయెత్తి రామారావు ముఖము వంక చూచెను. చూపులు చూపులు కలిసెను.

రామారావు ఆశ్చర్య చకితుడయ్యెను. పెండ్లి కుమార్తె లీల వెంటనే తలవాల్చి కంగారు పడుచూ లోనికి పరుగెత్తి పోయెను. ఈ సంఘటన యేమియు అర్ధము గాక సభికులెల్లరూ ఒండొరుల ముఖముల చూచుకొన సాగిరి. నిస్తబ్ధత సర్వత్ర వ్యాపించెను. ఇంతలో పూలు పండ్లూ కొనుటకై దారిలో కారు దిగి వుండిన కామేశ్వర రావు గారి బావమరిది యింటి కరుదెంచి జరిగిన సంగతి తెలుసుకొని పకపక నవ్వసాగెను. విషయమంత బావమరిది వల్ల విని కామేశ్వర రావుగారు సిగ్గుపడి పోయి కృష్ణమూర్తి గారి రెండు చేతులూ పట్టుకొని క్షమించండి బావగారూ. ఇది యెరిగి చేసిన పనిగాదు. అని బ్రతిమిలాడసాగెను. రామారావు లీల సౌందర్యమున కిది వరకే దాసుడైపోయి యుండెను. తండ్రి కృష్ణమూర్తిగారు కుమారుని భావము గ్రహించి "ఆ ఏం ఫరవాలేదు. రైలులోనై పాణి గ్రహణమైపోయింది. అదియొక వింత పరిస్థితులలో జరిగినది. తాంబూలం యిప్పించండి. పుచ్చుకొంటాం ఏ అభ్యంతరం లేదాని పకపక నవ్వ సాగెను.

"ద్వాసువర్ణాపయూజ సఖయా, ఏకం వృక్షం పరిషన్వజాతే, తయోదన్యం సవ్పులం స్వాదు అత్తి అన్యో అవశ్నన్ అభిచాకకతిః"

ఒకే వృక్షము పైన సజాతీయమగు రెండు పక్షులున్నవి. ఒకటి దిగువ కొమ్మలపై నడయాడుచు స్వాదు చేదు ఫలములు తినుచూ సుఖదుఃఖములనుభవించు చున్నది. రెండవ పక్షి చిటారు కొమ్మపై కూర్చొని ఏమియు తినక నిర్వి కారముగా శాంత స్థితిలో నుండెను. క్రింద నున్న పక్షి పైనున్న పక్షి యొక్క నిర్వికారతను గ్రహించి పైకెక్కి ఆ పక్షిని చేరుకొన్నచో యిక రెండు పక్షులన్నవి లేనే లేవు. రెండు ఏకమై ఒకటే పక్షి అయిపోయెను. జీవాత్మ పరమాత్మలే ఆ రెండు పక్షులు.

రామారావే తాను పెండ్లాడవలసినయున్న పెండ్లికొడుకు అని తెలియని అజ్ఞాన దశలో లీలయెంతో దుఃఖము ననుభవించెను. కాని అతడే పెండ్లి కొడుకని గ్రహించి నప్పుడు అద్భుతాశ్చర్యములకు లోనై పాణి గ్రహణము గావించి ఆశ్చర్యానంద మనుభవించెను.

40. తత్వమసి స్వేత కేతు

శ్వేతకేతువు అనే పన్నెండేళ్ళ బాలుని తండ్రి ఉద్దాలక అరుణి గురుకులాశ్రమము లో అధ్యయనం నిమిత్తం పంపేడు శ్వేతకేతువు పన్నేండేండ్ల గురుకుల వాసము చేసి శాస్త్రాధ్యయనము చేసి వేదములన్ని వల్లేవేసి సకల విద్యలు నేర్చి మహాపండితుడై యింటికి తిరిగి వచ్చాడు.

కాని దురదృష్టము చేత శ్వేత కేతువునకు తాను నేర్చిన విద్య వినయ సంపత్తి నీయజాలక పోయెను. అతడు పాండిత్య మదముచే వీఱ్ఱవీగుచు మహా గర్విష్టుడై పోయెను. తండ్రి యగు ఉద్దాలకు డది గమనించి విచారగ్రస్తుడై కుమారుని చేరబిలిచి నాయనా! సకలం తెలుసుకొన్నానని వీఱ్ఱవీగుచున్నావు. "ఇంద్రియగోచరమగు ఆత్మతత్వమును గూర్చి యేమైన తెలుసుకొన్నావా? ఏ వస్తు తత్వాన్ని తెలుసుకొంటే సర్వమూ నీకు తెలియబడునో ఆ వస్తు పరిజ్ఞానము నీకు కలిగిందా? అని ప్రశ్నించెను. అందుకు శ్వేత కేతువు అవనత శిరస్కుడై "ఆ వస్తు పరిజ్ఞానము నాకు లేదు. మా గురువు గారికి కూడా తెలియదేమో! తెలిసివుంటే నాకు చెప్పకుందురా! అది మీరు నాకు చెప్పి కృతార్థుని చేయండి" అని వేడుకొనెను.

తన కుమారుని అహంకారము దెబ్బ తిన్నందుకు ఉద్ధాలకుడు సంతసించి

యిట్లు చెప్పదొడగెను. నాయనా! సృష్టికి పూర్వము ఒకటే తత్వము ఏకమాత్రమే యుండెను. అదే బ్రహ్మతత్వము. తాను అనేకంగా అయిపోవాలని ఆ బ్రహ్మమునకు సంకల్పం కలిగి అదే పంచభూతాలు గాను పంచభూత కార్యములైన అనేక స్థూల దేహాలు గానూ పరిణమించి ఆస్థూలో పాదులయందు తానే మరల జీవరూపంగా ప్రవేశించెను. ఆ విధంగా ఆదిలో ఏకవస్తువుగా వున్న వస్తువు నుండి యీ దృగోచరమగు అనేక నామ రూపాత్మికమగు వస్తువులావిర్భవించెను' అని సృష్టి విధాన మాతనికి తెలియ చేసెను.

శ్వేతకేతువునకు ఈ వివరణ ఎంతో సంతోషము కలిగించినది. ఐతే, "నాయన గారు నిద్రిస్తున్నపుడు లేక మరణిస్తున్నప్పుడు మనిషి యెక్కడు పోతాడో చెప్పండి" ఆరుణి "బిడ్డా" మనిషి యెక్కడకు పోతాడు శయ్యపైనే యుంటాడు. కాని తెలివి మాత్రము దాని కధిష్టానమగు ఆత్మ యందు లీనమై వుంటుంది. గాని అప్పుడు ఆ తెలివి గతాన్ని వర్ధమానాన్ని విస్మరిస్తుంది. అజ్ఞానము సమస్తమును ఆవరించి యుంటుంది అని జవాబు చెప్పాడు. మరినీ, అప్పుడాతని వాక్కు మనస్సులో మనస్సు ప్రాణంలో ప్రాణం తేజస్సులో తేజస్సు పరమ శక్తిలో లీనమై వుంటాయి. ఆ శక్తియే సూక్ష్మంగా సర్వత్రా వ్యాపించి వుంది అదే సత్యం అదే ఆత్మ , అదే నీవు. " తత్వ మసి శ్వేత కేతూ త్వమేవ తదసి" అని ముపదేశించినాడు.

ఇంకా ఇలా చెప్పుకొని పోయినాడు. ఆ సర్వ వ్యాపక వస్తువు నందు నామ రూపాలన్ని తమ వ్యష్ఠి లక్షణాలన్నిటిని గోల్పోతాయి. సర్వ నదులు సముద్రంలో కలిసి పోయినపుడు యివి పలాన నదిజలములన్ని విడదీయలేనట్లు అవిభాజ్యములై పోతాయి. ఆ విధంగా అవి భాజ్యస్థితిలో నున్న తత్వమే నీవు "తత్వమసి",'శ్వేత కేతూ అన్నాడు.

అయితే నాన్నగారూ! యీ ఆత్మ తత్వము అతి విచిత్రంగా వున్నదే దాని నింకా వివరించి కరుణించండి" అని శ్వేతకేతుప్రార్థించాడు. సరే అట్లానే వివరిస్తాను. ఒక మఱ్రి పండు తెచ్చి బ్రద్దలు కొట్టి అందేమున్నవో చూడు. గింజలున్నాయి గదా! ఒక గింజను పగలగొట్టి, యిందేమి లేదు నాన్నగారూ! అన్నాడు. ఉద్దాలకుడు నవ్వుచూ యీ మఱ్రి విత్తనంలో ఏమి లేదంటున్నావే. యీ పెద్ద మఱ్రి వృక్షము ఏమీ లేని దాని నుంచి ఎట్లావిర్భవిస్తుంది. మఱ్రి అంతయు సూక్ష్మంగా ఆ మఱ్రి విత్తనందున్నట్లేగదా!

అట్లే మహా విశ్వమంతా ఆత్మ యందు బహుసూక్ష్మంగా వుంది. ఈ ఆత్మే సర్వానికి ఆధారముగా అధిష్ఠానము అయి వుంది "తత్వమసి శ్వేతకేతూ" అన్నాడు.

ఐతే, నాన్నాగారూ!! యీ మహా విశ్వమూ ఆత్మ తత్వము ముందెచ్చోట నుండును? అని ప్రశ్నించాడు. శ్వేతకేతు "నాయనా! కొంచెం ఉప్పు బాగా మెత్తగా నూరి ఒక గ్లాసు నీళ్ళలో పోసి బాగా కరిగిన పిదప తీసుకొనిరా అని ఉద్దాలకు డాజ్ఞాపించగా శ్వేతకేతు నట్లు గావించి తెచ్చెను. నాయనా! యిప్పుడీ నీళ్ళయందు ఉప్పు ఎక్కడైన కండ్లకు కనిపిస్తున్నదా? కాని ఉప్పు దీనిలో నున్న దందువాలేదా? వుందిగదా? యెక్కడుంది. ఒక్క చుక్క రుచి చూచి ఉప్పుందో లేదో చెప్పు. అట్లే ప్రతి చుక్కయందు ఉంటుంది గదా! ఇదే వ్యాపకత్వమంటే. ఉప్పు నీళ్ళలో కలసిపోయి నీటి చుక్కల యందన్నిటి యందూ నున్నట్లే ఆత్మ అన్ని వస్తువులలో కలిసిపోయి సర్వ వ్యాపకమై వుందని తెలుసుకో! ఆ ఆత్మయే నీవు తత్వమసి శ్వేతకేతూ త్వమేవ తదసి అన్నాడు.

ఇట్టి ఆత్మానుభవం యెట్లా కలుగుతుందో సెలవీయండి అంటూ శ్వేతకేతువు తండ్రిని ప్రార్థించెను. అందు ఉద్దాలకుడు "ఒక మనిషిని కాళ్ళు చేతులు బంధించి కళ్ళకు గంతలు కట్టి తీసుకొని పోయి మహారణ్య మద్యంలో వదిలేసి వారి దారిని పోతే పాపమతడేం చేస్తాడు? బంధ విముక్తుని చేయమంటూ గోడు గోడున యేడుస్తూ వుండగా పుణ్యాత్ముడెవరో వచ్చి బంధ విముక్తుని చేస్తారు. అతడెట్లు మళ్ళీ త్రోవ కనుక్కొని చివరికింటికి చేరగల్గునో అట్లే తీవ్ర ముముక్షువు బంధ విముక్తుని చేసే గురువు సహాయముతో ఆత్మ స్థానమును గుర్తించ గలడుసుమా! అట్లే నీ ఆత్మానుభవం సాధించు. ఆ ఆత్మ యెక్కడో 14 భువనాలు దాటిన తర్వాత యెక్కడో వుందనుకోకు అది నీవే అయి యున్నావు" తత్వమసి శ్వేత కేతూ త్వమేవతదసి" అని తన ముపదేశమును ముగించాడు.

41. ప్రాణ ఘాతుకి

పూర్వము దరిద్రుడైన బ్రహ్మణుడొకడు అష్టకష్టములు బడుచూ యెట్లో భార్యతో నొక గ్రామమున కాలక్షేపము చేయు చుండెను. దంపతులిర్వురు శరీర కష్టము చేసిగాని జీవించలేని స్థితి ఏర్పడెను. తుదకు అడవికి పోయి కట్టెలు తెచ్చి సమీప నగరమున వాని నమ్మి ఆ సొమ్ముతో జీవించవలెనని వారిరువురు కలిసి అడవి కేగిరి. వారికి కట్టెలు, కొట్టుటకు గొడ్డలి యైనా లేదు.

ఎండు కట్టెలకై వారన్వేషించుచూ దొరికిన యెండు కట్టెలను ఒక చోట ప్రోగిడు చుండిరి. ఒక పొద దారి కడ్డము వచ్చుటచే దానిని యిర్వురు పట్టి ఒక వైపునకు లాగుటలో ఆ పొద క్రింద బంగారు మొహరీల రాశి వారికి దృగోచరమయ్యేను. బ్రహ్మణ్మడు ఆనందము చే యెగిరి గంతు వేసెను. కాని బ్రహ్మణుడు అయ్య బాబోయ్ ప్రాణ ఘాతుకి. ప్రాణఘాతుకి! అంటూ పరుగులంకించు కొనెను. బార్య భయాశ్చర్యము లతో భర్తను వెన్నంటి పరుగెత్తుచుండెను.

ఇంతలో ఏకోధర సోదరులైన యిర్వురు పాంధులెదురై వారిని ఆపుచేసి, విషయమును గూర్చి వారిని ప్రశ్నించిరి. బ్రహ్మణుడా పొదవైపు చేయెత్తి చూపుచూ "అదిగో! ఆ పొద క్రింద ప్రాణ ఘాతుకి వుంది. అటు పోకుడు మీ ప్రాణములు దక్కవు" అంటూ హెచ్చరిస్తూ దారి వదిలి ప్రక్కనున్న చెట్టు క్రింద చతికిల బడెను.

సోదరులిద్దరూ మంచి బలఢ్యులు ధైర్య సాహసోపేతులు. బ్రహ్మణుని భయ కారణమైన "ఆ ప్రాణఘాతుకి. ఏమో చూడవలెనని ఆ పొదవైపు సోదరులిర్వురు జాగ్రత్తగా నడచిపోయిరి. ఇంతలో, భార్య ఏమండీ! సిరి మోకాలొడ్డినట్టు ఆ ధనరాశి యిక ఎంత మాత్రము దక్కకుండా దారిన పోవు వారికి చూపించితిరేమి? అంటూ దుఃఖముతో వాపోసాగెను. అందుకా బ్రహ్మణుడు "నిజమే, ఆధన రాశియే ప్రాణఘాతుకి. "మాత పుత్ర విరోధ హిరణ్యాయ నమో నమః" అంటున్నారందుకే అన్నాడు. మీ అంతటి అమాయకులు లేరండి. మీరన్నట్లు బంగారం ప్రేమ వున్నచోట పగదెస్తుందంటారు. అవిన్నీ ఎవరో పిచ్చి వేదాంతులు చెప్పే మాటలండీ. అయ్యయ్యో చేతి కందిన నిక్షేపాన్ని చేజేతులార పోగొట్టి వెస్తిరే" అని దుఃఖించసాగెను. బ్రహ్మణుడామెను శాంతిప చేస్తూ "ఓసి, పిచ్చిదానా! కొంచెం ఓరిమి పట్టు. జరిగేది నీవే చూస్తావు. ఇటురా. ఈ పొదల వెనుక దాగుండి జరిగేదంత చూస్తు ఉందాము అని యిర్వురు పొదల మాటు నుండి చూస్తుఉండిరి.

సోదరు లిర్వురూ ఆ బంగారమును చూచి సంతోషముతో ఉబ్బి తబ్బిబ్బైరి. అన్నగారు తమ్ముని చూసి తమ్ముడూ నీవు త్వరగా ఇంటికి వెళ్ళి భోజనం చేసి నా భోజనంతో పాటు తప్పకుండా రెండు పెద్ద సంచులు కూడా తీసుకొనిరా. ఎవ్వరితో ఏమి చెప్పకుండా త్వరగా వెళ్ళు" అంటూ తమ్ముని పంపివైచి మరెవ్వరి కళ్ళ పడకుండా ఆకులలములతో బంగారమును కప్పి వైచి ప్రక్కనే కూర్చొనెను. "సామంతయు పెద్ద వాణ్ణి నేనే జాగ్రత్త పెట్టాలి వీని మాటవిని ఇస్తినా వీనికిక పట్టపగ్గాలుండవు అని ఆలోచిస్తూ, యింతలో ఒక దుష్టాలోచనకు లోనై వరలో నున్న కత్తి యొక్క వాడి సరిగా నున్నదో లేదో పరీక్షించి వరలో పెట్టి కృత నిశ్చయుడై కూర్చొండెను.

చిన్నవాడు ఆ పరుగుపరుగున అన్నగారికి భోజనమును బంగారం తీసుకొని పోవుటకు రెండు సంచులన్ను తెచ్చి అన్న ప్రక్కన ఒంగోన్ని క్రింద పెట్టు చుండెను. అన్న తటాలున కత్తి దూసి వంగి వున్న తమ్ముని శిరస్సును ఒక్క వేటున నేల పడగొట్టెను. హమ్మయ్య! పీడ విరగడైనదని బిగ్గరగా పలికి సుస్థితుడై తమ్ముడు తెచ్చిన భోజనము అయిదు నిమిషాలలో ముగించి మరి ఐదు నిమిషములలో విలవిల తన్నుకొంటూ విష ప్రయోగమంటూ నేలకొరిగి ప్రాణములు వదిలెను. పదినిమిషాలలో రెండు నిండు ప్రాణాలు బలిగొన్న ప్రాణఘాతుకి అంటూ బ్రహ్మణుడు, అతని భార్యయు ఇంటి ముఖమువైపు తొందరగా వెడలిపోయిరి.

42. సుకన్య

పూర్వ కాలమున ఒక మహా రాజునకు సుకన్య యను కుమార్తె యుండెను. ఆమె అపురూప సౌందర్యవతి. పదహారేండ్ల వయస్సు. ఒకనాడు చెలికత్తెలతో సుకన్య సమీపరణ్యామునకు విలాస యాత్రకై పోయి ఆట పాటలతో ఆనందించు చుండెను.

ఒక చోట ఒక పుట్టనుండి రెండంగుళముల యెడములో జ్యోతుల నుండి వెలువడి రెండు కాంతి కిరణములు బహిర్గతములగు చుండెను. అదియెమో సుకన్య కంతుపట్టలేదు. సుకన్య ఒక కర్ర పుల్లతో ఆ స్థానముల యందు పొడిచెను. వెంటనే ఆ పుట్ట నుండి నాకళ్ళు పొడిచిన వారి వంశము నిర్మూలమగు గాక యను వాక్యము బహిర్గతమయ్యెను. సుకన్యయును చెలికత్తెలున్ను, భయాందోళనలతో యింటికి పారిపోయి జరిగిన వృత్తాంతమంతయు రాజున కెరిగించిరి.

రాజు పరివారముతో నా అరణ్యమున కేతెంచి ఆ పుట్ట యందు చ్యవనుడును మహర్షి తపోనిష్ఠయందున్నట్లున్ను అయన నేత్రములను పొడిచి సుకన్య రాజు కుటుంబమునకు మహాప్రదవము తెచ్చి పెట్టినట్లును గ్రహించి చేతులు జోడించి వినమ్రతగాత్రుడై మా ఋషీశ్వరుని శాపవిమోచనమునకై పరిపరి విధముల ప్రార్ధిం సాగెను.

సహజముగా సత్వ గుణ సంపన్నుడైన చ్యవన మహర్షి కరిగిపోయెను. సుకన్య తన కండ్ల పొడిచి వేయక పూర్వము ఆమె రూపలావణ్యములకు ముగ్ధుడై యుండెను. ఆమెను తనకిచ్చి వివాహము గావించినచో శాపోప సంహారము చేతునని చ్యవనుడు తన అభిప్రాయమును రాజునకు వెల్లడించెను. సుకన్య జీవితమును నాశనము చేయుటయా లేక వంశనాశనము గావించు కొనుటయా! రాజు ఏమియూ నిర్ణయింప జాలక అయోమయ స్థితిలో నుండగా సుకన్య యేతెంచి నే జేసిన అపరాధముకు నేనే శిక్ష అనుభవింతును రాజవంశమును కాపాడుడు. నే జేసిన అపరాధముకు నా పాతివ్రత్య మహిమచే నేనే నివృత్తి గావించు కొందునని తండ్రిని వేడుకొనగా రాజు సంతోషించి సుకన్యను చ్యవనునికిచ్చి పెండ్లి చేసి చ్యవనుని కడ వదిలి వేసెను.

చ్యవనుడు గృహస్తుడై సుకన్య సేవలచే గృహస్తాశ్రమమును నిర్వహించు చుండెను. చ్యవనుడు మూడు కాళ్ళు ముదుసలి కూరూపి గ్రుడ్డి వాడు. ఐనను, సుకన్య ఆయనను దైవ సమానముగా పూజించుచు సమస్తోపచారములు సేయు చుండెను. కొన్ని సంవత్సరములు గడిచెను.

ఒకనాడు సుకన్య స్నానము చేసి తడిబట్టలతో నీళ్ళ బిందెతో ఆశ్రమమునకు తిరిగి వచ్చుచుండెను. దేవవైద్యులగు అశ్వని దేవతలు ఆ దారిని బోవుచూ తడిబట్టల తోనున్న ఆమె శరీర సౌందర్యమును కనులారగాంచి మోహపరవశులై ఆమె నడ్డగించి తను కోర్కెను వెల్లడించిరి. అశ్వినీ దేవతలు కూడ సౌందర్యవంతులు. యౌవ్వన వంతులు. ఐనా, సుకన్య వారిని కన్నెత్తి చూడలేదు. ఆమె పాతివ్రత్యము కచ్చెరు వొందుచూ మేము దేవ వైద్యులము. నీ పాతివ్రత్యమునకు మెచ్చితిమి నీ భర్తకు యౌవ్వనము సురద్రూపము నొసంగెదము. అపుడు మా యిర్వురిలో నొకనితో గాని లేక నీ భర్తతో గాని సర్వ సౌకర్యాలనుభవింపుమని చెప్పి చవ్యనుని రప్పించి అతనితో పాటు తామున్ను అక్కడున్న సరస్సున మునిగిలేచిరి. వారి మహిమ వలన మువ్వరు సమానవయో రూప సౌందర్యములతో అలరారుచుండిరి. వారి మువ్వురిలో తన భర్త యెవరో సుకన్య గుర్తించలేకపోయెను. వెంటనే తన పతి పాదపద్మములను మనస్సున భక్తితో ధ్యానించి వారిమువ్వురిలో చ్యవనుని గుర్తింప గల్గెను. అశ్వినీ దేవతలు వారి ఉభయులను దీవించి తమ దారినిబోయిరి.

గ్రంథ ప్రాప్తి స్థానములు

1. శ్రీ దయానంద పొన్నాల అనసూయాంబ దేవి గారు
నెం. 4-1-96, రాజయోగాశ్రమము
పాతబోయిన గూడా, సికింద్రాబాద్ - 500 008

2. శ్రీ యిలపకుర్తి లక్ష్మీ నరసమాంబ గారు
4వ వార్డు,
నర్సాపురం - 534 275
ప॥గో॥జిల్లా

3. శ్రీ శ్రీశ్రీ సీతారామచంద్ర పరిపూర్ణ బోధోపదేశ మందిరము
నెం. 10-206/ఎ, యర్రబాలెం
మంగళగిరి (పోస్టు) - 522 503
గుంటూరు జిల్లా